VISALAANDHRA Phone No. 5301
ఉదయం
Regd No. 203

విశాలాంధ్ర

203702

సంపుటి 21 సంచిక 179
విజయవాడ 25-9-71 శనివారం
6 పేజీలు 15 పై.

విశాలాంధ్ర	ఏజెంటుద్వారా	పోస్టుద్వారా
ఒకనెల	రు. 4.62	రు. 5.00
3 నెలలకు	13.86	15.00
6 నెలలకు	27.72	30.00
సంవత్సరమునకు	44.35	48.00

దినపత్రిక 15 పైసలు
ఆదివారం సంచిక 18 పైసలు
చందావివరాలు

పట్టణ ఆస్తి పరిమితి బిల్లుకు జమ్మూ-కాశ్మీర్ శాసనసభ ఆమోదం

శ్రీనగర్, సెప్టెంబరు 24

పట్టణ ఆస్తిపై పరిమితి విధింపు బిల్లును జమ్మూ-కాశ్మీర్ శాసనసభ నేడు ఆమోదించింది. ఈ బిల్లు ప్రకారం మున్సిపాలిటీ లేక నగరంలోని 5 గురు సభ్యులుగల కుటుంబానికి రు. 5 లక్షల విలువగల ఆస్తి మించి వుండరాదు.

వామపక్ష ప్రజాతంత్ర ఐక్యతకై విప్లవ ప్రజా ఉద్యమాల నిర్మాణం

అత్యంత అవసరమని ప్రదేశ్ కమ్యూనిస్టు 12వ మహాసభ ప్రతినిధుల సమావేశంలో శ్రీ చండ్ర రాజేశ్వరరావు ఉద్ఘాటన

హూపేనగర్, సెప్టెంబరు 24

"జాతీయ ప్రజాతంత్ర కర్తవ్యాలు నెరవేర్చేందుకు అవసరమైన వామపక్ష, ప్రజాతంత్రశక్తుల ఐక్యత సాధనకు విప్లవ ప్రజా ఉద్యమాల నిర్మాణం అత్యవసరం" అని భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావు నేడిక్కడ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టుపార్టీ 12వ మహాసభ ప్రతినిధుల సమావేశాన్ని ప్రారంభిస్తూ ఉద్ఘాటించారు.

జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులపై శ్రీ రాజేశ్వరరావు రెండు గంటలపాటు సమగ్రమైన నివేదిక యిచ్చారు.

జాతీయ పరిస్థితిని వివరిస్తూ, మధ్యంతర ఎన్నికలలో మితవాద, అభివృద్ధి నిరోధక శక్తులు చిత్తుగా ఓడిపోయి, ప్రగతిశీలశక్తులు బలపడటం దేశ రాజకీయ రంగంలో ఒక మలుపు అని చెప్పారు.

శ్రీ రాజేశ్వరరావుగారి ప్రసంగం ఇలా వున్నది:

నేడు మనం ఒక నూతన పరిస్థితిలో వున్నాము. దేశం ముందడుగు వేస్తున్నది. ప్రగతి పథంలో పురోగమించాలని దేశ ప్రజానీకం వాంఛిస్తున్నది. వామపక్ష,ప్రజాతంత్ర శక్తులు ఐక్యంగా వున్నట్లయితే మధ్యంతర ఎన్నికల ఫలితాలు మరింత అనుకూలంగా వుండేవి. ఈవాస్తవాన్ని అంగీకరించనొల్లక, ప్రజలు భ్రమలకు లోనైనారని చిత్రించటం అవివేకం.

ఎన్నికలలో ఇందిరా కాంగ్రెసు ప్రజలకు అనేక వాగ్దానాలు చేసింది. అయితే, ప్రస్తుత పెట్టుబడిదారీ విధానం పరిధిలో జాతిని వేధిస్తున్న సమస్యలను పరిష్కరించటం అసాధ్యం.

నిరుద్యోగ నిర్మూలన, ధరల పెరుగుదల, దారిద్ర్య నిర్మూలనం వంటి ప్రధాన సమస్యల పరిష్కారానికి భూస్వామ్య వ్యతిరేక, గుత్తపెట్టుబడిదారీవర్గ వ్యతిరేక, సామ్రాజ్యవాదవ్యతిరేకచర్యలు అవసరం. ఇదా [illegible] ప్రధాన [illegible] జాతీయబూర్జువావర్గ ప్రభుత్వం తనస్థానాన్ని [illegible] నిలుపుకోజాలదు. కాబట్టి వామపక్ష ప్రజాతంత్రశక్తుల ఐక్యత నేడు తక్షణ ఆవశ్యకమైవుంది. ఈ ఐక్యత అన్నది కేవలం [illegible] అభిలషించేదికాదు. పాలకవర్గ ప్రజా వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా విప్లవ ప్రజాశక్తులను సమీకరించాలి. కమ్యూనిస్టుపార్టీ ఇందుకు నడుంకట్టి కృషిచేయాలి.

దేశ రాజకీయ పరిణామాలలో భారత కమ్యూనిస్టుపార్టీ సరిగా వ్యవహరించింది. రాష్ట్రపతిగా శ్రీ గిరి ఎన్నిక, కాంగ్రెసులో చీలిక, మధ్యంతర ఎన్నికలలో ప్రగతిశీల

(మిగతా 5వ పేజీలో)

ఇంకే పదవీ చేపట్టే ప్రశ్నే లేదు

శ్రీ బ్రహ్మానందరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 24

తాను ముఖ్యమంత్రి పదవిని వదిలిపెట్టాక ఇక ఏ పదవినీ చేపట్టే ప్రశ్నే లేదని ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నేడిక్కడ అన్నారని యుఎన్ఐకి తెలియవచ్చింది.

నూతన ముఖ్యమంత్రి అయ్యేందుకు తెలంగాణాకు చెందిన ఏ వ్యక్తి లభించలేదని చెప్పటం భావ్యం కాదని ఆయన చెప్పారు.

ప్రధానమంత్రితో చర్చలు జరిపిన ముఖ్యమంత్రి ఢిల్లీనుండి ఈరోజు ఉదయం ఇక్కడికి వచ్చారు.

ఈ నూతన ముఖ్యమంత్రి ఎవరో తెలియజేయవలసిందని విలేకరులు పదే పదే కోరారు. అయితే తెలిపేందుకు ఆయన నిరాకరించారు.

ముఖ్యమంత్రిగా ఎవరు ఎన్నికవుతారో తానేమీ చెప్పలేనని, తానేమీ చెప్పగూడదని శ్రీ రెడ్డి అన్నారు.

నూతన నాయకుని ఎన్నిక విషయంలో లెజిస్లేచర్ల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి యింతకుపూర్వం చేసిన ప్రకటనను ఆయన దృష్టికి తీసుకురాగా ప్రధానమంత్రికి యీ విషయం తెలుసునన్నారు.

తెలంగాణాకుచెందిన వ్యక్తి ఎవ్వరూ ముఖ్యమంత్రి కాగూడదని ప్రధానమంత్రి అన్నట్లు చెప్పలేదని ఆయన అన్నారు.

నూతన నాయకుని విషయమై ప్రధానమంత్రి యింతకుపూర్వమే ఒక నిర్ణయం తీసుకున్నారని యీ మంత్రి జరిపిన సంప్రదింపులు కేవలం లాంఛనప్రాయమైనవని ఒక విలేకరి అనగా తాను ఆ విధంగా భావించటం

(మిగతా 2వ పేజీలో)

ప్రజాసమితి విలీనానికి ఎ.ఐ.సి.సి ఆమోదం

— నరసారెడ్డి వెల్లడి

హైదరాబాదు, సెప్టెంబరు 24

తెలంగాణా ప్రజాసమితి కాంగ్రెస్‌లో విలీనం కావటానికి ఎ. ఐ. సి. సి కూడా తన ఆమోదం తెలిపింది.

ప్రధాన కార్యదర్శి శ్రీ శంకరదయాళ్ శర్మ ఎ.ఐ.సి.సి. నిర్ణయాన్ని ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ నరసారెడ్డికి నేడు టెలిఫోన్ ద్వారా తెలియజేశారు. ఈవిషయాన్ని శ్రీ నరసారెడ్డి నేడు తెలిపారు. రేపు కాంగ్రెస్ కొత్త నాయకుని ఎన్నుకునేందుకు జరిగే కాంగ్రెస్ లెజిస్లేచర్ల సమావేశానికి హాజరుగావాల్సిందిగా పూర్వపు తెలంగాణా ప్రజాసమితి లెజిస్లేచర్లందరకూ కూడా ఆహ్వానాలు పంపాల్సిందిగా ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శిని, [illegible] తాను ఆదేశించినట్లు శ్రీ నరసారెడ్డి తెలియజేశారు.

దాన్నిబట్టి రేపు కొత్త నాయకుని ఎన్నుకొనే సమావేశంలో పూర్వపు ప్రజాసమితి లెజిస్లేచర్లుకూడా పాల్గొని తమ నిర్ణయాన్ని తెలుపుతారని భావింపబడుతున్నది.

కాంగ్రెసులో విలీనం కావాలని గతవారాంతంలో ప్రజాసమితి నిర్ణయించింది. ప్రజాసమితి సభ్యులు, శాసనసభలో 23 మంది, శాసన మండలిలో 7 గురు ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెసు సభ్యులు, శాసనసభలో 131 మంది శాసనమండలిలో 40 మంది ఉన్నారు.

మహాసభ ప్రాధాన్యత

హూపేనగర్, సెప్టెంబరు 24

1968 విజయవాడ మహాసభ అనంతరం దేశము, రాష్ట్ర రాజకీయ పరిస్థితిలో ముఖ్యమైన పరిణామాలు జరిగిన తరువాత ప్రస్తుతం రాష్ట్రకమ్యూనిస్టుపార్టీ 12వ మహాసభ జరుగుతున్నది.

అఖిలభారత స్థాయిలో జరిగిన భూ ఆక్రమణ పోరాటంలో భాగంగా రాష్ట్ర పార్టీ 1969-1970లో బ్రహ్మాండమైన భూ ఆక్రమణ ఉద్యమాన్ని చేపట్టింది. యీ పోరాటం 10 వేల మందికి పైగా ప్రజలు ప్రత్యక్షంగా భూమిలేని వ్యవసాయ కార్మికులు పాల్గొని లక్షలాది ఎకరాలపైగా ప్రభుత్వంజమీ భూములను ఆక్రమించుకున్నారు. మహాసభలో పాల్గొంటున్న వెయ్యిమంది ప్రతినిధులు పరిశీలకులలో చాలా మంది ప్రత్యక్షంగా పోరాటంలో పాల్గొని అరెస్టు అయ్యారు.

వ్యవసాయ కార్మికులకొరకు పెద్దఎత్తున చేసిన ఉద్యమం వలన యీ పునాది వర్గంలో పార్టీ ప్రతిష్ఠ, పలుకుబడి పెరిగింది. యీ వర్గం గ్రామీణ రంగంలో శ్రామిక వర్గానికి విశ్వాసపాత్రమైనది. యీ [illegible] 1968 ప్రారంభంలో హైదరాబాద్‌లో జరిగిన బ్రహ్మాండమైన కూలిబందు యాత్రలో ప్రతిబింబించింది.

గిరిజనులకు అండగా పార్టీ నిలబడి నిరంతరం చేస్తున్న కృషి, అలాగే తప్పు దారిపట్టిన శ్రీకాకుళ గిరిజన సాయుధ పోరాటంలో నక్సలైట్ నాయకత్వంతో జరిపిన సిద్ధాంత, రాజకీయ కృషి పార్టీకి లాభదాయకమైనవిగా రుజువైంది/పెద్ద

(మిగతా 5వ పేజీలో)

కేరళలో

కాంగ్రెస్ మంత్రుల జాబితాకు అధిష్ఠానవర్గం ఆమోదం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24

కేరళ మంత్రివర్గంలో చేరే కాంగ్రెసు పార్టీ సభ్యుల జాబితాను పార్టీ అధిష్ఠాన వర్గం నేడిక్కడ ఆమోదించింది.

శ్రీ కరుణాకరన్, శ్రీ కె. టి. జార్జి, శ్రీ వెల్లాఎచిరాన్, శ్రీ వక్కం పురుషోత్తమన్, డాక్టర్ కె. జి. అడియోడిలు కేరళ మంత్రివర్గంలో చేరే కాంగ్రెసుపార్టీ అభ్యర్థులు.

మైనారిటీ వర్గానికి చెందిన ఏ వ్యక్తి తమ పార్టీ మంత్రుల జాబితాలో లేనందున అధిష్ఠాన వర్గ ప్రతినిధి విచారాన్ని వ్యక్తం చేశారు. అయినప్పటికీ మైనారిటీ వర్గాల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రతి ప్రయత్నం జరగగలదన్నారు.

రాజ్ భవన్ ప్రకటన

తిరువనంతపురం, సెప్టెంబరు 24

కేరళ మంత్రివర్గ సభ్యులుగా కాంగ్రెసుకు చెందిన ఐదుగురిని, కమ్యూనిస్టుపార్టీకి చెందిన యిద్దరిని కేరళ గవర్నరు నేడు నియమించారు.

కమ్యూనిస్టుపార్టీ మంత్రులు శ్రీ ఎన్. ఇ. బలరామ్. పి. యస్. శ్రీనివాసన్. పి. కె. రాఘవన్‌ల రాజీనామాలను ఆమోదించినట్లు రాజ్‌భవన్ నుండి వెలువడిన పత్రికాప్రకటనలో తెలియజేశారు.

శ్రీ యం. యన్. గోవిందన్ నాయర్. టి. వి. థామస్‌లతో పాటు శ్రీ కె. కరుణాకరన్, కె. టి. జార్జి, వక్కం పురుషోత్తం, వెల్లా ఎచిరన్, కె. జి. అడియోడిలు రేపు ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తారు.

ముఖ్యమంత్రి శ్రీ అచ్యుతమీనన్ మధ్యాహ్నం గవర్నరును కలుసుకుని కమ్యూనిస్టు మంత్రుల రాజీనామాలు అందచేశారు.

పి. యస్. పి. నిర్ణయం

మంత్రివర్గంనుండి ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ యన్. కె. బాలకృష్ణన్‌ను ఉపసంహరించుకుని, ఆయన స్థానంలో రాష్ట్ర పి. యస్. పి. అధ్యక్షులు శ్రీ అత్తింగల్ గోపాలపిళ్ళైను నియమించాలని రాష్ట్ర పి. యస్. పి. కార్యవర్గం నిర్ణయించింది.

ఆంధ్ర కోస్తాలో భారీ వర్షాలు

మద్రాసు, సెప్టెంబరు 24

రానున్న 24 గంటలలో కోస్తా ఆంధ్రలో భారీవర్షాలు పడే అవకాశం వున్నదని మద్రాసు వాతావరణ పరిశోధనా కార్యాలయం ప్రకటించింది.

రాయలసీమ ప్రాంతంలో కూడ భారీ వర్షాలు అక్కడక్కడ పడవచ్చును. తెలంగాణా ప్రాంతంలో కూడా విస్తృతంగా వర్షాలు కురుస్తాయి.

బ్రెజ్నేవ్ టిటో చర్చలు

బెల్గ్రేడ్, సెప్టెంబరు 21

ప్రపంచంలోని వివిధ శక్తులు యుగోస్లావియా, సోవియట్‌ల మధ్య అభిప్రాయ భేదాలు సృష్టించి, వెంటనే దూరం చేయడానికి కుట్ర పన్నుతున్నాయని ఇక్కడి ఒక విందులో ప్రసంగిస్తూ బ్రెజ్నేవ్ హెచ్చరించారు.

నాలుగు రోజుల పర్యటనపై ఆయన నిన్న వచ్చిన సందర్భంగా ఆయన గౌరవార్థం విందు జరిగింది. యుగోస్లావియా అధ్యక్షులు టిటో ప్రసంగిస్తూ ప్రపంచంలో పెద్ద ఎత్తున వస్తున్న పరిణామాల దృష్ట్యా పూర్వపు సాంప్రదాయాలు ఇంకెంతో కాలం కొనసాగలేవని అన్నారు.

యుగోస్లావియా వ్యవహారాలలో జోక్యం చేసుకోవాలని సోవియట్ యూనియన్ భావించటంలేదని బ్రెజ్నేవ్ ఉద్ఘాటించారు. కమ్యూనిస్టు దేశాలకు "పరిమిత సార్వభౌమత్వం" సిద్ధాంతాన్ని సోవియట్ ప్రచారం చేస్తున్నదంటూ వచ్చిన ఆరోపణను బ్రెజ్నేవ్ ఖండించారు.

ఈ విషయమై వచ్చిన పుకార్లన్నీ కట్టుకథలని, కొన్ని పత్రాలు అల్లుతున్న గాలి మేడలని బ్రెజ్నేవ్ ఉద్ఘాటించారు.

బ్రెజ్నేవ్ యుగోస్లావ్ అధ్యక్షులు టిటోతో సంభాషణలు జరిపారు. వారు మూడు గంటలపాటు వివిధ విషయాలపై చర్చించారు.

రెండవ భూ ఉపగ్రహ కేంద్రం ఏర్పాటు

డెహ్రాడూన్‌లో

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24

భారతీయ రెండవ భూ ఉపగ్రహ కేంద్రాన్ని ఉత్తరప్రదేశ్‌లోని డెహ్రాడూన్‌లో నెలకొల్పుతారు. దీని టర్మినల్ భవనం న్యూఢిల్లీలో వుంటుంది.

డెహ్రాడూన్‌లోని భూ ఉపగ్రహకేంద్రం, న్యూఢిల్లీలోని టర్మినల్ భవనం మధ్య మైక్రోవేవ్ సంబంధాలు వుంటాయి.

ఈ కేంద్ర నిర్మాణానికి రు. 6.18 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేయబడింది. దీని కవసరమైన స్థలాన్ని కొనుగోలుచేయటం కూడా జరిగింది.

1974 సంవత్సరాంతానికి ఈ కేంద్రం పనిచేయటం ప్రారంభిస్తుంది.

తూర్పు బెంగాల్‌లో భుట్టో పోటీ!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24

"తూర్పు బెంగాల్"లో యాహ్యాఖాన్ జరపదలచిన ఎన్నికల్లో పోటీ చేయటానికి పీపుల్స్ పార్టీ అధ్యక్షులు భుట్టో నిర్ణయించుకున్నారు. ఆ నిర్ణయాన్ని పీపుల్స్ పార్టీ ఆమోదించిందని, పీపుల్స్‌పార్టీ కేంద్ర కమిటీ క్వెట్టాలో సమావేశమై పరిస్థితిని చర్చించిందని పాక్ రేడియో తెలిపింది.

ఖైదీల పరారీ

కృష్ణగర్, సెప్టెంబరు 24

విచారణలో వున్న 18మంది ఖైదీలు యీరోజు మధ్యాహ్నం కోర్టునుండి తప్పించుకుని పారిపోయారు. కోర్టునుండి తప్పించుకున్న వారిలో 13మంది నక్సలైట్లుకూడ వున్నారు. పోలీసులు వెంటనే గాలించి ఐదుగురు ఖైదీలను తిరిగిఅరెస్టు చేశారు.

విచారణ కోర్టుకు తీసుకురాగా ఈ ఘటన జరిగింది.

బంగ్లాదేశ్‌కు ఐ. రా. స. సాయం

కోరటానికై వెళ్ళుతున్నట్లు ముజఫర్ అహ్మద్ ప్రకటన

ముజిబ్‌నగర్, సెప్టెంబరు 23

బంగ్లాదేశ్‌ను గుర్తించి, పాదార్థిక సహాయాన్ని, నైతిక మద్దతును యివ్వవలసిందని, ఐ. రా. సకు వెళ్ళే బంగ్లాదేశ్ ప్రతినిధివర్గం కోరగలదని జాతీయ అవామీ పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ముజఫర్ నేడిక్కడ చెప్పారు.

బంగ్లాదేశ్ ప్రభుత్వ సంప్రదింపుల సంఘం సభ్యుడైన శ్రీ ముజఫర్ ఐ. రా. స. కు వెళుతున్న ప్రతినిధివర్గంలో సభ్యుడు. ఆయన నేడు న్యూయార్క్ బయలుదేరి వెళ్ళారు.

పూర్తి స్వాతంత్ర్యంకంటే తక్కువైన ఏరాజకీయ పరిష్కారాన్ని బంగ్లాదేశ్ ప్రజలు ఆమోదించబోరని ఆయన స్పష్టం చేశారు.

ఇతర పరిష్కారాలను గూర్చి మాట్లాడటం అనవసరం. ఆల్జీరియా-ఫ్రాన్స్ అంతరంగిక వ్యవహారం కానట్లే, బంగ్లాదేశ్ స్వాతంత్ర్య సమస్యకూడ పాకిస్తాన్ అంతరంగిక సమస్యకాదని, ఐక్యరాజ్య సమితిలోని సభ్యదేశాలకు మేము నచ్చచెప్పబోతున్నాము. అన్నివిధాల అది అంతర్జాతీయ సమస్య.

సామ్రాజ్యవాదశక్తులు నాటి కొత్తఉద్యమాలకు అనుకూలంగానే మాట్లాడేందుకు అలవాటు పడ్డాయి. బంగ్లాదేశ్, ప్రజాతంత్ర, సోషలిస్టు, సెక్యులర్, అలీన దేశముగా ఐక్యరాజ్య సమితికి మేం చెపుతాం" అని ప్రొఫెసర్ అహ్మద్ అన్నారు.

ఒరిస్సా ఉప ఎన్నిక ఫలితాలు

భువనేశ్వర్, సెప్టెంబరు 24

ఒరిస్సా శాసనసభకు భద్రక్ నియోజకవర్గంనుంచి జరిగిన ఉప ఎన్నికలో ఉత్కళ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ [illegible] పాహ తన సమీప ప్రత్యర్థి అయిన శ్రీ పి. కె. సామల్ (కాం)పై 2200 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు అనధికార వార్తలు తెలుపుతున్నాయి.

రూర్కెలా నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ విశ్వనాథదాస్ తన సమీప ప్రత్యర్థి (కాం)పై 1800ఓట్ల మెజారిటీతో వున్నారు.

రాజ్‌నగర్ నియోజకవర్గంలో ఉత్కళ కాంగ్రెస్‌నాయకులు శ్రీ బిజూపట్నాయక్ తన ప్రత్యర్థిపై 8వేలఓట్లమెజారిటీతో వున్నారు.

10 లక్షల టన్నుల నూనె దిగుమతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21

వచ్చే 15 నెలలకాలంలో ఇరాక్ నుండి 10 లక్షల టన్నులముడినూనె భారత్‌కు లభిస్తుంది.

ఈ మేరకు భారత్ - ఇరాక్‌లమధ్య నూతన వాణిజ్య ఒప్పందం జరిగింది.

అమాయక గిరిజన ఖైదీల విడుదలకై డిమాండ్

ప్రదేశ్ కమ్యూనిస్టుపార్టీ మహాసభ తీర్మానం

హూపేనగర్, సెప్టెంబరు 24

నక్సలైట్ల పేరిట జైలులో నిర్బంధించిన అమాయక గిరిజన ఖైదీలపైవున్న కేసులన్నింటినీ వెంటనే ఉపసంహరించి, వారిని విడుదల చేయాలని ప్రదేశ్ కమ్యూనిస్టుపార్టీ 12వ మహాసభ ఆమోదించిన తీర్మానంలో డిమాండ్ చేసింది.

మహాసభ నిన్న క్రింది తీర్మానాన్ని ఆమోదించింది.

నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేసేపేరుతో ప్రభుత్వం అనేకవందలమంది అమాయక గిరిజన ప్రజలను అరెస్టుచేసింది. ఆ ప్రాంతాలలో జరిగిన దౌర్జన్య చర్యలను పురస్కరించుకుని వారిని అనేక కేసులలో అక్రమంగా ఇరికించింది. గిరిజన ప్రజలు తరతరాలుగా అనుభవిస్తున్న దుర్భర జీవితాన్ని మెరుగుపరచడానికి యేవిధమైన చర్యను ప్రభుత్వం ఇంతకాలంగా తీసుకోలేదు. భూస్వాములు, వడ్డీవ్యాపారులు, లంచగొండి ప్రభుత్వ ఉద్యోగులు అతిక్రూరంగా సాగిస్తూ వచ్చిన దోపిడీని అరికట్టడానికి ప్రభుత్వం తిరస్కరిస్తూ వచ్చింది. గిరిజనులు సాగుచేస్తున్న భూములనుండి వారిని చట్టవ్యతిరేకంగా దోపిడీవర్గాలు బేదఖల్ చేస్తూంటే ప్రభుత్వం కిమ్మనకుండా చూస్తున్నది. నక్సలైట్ ఉద్యమాన్ని అణచేందుకు విస్తృతమైన గిరిజన ప్రాంతాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించింది. పెద్ద ఎత్తున పోలీసు, మిలటరీ క్యాంపులను నెలకొల్పి దోపిడీ వర్గాలకు అండగా, గిరిజన ప్రజలపై తీవ్రమైన నిర్బంధకాండకు పూను

(మిగతా 2వ పేజీలో)

ఐరాస అలీనదేశాల సమావేశం

దక్షిణ వియత్నాం విప్లవ ప్రభుత్వానికి ఆహ్వానం

ఐక్యరాజ్యసమితి, సెప్టెంబరు 24

ఐరాసలోని అలీన దేశాల విదేశాంగమంత్రుల సమావేశంలో దక్షిణ వియత్నాం తాత్కాలిక విప్లవ ప్రభుత్వ విదేశాంగమంత్రి శ్రీమతి బిన్ కూడా పాల్గొననున్నట్లు తెలియవచ్చింది.

శ్రీమతి బిన్ ప్రస్తుతం పారిస్ శాంతి సంప్రదింపులలో దక్షిణ వియత్నాం ప్రభుత్వ ప్రతినిధిగా పాల్గొంటున్నారు. ఈ నెల 30న ఈ సమావేశం జరుగుతుంది.

ఐరాసలో అలీన దేశాల గ్రూపు అధ్యక్షులైన టాంజానియా రాయబారి అయిన మనాంగా నాలుగురోజుల క్రితం శ్రీమతి బిన్‌కు ఈ ఆహ్వానం పంపారు.

హూపేనగర్ లో ప్రారంభమైన ప్రదేశ్ కమ్యూనిస్టు 12వ మహాసభ దృశ్యాలు

ఆరుణ పతాకానికి ఘన స్వాగతం

ప్రసంగిస్తున్న శ్రీ రావినారాయణరెడ్డి



మృతవీరుల స్మారక స్థూపంవద్ద శ్రీ రాజశేఖర్



మహాసభ ప్రతినిధులలో ఒక భాగం

తగు ఆర్థిక చర్యలు చేపట్టకపోతే ఆందోళన

భోపాల్ పత్రికా గోష్ఠిలో శ్రీ ఎన్. కె. కృష్ణన్ హెచ్చరిక

భోపాల్, సెప్టెంబరు 23

దేశంలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగ సమస్య తదితరాల విషయంలో ప్రధాన మంత్రి చేపట్టే చర్యలు ఏ మాత్రం చాలవని, ఈ విషయాన్ని కమ్యూనిస్టుపార్టీ చాలా తీవ్రంగా పరిగణిస్తున్నదని శ్రీ ఎన్. కె. కృష్ణన్ నేడిక్కడ పత్రికా గోష్ఠిలో ఉద్ఘాటించారు.

మధ్యంతర ఎన్నికల సందర్భంగా ప్రధాన మంత్రి ప్రకటించిన ఆర్థిక కార్యక్రమాన్ని గనక అమలు జరపటంలో విఫలమైతే కొచ్చిన్ మహాసభ ముగిసిన అనంతరం కమ్యూనిస్టుపార్టీ పెద్ద ఎత్తున ప్రజాందోళన చేపట్టనున్నదని శ్రీ కృష్ణన్ హెచ్చరించారు.

దేశంలో ఆర్థిక సంక్షోభం, ధరలు, నిరుద్యోగం పెరుగుదల పరిస్థితులు గుత్త పెట్టుబడిదారుల ప్రధాన సంస్థల్లో వున్న అధికార ముఠా క్రొత్త సహాయంతో సృష్టిస్తున్నవని కమ్యూనిస్టుపార్టీ భావిస్తున్నదని ఆయన వివరించారు.

కార్మికుల భాగస్వామ్యంపై కృష్ణన్ వివరణ

భోపాల్, సెప్టెంబరు 23

హిందూస్థాన్ స్టీల్ కంపెనీ డైరెక్టర్ల బోర్డుకు సభ్యుని తరపున ప్రతినిధిని ఎన్నుకోవాలని ఉక్కు మంత్రిత్వ శాఖ సిబ్బందికి పంపిన ఆహ్వానం భారత కమ్యూనిస్టుపార్టీకి ఉత్సాహమేమీ కలిగించలేదని కమ్యూనిస్టు నాయకులు, పార్లమెంటు సభ్యులు అయిన శ్రీ ఎన్. కె. కృష్ణన్ నేడు యిక్కడ పత్రికా సమావేశంలో స్పష్టీకరించారు.

ఉద్యోగులలో ఒకరిని నామినేట్ చేయవలసిందిగా ఎ. ఐ. టి. యు. సి. ప్రభుత్వానికి తెలిపిందని వెలువడిన వార్త కూడా సరియైనది కాదని ఆయన అన్నారు.

ప్రభుత్వ సంస్థల్లోని అన్ని స్థాయిల్లో కార్మికుల భాగస్వామ్యం, అదుపు వుండాలని ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టుపార్టీ మరో ప్రతిపాదన చేసిందనీ ఒక కార్మికుడు డైరెక్టర్ల బోర్డులో కూర్చున్నంత మాత్రాన ఏమీ సాధించబడదనీ, డైరెక్టర్ల మెజారిటీ నిర్ణయమే తుది నిర్ణయంగా వుండటంవల్ల యిది కార్మికులకు అపకీర్తి మాత్రమే తెచ్చి పెడుతుందని ఆయన వివరించారు.

విశ్వవిద్యాలయాలకు ప్రత్యేక పోలీసులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22

విశ్వవిద్యాలయాల ఆవరణల్లో ఘర్షణల నివారణకు విశ్వవిద్యాలయ ప్రత్యేక పోలీసులను నియమించాలన్న ప్రతిపాదన విశ్వవిద్యాలయాల ఆవరణలో ఘర్షణల నివారణను గురించి చర్చించిన ఉన్నతస్థాయీ సమావేశంలో వచ్చినట్టు తెలుస్తోంది.

సమావేశాన్ని ప్రారంభించిన హోం మంత్రిత్వశాఖ స్టేట్ మంత్రి శ్రీరామ్‌నివాస్ మిర్ధా విద్యార్థులకు, డి.టి.యు. ఉద్యోగులకు మధ్య జరిగిన హింసాయుత సంఘటనలకు విచారాన్ని వ్యక్తపరిచారు.

కాలేజీల మీదుగా వెళ్ళే మరో 500 బస్సులను వేయవలసిన ఆవశ్యకతను గురించి గవర్నరు నొక్కిచెప్పారు.

అమెరికా ఫాంటమ్ విమానాల దాడి

సైగాన్, సెప్టెంబరు 23

లావోస్, ఉత్తర వియత్నాం సరిహద్దులపై దేశభక్తి దళాల విమాన విధ్వంసక స్థావరంపై రెండు అమెరికా ఫాంటమ్ విమానాలు నిన్న దాడిచేశాయి.

సైగాన్‌లో అమెరికా సైనికవర్గాలు యీ విషయాన్ని నేడిక్కడ వెల్లడించాయి.

విజయవాడలో ఎయిర్‌లైన్స్ ఆఫీసు

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, సెప్టెంబరు 23

అక్టోబరుఒకటవతేదీనుండి విజయవాడలో ఇండియన్ ఎయిర్‌లైన్స్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు, నేడిక్కడ ఎయిర్‌లైన్స్ కమర్షియల్ మేనేజర్ శ్రీ వి. ఆర్. చక్రవర్తి పత్రికా విలేకరులకు తెలియజేశారు.

విమాన ప్రయాణీకుల సౌకర్యార్థం ఒక ప్యాసింజర్ కోచ్, కార్యాలయంలో టెలిప్రింటర్ సర్వీస్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

అక్టోబర్ 15 వ తేదీనుండి ప్రస్తుతం ఉదయంపూట నిర్వహిస్తున్న సర్వీసుతో పాటు, సాయంత్రం హైదరాబాద్-మద్రాస్, మద్రాస్-హైదరాబాద్‌కు కారవెల్లి సర్వీసు కూడా ప్రారంభమవుతుంది.

తిరుపతి విమానాశ్రయ నిర్మాణం పూర్తి కాగానే విజయవాడ, తిరుపతి, మద్రాసు సర్వీసు ప్రారంభిస్తామని తెలిపారు.

ఇంతవరకు విజయవాడలో రావ్ అండ్ సన్స్ వారు నిర్వహించుచున్న ఏజన్సీ ఆఫీసును, ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఆఫీసు ప్రారంభమవుతున్న దృష్ట్యా గుంటూరులో నెలకొల్పనున్నారు.

1962 సంవత్సరంలో ఏజన్సీ ఆఫీసు విజయవాడలో ప్రారంభించినపుడు కొద్ది మంది మాత్రమే విమాన ప్రయాణీకులు ఉండటం చేత రోజుకు రు. 5 వేల కన్నా ఆదాయం వుండేది కాదని, ఇప్పుడు రోజుకు దాదాపు రు. 50 వేల ఆదాయం వున్నదని, విమాన ప్రయాణీకుల సంఖ్య పెరిగిందని ఏజన్సీ నిర్వాహకులు శ్రీ రాఘవరావు తెలియజేశారు.

భారత్‌కు మధ్య అమెరికా దేశాల మద్దతు

శరణార్థుల సమస్యపై

న్యూయార్క్, సెప్టెంబర్ 22

బంగ్లాదేశ్ శరణార్థుల రాక నిలిచిపోవాలని, వారు తిరిగి తమ స్వగృహాలకు వెళ్ళేందుకు అనువైన పరిస్థితులు కల్పించబడాలని తాము పర్యటించిన దేశాల నాయకులు అంగీకరించారని భారత్ హోంశాఖ స్టేట్ మంత్రి శ్రీ కె. సి. పంత్ నేడిక్కడ చెప్పారు.

కరేబియన్, మధ్య అమెరికా దేశాలలో పర్యటించి మెక్సికో నుండి ఆయన నేడిక్కడకు చేరుకున్నారు. ఆయాదేశాల నాయకుల దర్శన సందర్భంగా వెల్లడించిన అభిప్రాయాలు శ్రీ పంత్ నేడిక్కడ పత్రికా విలేకరులకు వెల్లడించారు.

బంగ్లాదేశ్ సమస్యకు రాజకీయ పరిష్కారాన్ని కనుగొనటంద్వారా భద్రతా పరిస్థితులను కల్పించాలని ఆ దేశాల నాయకులు భావిస్తారని అన్నారు.

శ్రీ పంత్ గుయానా, ట్రినిడాడ్, టొబాగో, జమైకా, పనామా, నెకారుగా, క్యూబా, మెక్సికోలలో పర్యటించారు. ఈ దేశాల అధిపతులను, ప్రధాన మంత్రులను, విదేశాంగ మంత్రులను, గవర్నరు జనరల్సును కలుసుకున్నారు. బంగ్లాదేశ్ సమస్యపై సుదీర్ఘ చర్చలు జరిపారు. భారత ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ వ్రాసిన లేఖలను అందజేశారు.

తూర్పుబెంగాల్ పూర్తిగా షేక్ ముజిబుర్ రహ్మాన్‌పట్ల విశ్వాసం ప్రకటించిందని, అందువలన ఏదైనా సమర్థమైన రాజకీయపరిష్కారమైనా ఆయనతోనే కుదుర్చుకోవాలని తాను చర్చల సందర్భంగా స్పష్టం చేశానన్నారు.

తన 16 రోజుల పర్యటన అనుభవాలను తెలియజేస్తూ శరణార్థుల సమస్య ఎంత తీవ్రమైనదో ఆదేశాల నాయకులు గుర్తించారని అన్నారు.

శ్రీ పంత్ పర్యటన అనంతరం గుయానా పనామాలు సంయుక్త ప్రకటనలను విడుదల చేశారు.

Form No. 151

THE COMPANIES ACT, 1956

(*See Rule No. 315*)

MEMBERS' VOLUNTARY WINDING-UP.

Notice of appointment of Liquidator Pursuant to Sec.516

Name of the Company	NATIONAL CEMENT PIPES PRIVATE LTD., BHIMAVARAM.
Nature of Business	Manufacture of R. C. C. Pipes and Collars.
Address of the Registered Office	Bhimavaram W.G. Dt.
Name and address of the Liquidator	Sri Gottumukkala Somaraju, S/o Sri Sitaramaraju, Pennada, Bhimavaram Tq., W.G. Dt.
Date of appointment	11—9—1971.
By whom appointed	General body of the shareholders of the Company.

Bhimavaram,
20-9-1971.

G. SOMARAJU,
Signature of the Liquidator.

ముఖ్యమంత్రి

(1వ పేజీ తరువాయి)

లేదని శ్రీ బ్రహ్మానందరెడ్డి అన్నారు. "చర్చలు కేవలం లాంఛన ప్రాయమైనవని మీరు ఎందుకు భావిస్తున్నారు?" అని ఆయన అన్నారు.

నాయకత్వ సమస్యతో పాటు పెక్కు సమస్యలు చర్చకు వచ్చాయని తెలియజేశారు. అయితే చర్చల వివరాలను వెల్లడించేందుకు ఆయన నిరాకరించారు.

నాయకత్వ మార్పు సాఫీగా జరగగలదని నూతన నాయకుడు ఏకగ్రీవంగా ఎన్నిక కాగలడని ఆయన అన్నారు. లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో నూతన నాయకుని పేరు తానే ప్రతిపాదించవచ్చని ఆయన వెల్లడించారు.

"ప్రతిదీ రాష్ట్రం మంచికే జరుగుతున్నది అన్నిటికన్నా ముఖ్యమైన విషయం అది" అని ఆయన అన్నారు.

తన తన అభ్యర్థులకు మద్దతు తెలిపేందుకై పెక్కుమంది కాంగ్రెసుపార్టీ లెజిస్లేటర్లు ఢిల్లీ వెళ్ళటాన్ని ఆయన దృష్టికి తీసుకురాగా "కొంతమంది ఢిల్లీ వెళ్ళివుండవచ్చు. పదోవంతు లెజిస్లేటర్లు కూడా వెళ్ళలేదు" అని ఆయన చెప్పుతున్నారు.

సిండికేట్ సభ్యులను ఎంపిక పద్ధతిపై కాంగ్రెసులో చేర్చుకొనవలసి వుంటుందని అందువలన ఆలస్యం జరగవచ్చన్నారు.

ముఖ్యమంత్రి పదవిని విడిచాడిన తరువాత తాను ఏ పదవినైనా స్వీకరించే ప్రశ్న లేదన్నారు.

ఈ నెల 25 న ఏకగ్రీవంగా కొత్త నాయకుని ఎన్నిక

— బ్రహ్మానందరెడ్డి ప్రకటన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23

తన వారసుని ఎన్నిక, ముందు ప్రకటించిన దినమేనే వచ్చే శనివారంనాడు జరుగుతుందని, ఎన్నిక ఏకగ్రీవంగానే జరుగుతుందని శ్రీ బ్రహ్మానందరెడ్డి నేడిక్కడ సూచించారు.

నేటి సాయంత్రం ప్రధానితో చర్చలు జరిపిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆయన పై విషయం సూచించారు.

ముఖ్యమంత్రి ఎన్నిక విషయమై శ్రీ సంజీవయ్య పేరుతో సహా మరి కొందరి పేర్లను కూడా పరిశీలించడం జరిగిందని ఆయన తెలిపారు. అయితే మిగతా పేర్లను వెల్లడించడానికి ఆయన నిరాకరించారు.

ఏది ఏమైనా అధిష్ఠాన వర్గ నిర్ణయాన్ని రాష్ట్ర పార్టీ ఆమోదిస్తుందని ఆయన తెల్పారు.

తెలంగాణా ప్రాంతం నుంచి ముఖ్యమంత్రి పదవికి ఎన్నుకొనడానికి తగిన వ్యక్తి లభించటం కష్టంగా వున్నదా? అని ఒక విలేకరి ప్రశ్నించగా అలాంటిదేమీ లేదని శ్రీ బ్రహ్మానందరెడ్డి సమాధానమిచ్చారు.

రేపుకానీ శనివారంకానీ అధిష్ఠానవర్గ ప్రతినిధి ఒకరు చర్చలు జరపడానికి హైదరాబాద్ వస్తారని, శ్రీ సుబ్రహ్మణ్యంకానీ లేక శ్రీ దీక్షిత్ కానీ రావచ్చునని ఆయనచెప్పారు.

పార్టీ సమావేశంలో తన వారసుని పేరు ప్రతిపాదిస్తానని ఆయన చెప్పారు.

అధిష్ఠానవర్గ ప్రతినిధి శనివారంనాడు రాష్ట్ర కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీతో సంప్రదింపులు జరిపిన అనంతరం టెలిఫోన్‌లో ప్రధానితో సంభాషిస్తారని, ఆయనతో మాట్లాడిన తర్వాత రాష్ట్ర లెజిస్లేచర్ నాయకుని పేరును ప్రధాని సూచిస్తారని పి. టి. ఐ. విలేకరి తెలుపుతున్నారు.

ప్రధాన మంత్రితో సంజీవయ్య చర్చలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23

కాంగ్రెస్‌అధ్యక్షుడు శ్రీ డి. సంజీవయ్య ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీని నేడు కలుసుకొని 30 నిమిషాలపాటు సంభాషణలు జరిపారు.

అనంతరం విలేకరులు శ్రీసంజీవయ్యను కలుసుకోగా, చర్చల వివరాలు తెలియచేయటానికి ఆయన తిరస్కరించారు.

ఉక్కు కర్మాగారాల అభివృద్ధికి ఆటంకం

విశాఖపట్నం, సెప్టెంబరు 23

భిలాయ్, రూర్కెలా, దుర్గాపూర్ ఉక్కు ప్రాంతాలలో పట్టణాల అభివృద్ధి, పథకం ప్రకారం జరగనందువల్ల వాని అభివృద్ధిలో సమన్వయం లేకుండా పోయిందని టౌన్ ప్లానింగ్‌పై నేడు యిక్కడ జరిగిన గోష్ఠిలో దస్తూరి కంపెనీకి చెందిన ఉక్కు కర్మాగారాల నిర్మాణ సలహా ఇంజనీర్ శ్రీ ఎస్. ఆర్. కులకర్ణి వెల్లడించారు.

ఉక్కు పట్టణప్రాంతాలకు ఒక పథకం లేకుండుటవల్ల కొంత భాగం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో వుండి పోయిందని, ఈ ప్రాంతాలలో ఇండ్ల స్థలాల వ్యాపారం చట్టా వ్యాపార సరళిలో జరుగుతున్నదని తన పత్రంలో కులకర్ణి పేర్కొన్నారు.

ఈ పట్టణ ప్రాంతాలలో పథకాల లోపంవల్ల పెరిగి పోతున్న జనాభాకు తగు నివాస సౌకర్యాలు కల్పించటం సాధ్యపడలేదని, అందువల్ల యిక్కడ మురికివాడలు వెలిశాయని ఆయన తెలిపారు.

రూర్కెలా కర్మాగారం నిర్మాణ సమయంలో అక్కడ పల్లెగానీ, పట్టణంగానీ లేనప్పటికీ ఇప్పుడు అందులో పనిచేస్తున్న కార్మికులకు గృహాల సమస్య తీవ్రసమస్యగా పరిణమించిందనీ, భిలాయ్ పరిస్థితి కూడా ఇదే విధంగా వుందని ఆయన అన్నారు.

విశాఖ ఉక్కుఫ్యాక్టరీపై నివేదికను తయారు చేస్తున్న శ్రీ కులకర్ణి ఇంకా తమ ప్రసంగంలో ఉక్కు పరిశ్రమలాంటి కర్మాగారాలకు పట్టణాభివృద్ధికి సంబంధించి సమగ్ర పథకం లేనిచో - అది పరిశ్రమ అభివృద్ధిని కుంటుపరచగలదని ఇతర అనుబంధ పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందలేవని ఆయన అన్నారు.

ద్రవ్యనిధి నిబంధనావళి మార్చాలని చావన్ డిమాండ్

కామన్వెల్త్ మంత్రులసమావేశంలో ప్రసంగం

నాసూ (బహామాదీవులు), సెప్టెంబరు 24

"అంతర్జాతీయ ద్రవ్యనిధి నిబంధనావళిచాలా అసంతృప్తికరంగా వుంది. సంపన్న దేశాల అభిప్రాయానికే విలువ తప్ప వందకు పైగావున్న వర్ధమాన దేశాల అభిప్రాయానికి విలువ లేదు" అని భారత ఆర్థికమంత్రి శ్రీ చావన్ విమర్శించారు.

కామన్వెల్తు ఆర్థికమంత్రుల మహాసభలో నిన్న ప్రసంగిస్తూ ఆయన పై విధంగా చెప్పారు.

ప్రస్తుత ఆర్థిక సంక్షోభానికి సుస్థిర మారకం రేట్ల ద్వారా పరిష్కారం జరగాలని తాము వాంఛిస్తున్నట్లు ఆయన చెప్పారు.

"వర్ధమాన దేశాలైన మాకు ద్రవ్యనిధి నిబంధనావళి ఏ విధంగా చూసినా అసంతృప్తికరంగానే ఉందని ఆయన చెప్పారు. ఓటింగ్ ప్రాతినిధ్యం కూడా ఆదేశాలకిచ్చిన సంపదను బట్టే ఇస్తున్నారు. ఇది సరియైన పద్ధతికాదు దానివల్ల వందకుపైగావున్న వర్ధమాన దేశాలకు మూడవవంతు ఓటింగుహక్కు కూడా లేకుండా పోయింది. ప్రత్యేకంగా వనరులు పొందే హక్కు విషయంలోకూడా ఈ అసమానతే ప్రతిబింబిస్తున్నది అని శ్రీ చావన్ చెప్పారు.

25 సంవత్సరాల క్రితం ఏర్పరచిన అంతర్జాతీయ సహకార యంత్రాంగం ఇప్పుడు ఇబ్బందుల్లోఉంది. అంతర్జాతీయ అభివృద్ధి సంఘంస్థితికూడా ఇలాగే అవరోధంలోవున్నది. వర్ధమానదేశాల ఐ.రా.స. మహాసభ (అంక్టాడ్) రెండవ సమావేశం ధ్యేయాలు ఏమాత్రం సాధించకపోవడంవల్ల మూడవ అంక్టాడ్ సమావేశంగతి కూడా ఇంతే అవుతుంది అని చావన్ హెచ్చరించారు.

శరణార్థుల సమస్య

బంగ్లా శరణార్థుల రాకవల్ల భారత్ ఆర్థికంగా పెద్దభారాన్ని మోయాల్సి వస్తున్నదని, ఇదివరలో అభివృద్ధి కార్యక్రమాలకై కేటాయించిన దాన్నుండి 20 శాతం ఇందుకోసం భారత్ ఖర్చు పెట్టాల్సి వచ్చిందని చావన్ చెప్పారు. మరో దేశానికి చెందిన 90 లక్షల మంది భారత్‌కువచ్చారు. ఈ బాధ్యత పంచుకోవడానికి అంతర్జాతీయ దేశాలు ముందుకు రావాలి అని చావన్ విజ్ఞప్తి చేశారు.

నిక్సన్ మొండి వైఖరి

ఆర్థిక చర్యల విషయమై

వాషింగ్టన్, సెప్టెంబరు 24

అంతర్జాతీయ కరెన్సీ మారకంరేట్ల సమస్యపై అమెరికాకు అనుకూలమైన చర్య జరిగితే తప్ప అమెరికాకు దిగుమతులపై విధించిన 10 శాతం సర్చార్జిని రద్దు పర్చేది లేదని నిక్సన్ నేడు చెప్పారు.

ఇది వరకు అమెరికా సహాయంపైనే ఆధారపడిన పశ్చిమ జర్మనీ తదితర దేశాలు ఇప్పుడు వారి కాళ్ళపై నిలబడి అమెరికాతో పోటీకూడా చేస్తున్నాయని ఆయన చెప్పారు. మనతో పోటీ చేసేంతగా అభివృద్ధి పొందేందుకు వారికి సహాయం చేయగల్గినందుకు మనకి సంతోషమేఅయితే ఆ దేశాల వాణిజ్యదారులున్న సౌకర్యాలు మన వారికి లేకపోయినట్లయితే అమెరికా వాణిజ్యం దెబ్బతింటుంది అని నిక్సన్ చెప్పారు

సబ్సిడీలు లేనంత అమెరికన్ ఉత్పత్తిదారులు ఇతర దేశాలవారితో పోటీ పడగలరా అన్నదే ప్రధాన ప్రశ్న అని నిక్సన్ అన్నారు.

రాజ్యాంగ సవరణ బిల్లుకు 7 రాష్ట్రాల ఆమోదం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23

రాజ్యాంగం 24 వ సవరణ బిల్లును ఏడు రాష్ట్రాల శాసనసభలు ఆమోదించడంతో యిప్పుడిక 25 వ సవరణ బిల్లును పార్లమెంటు పరిశీలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లే.

కేరళ, ఆంధ్రప్రదేశ్, నాగాలాండ్, జమ్మూ-కాశ్మీర్, యు. పి. మహారాష్ట్ర, హిమాచలప్రదేశ్ రాష్ట్రాల శాసనసభలు రాజ్యాంగం 24వ సవరణ బిల్లును ఆమోదించాయి.

మైసూరు, పశ్చిమ బెంగాల్, గుజరాత్, పంజాబ్ రాష్ట్రాలు రాష్ట్రపతిపాలన క్రింద ఉన్నాయి. వాటిశాసనసభాధికారాలను కూడ పార్లమెంటే చెలాయిస్తున్నందున వాటిని కూడా కలుపుకుంటే ఇప్పటికి బిల్లును ధృవీకరించిన శాసనసభల సంఖ్య 11 అవుతుంది.

లోక్‌సభలో ఇంతకు మునుపే ప్రవేశపెట్టిన రాజ్యాంగం 25వ సవరణబిల్లుపై వచ్చేసమావేశంలో చర్చ ప్రారంభమవుతుంది

నవంబర్‌లో టిటో భారత్ పర్యటన

బెల్‌గ్రేడ్, సెప్టెంబరు 23

యుగోస్లావియా అధ్యక్షుడు టిటో అక్టోబర్ ఆఖరులో భారత్‌లో పర్యటిస్తారు.

మాచర్ల ఆర్. టి. సి. నాయకుని నిరశన

మాచర్ల, సెప్టెంబరు 23

గుంటూరు బ్రాంచి ఆర్. టి. సి. ఎంప్లాయీస్ యూనియన్ ఆదేశానుసారం మాచర్ల డిపో తరపున ఈ నెల 18 న ఉదయం 8 గంటలకు డిపోసెక్రటరీ శ్రీ మహంకాళి రంగారావు (డ్రైవర్) నిరశన వ్రతం జరిపారు.

డిపోలోని కార్మికులు 50 మంది హాజరై ఆర్.టి.సి. ఎంప్లాయీస్ యూనియన్ వర్ధిల్లాలి, కార్మిక ఐక్యం వర్ధిల్లాలి, కార్పొరేషన్ నిరంకుశత్వం నశించాలి అంటూ నినాదాలు యిచ్చారు. మాచర్ల టౌను కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ టి. రామాంజనేయులు శ్రీ రంగారావు మెడలో పూలదండవేసి యూనియన్ కోర్కెలను బలపరుస్తూ ప్రసంగించారు.

సెప్టెంబరు 20 వతేదీన శ్రీ టి. రామాంజనేయులు అధ్యక్షతన నిరాహారదీక్ష శిబిరంలో సభ జరిగింది. శ్రీ డి. ఈశ్వరరావు (కండక్టరు) మాచర్ల డిపో కమిటీ సభ్యులు నిరాహార వ్రతం ఎందుకుచేయవలసివచ్చిందీ వివరించుతూ మాట్లాడారు. మాచర్ల ఆర్. టి. సి. యూనియన్ వారు నిరాహారదీక్ష చేస్తున్న రంగారావుకు పూలమాలలు వేశారు. తదనంతరం రామాంజనేయులు నిమ్మరసం యిచ్చి నిరాహార దీక్షను విరమింపజేశారు.

స్థానిక సంస్థలకు కేంద్రప్రభుత్వ సంస్థలనుండి పన్ను

గుజ్రాల్ వెల్లడి

విశాఖపట్నం, సెప్టెంబరు 23

అన్ని పట్టణాలు నగరాలలోని కేంద్ర ప్రభుత్వ సంస్థలు, స్థానికసంస్థలకు పన్నులు విధిగా చెల్లించటానికి సంబంధించిన బిలును వచ్చే పార్లమెంటు సమావేశంలో ప్రవేశపెట్టడం జరుగుతుందని కేంద్ర గృహ నిర్మాణాల శాఖామంత్రి శ్రీ ఐ. కె. గుజ్రాల్ నేడు యిక్కడ రోటరీక్లబ్ సమావేశంలో వెల్లడించారు.

పట్టణాలు, నగరాల అభివృద్ధికి ప్రభుత్వ సంస్థలుగానీ, ప్రైవేటు సంస్థలుగానీ డబ్బు చెల్లించవలసి వుంటుందని ఆయన అన్నారు.

పట్టణాలు, నగరాల అభివృద్ధికి కేంద్రాన్ని డబ్బు అడగటం సర్వసామాన్యమైపోయిందనీ. ప్రతీ పట్టణం స్వంత వనరులను సృష్టించుకొనే ప్రాతిపదికపై అభివృద్ధి జరగాలని ఆయన అన్నారు.

అమెరికా దౌత్య కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23

నీగ్రో నాయకురాలు ఏంజిలా డేవిస్‌ను అక్రమంగా నిర్బంధించినందుకు నిరసన వ్యక్తం చేస్తూ నేడిక్కడ అమెరికా దౌత్య కార్యాలయం ఎదుట ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన 100 మంది విద్యార్థులు, టీచర్లు ప్రదర్శన చేశారు.

నీగ్రోల విముక్తి వుద్యమం వర్ధిల్లాలి- వర్ణవివక్ష నశించాలి- అంటూ ప్రదర్శకులు నినాదాలిచ్చారు.

కుమారి ఏంజిలాడేవిస్‌తోసహా తదితరరాజకీయ ఖైదీల నందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అమెరికా దౌత్య కార్యాలయంలో మెమొరాండం అందచేశారు.

పవరు మగ్గాలపై రంగుచీరల నేత నిషేధం

మైసూరు ప్రభుత్వంచే

బెంగుళూరు, సెప్టెంబరు 22

రాష్ట్రంలోని పవరు మగ్గాలమీద రంగు చీరల నేతను మైసూరు ప్రభుత్వం నిషేధించినట్లు గవర్నరు శ్రీ ధర్మవీర నేడిక్కడ ప్రకటించారు.

పవరు మగ్గాలపైన తయారైన చీరలు చేనేత పరిశ్రమను దెబ్బ తీస్తున్నాయని జౌళి కమీషనరు చేసిన విజ్ఞప్తి పైన పై నిర్ణయం తీసుకున్నట్లు గవర్నరు తెలియ చేశారు.

చేనేతకార్మికుల రక్షణార్థం మహారాష్ట్ర ప్రభుత్వం కూడా యిదేరకమైన నిర్ణయాన్ని తీసుకున్నట్టు తెలుస్తోంది.

గిరిజన ఖైదీలు

(1వ పేజీ తరువాయి)

కుంది. గిరిజన ప్రజలలో పెల్లుబుకుతున్న అసంతృప్తికీ ఆందోళనకు మూలమైనఆర్థిక సాంఘిక, ప్రతిబంధకాలు, విధానాలను తొలగించడానికి మారుగా ప్రభుత్వందోపిడీ వర్గాల ప్రయోజనాలను కాపాడుతూ వారిపై నిర్బంధ చర్యలకు పూనుకుంటున్నది.

విశాఖపట్నం, రాజమండ్రి, వరంగల్ జైళ్ళలోను, శ్రీకాకుళంజిల్లాలోని సబ్-జైలులలోను వందలాది అమాయక గిరిజన ప్రజలను రెండు మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం నిర్బంధించింది. వీరందరిపై అనేక అక్రమకేసులు బనాయించింది. సంవత్సరాల తరబడి వీరిపై చార్జి షీట్ పెట్టడం జరుగలేదు. చార్జిషీట్లు పెట్టిన కేసులో కూడా కోర్టుకు వీరిని హాజరు పరచటంలేదు. కేసులు పేరుతో వీరిని దీర్ఘ కాలం జైలులో వుంచాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నది.

జైలులో నిర్బంధించబడ్డ యీ గిరిజన ఖైదీల పరిస్థితి ఎంత హృదయ విదారకంగా వుందో వివరించటం సాధ్యం కాదు. ఇచ్చే రేషన్ వీరికి చాలదు. కటుకోవటానికి బట్టలు లేవు. జబ్బుచేస్తే మందులులేవు. త్రాగటానికి చుట్ట, బీడీ సౌకర్యంకూడాలేదు దూరపు జైలులో వున్నందువలన బంధువులను చూడటానికిఅవకాశాలు లేవు గత రెండు సంవత్సరాల గిరిజన ఖైదీలు సుమారు వందమంది జైలులో మరణించారంటే ప్రభుత్వం అమానుషవిధానం వైఖరి అర్థమవుతుంది.

మనదేశంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలను ఇతర గిరిజన ఖైదీలు చర్చించుకుని అర్థం చేసుకున్నారు. గిరిజన ప్రజల సమస్యలు పరిష్కరించడానికేగాక దేశం మొత్తంగా సోషలిస్టు విప్లవదిశవైపు సాగడానికి భారత కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమం ఒక్కటే సరైన మార్గమని భావించిపార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. నక్సలైట్ ఉద్యమంతో తమకు సంబంధంలేదని ఆ విధానం సరైనది కాదని కూడా ప్రకటించారు. నక్సలైట్లు అనే పేరుతో వీరందరిని దీర్ఘకాలం జైలులో నిర్బంధించి వుంచదలచుకున్న ప్రభుత్వం గిరిజన ఖైదీలు భారత కమ్యూనిస్టుపార్టీలో చేరారనే వాస్తవాన్ని సైతం ప్రపంచానికి తెలియకుండా దాచింది. ఖైదీలుగావున్న యీ గిరిజన కామ్రేడ్స్ తీసుకున్న విప్లవకర నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టుపార్టీ 12వ మహాసభ హర్షిస్తుంది. వారిని కమ్యూనిస్టు విప్లవ కుటుంబంలోని సభ్యులుగా ఆహ్వానిస్తోంది.

తక్షణమే ప్రభుత్వం గిరిజనులపైన, గిరిజనేతరులపైన వున్న కేసులన్నింటినీ బేషరతుగా ఎత్తివేసి విడుదల చేయాలని 12వ మహాసభ ముక్త కంఠంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. అందుకు ప్రజాస్వామ్యవాదు లందరు సమైక్యంగాపెద్ద ఆందోళనను చేయాలని విజ్ఞప్తి చేస్తున్నది.

శరణార్థులకు రు. 300 కోట్లకై డిమాండ్

అమెరికా సెనేట్‌లో కెన్నెడీచే బిల్లు ప్రతిపాదన

వాషింగ్టన్, సెప్టెంబరు 23

భారత్‌లోని తూర్పు బెంగాల్ శరణార్థుల సహాయార్థం 40 లక్షల డాలర్లు (రు. 300 కోట్లు) కేటాయించేందుకు ఉద్దేశించబడిన ఒక బిల్లును అమెరికా సెనేట్‌లో ఎడ్వర్డు కెన్నెడీ నేడు ప్రవేశ పెట్టారు.

సెనేట్ విభాగ శరణార్థుల సబ్ కమిటీ అధ్యక్షుడైన కెన్నెడీ బిల్లును ప్రవేశ పెడుతూ తమ సబ్ కమిటీ వచ్చే వారంలో శరణార్థుల సమస్యను పరిశీలించగలదన్నారు.

భారత్‌లోని శరణార్థుల శిబిరాలను తాను దర్శించానన్నారు. పాకిస్తాన్ ప్రభుత్వం జన హత్య చేసినందున, అమానుష చర్యలు చేపట్టినందువల్ల దాదాపు పది లక్షలమంది తూర్పు బెంగాలీలు భారత్ వచ్చారన్నారు.

అమెరికా ప్రభుత్వం మౌనం అవలంబించటాన్ని ఆయన విమర్శించారు. "దక్షిణ ఆసియాను భస్మీపటలంలోకి త్రోసివేస్తున్న ఆ పరిస్థితుల్లో మన ప్రభుత్వం ఇంకా ఎన్నాళ్ళు మౌనం వహిస్తుంది" అని ఆయన ప్రశ్నించారు.

"ఆయుధాల రవాణాను నిలిపివేసి, అత్యవసరంగా సహాయం అందవలసిన ప్రాంతానికి ఎప్పుడు పంపుతాం" అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

బ్రిటన్ విదేశాంగ మంత్రి విజ్ఞప్తి

లండన్, సెప్టెంబరు 23

బంగ్లాదేశ్ నుండి భారత్‌లో ప్రవేశించిన 80 లక్షల శరణార్థులకు అంతర్జాతీయ స్థాయిలో సహాయం చేయాలని బ్రిటన్ విదేశాంగ మంత్రి సర్ అలెక్ డగ్లస్ హోమ్ నేడిక్కడ విజ్ఞప్తిచేశారు.

పార్లమెంటులో ప్రసంగిస్తూ శరణార్థులకు సహాయం చేసే విషయమై న్యూయార్కులో ఐ. రా. స. ప్రధాన కార్యదర్శి ఊథాంట్‌తో తాను చర్చలు జరపగలనన్నారు.

ఐ. రా. స ద్వారానే అంతర్జాతీయ సహాయాన్ని అందజేయవచ్చని తమ ప్రభుత్వం విశ్వసిస్తున్నదన్నారు.

పాంపిడో ప్రకటన

పారిస్, సెప్టెంబరు 23

తూర్పు బెంగాల్ సంక్షోభానికి పోరాటం ద్వారాగాక రాజకీయ మార్గాల ద్వారానే పరిష్కారాన్ని కుదుర్చుకోవలసిన ఆవశ్యకత వున్నదని ఫ్రాన్స్ అధ్యక్షుడు జార్జి పాంపిడో నేడిక్కడ అన్నారు.

ఒరిస్సాలో ప్రత్యామ్నాయ ప్రభుత్వఏర్పాటుకు పిలుపు

రాష్ట్ర కమ్యూనిస్టుపార్టీ మహాసభచే

భువనేశ్వర్, సెప్టెంబరు 23

ప్రస్తుత మిశ్రమ మంత్రివర్గం స్థానే- కాంగ్రెసు, తదితర ప్రజాతంత్ర వామపక్షాలు కలిసి రాష్ట్రంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఒరిస్సా రాష్ట్ర కమ్యూనిస్టు సమితి మహాసభ నేడిక్కడ పిలుపు ఇచ్చింది.

పై మేరకు మహాసభ ఒక ముసాయిదా తీర్మానాన్ని ఆమోదించింది.

అయితే అలాంటి ప్రత్యామ్నాయ ప్రభుత్వానికి తమ మద్దతుమాత్రమే అందచేస్తామని, మంత్రివర్గంలో తమ పార్టీ చేరదని తీర్మానం స్పష్టీకరించింది.

ప్రస్తుతం ఏలుతున్న ఒరిస్సా మిశ్రమ మంత్రివర్గం అభివృద్ధి నిరోధకధోరణికలది. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా, తటస్థవైఖరిని అవలంబించడం కానీ, ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోయేపార్టీకి మద్దతు అందచేయక పోవడం కానీ తిరిగి రాష్ట్రపతిపాలనను విధించడానికి, మళ్ళీ ఎన్నికలు నిర్వహించడానికి మాత్రమే దారి తీస్తుందని ఆ తీర్మానం పేర్కొన్నది.

వామపక్ష, ప్రజాతంత్ర అభ్యుదయపార్టీల సహకారంతో కాంగ్రెస్‌పార్టీ ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసిన అవసరం వున్నదని రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిశీలించిన అనంతరం కమ్యూనిస్టుపార్టీ భావిస్తున్నదని ఆ తీర్మానం తెలిపింది.

ఉమ్మడి కనీస కార్యక్రమం ప్రాతిపదికపై ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి, నిరుద్యోగ నిర్మూలన, ప్రభుత్వ బంజర్ల పంపకం, పారిశ్రామికీకరణ, భూ గరిష్ఠ పరిమితిని 15 స్టాండర్డ్ ఎకరాలకు తగ్గింపు వగైరా సమస్యలపై సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ 18 అంశాలున్న ఒక ఉమ్మడి కనీస కార్యక్రమాన్ని ఆ తీర్మానం ప్రతిపాదించింది.

కెన్యా ఉపాధ్యక్షునితో శ్రీ గోఖలే భేటీ

నైరోబీ, సెప్టెంబరు 23

భారత న్యాయశాఖ మంత్రి శ్రీ హెచ్. ఆర్. గోఖలే నేడు కెన్యా ఉపాధ్యక్షుడు డేనియల్ ఆరప్ మోయిని కలుసుకుని బంగ్లాదేశ్ సమస్యను గూర్చి వివరించారు.

అధ్యక్షుడు జోమో కెన్యట్టాను రేపు కలుసుకుంటారు.

శ్రీ గోఖలే యింతవరకు జాంబియా. బురుండి. ఇథియోపియా, ఉగాండా, టాంజానియాలలో పర్యటించారు.

శ్రీ గోఖలే నేడిక్కడ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ శరణార్థుల సమస్య అంతర్జాతీయ సమస్యయని ఆఫ్రికాదేశాల నాయకులు అంగీకరించారని తెలిపారు.

భారతదేశం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల కేంద్ర, తూర్పు ఆఫ్రికాదేశాల నాయకులు సానుభూతి ప్రకటించారన్నారు.

శరణార్థుల సంఖ్య 90 లక్షలకు చేరిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23

భారత్‌లోకి ప్రవేశించిన బంగ్లాదేశ్ శరణార్థుల సంఖ్య ఇప్పటికి 90 లక్షలకు చేరుకున్నదని, ఇప్పటిప్పుడే శరణార్థుల రాక ఆగిపోయే సూచన లేవీ కనబడటం లేదని సరిహద్దు ప్రాంతాల నుండి వచ్చిన వార్తలు తెలుపుతున్నాయి

నిన్న ఒక్కరోజులోనే 30 వేల మంది శరణార్థులు భారత్‌లో ప్రవేశించారు.

వచ్చిన ప్రతి శరణార్థి కూడా పాక్ సైనికులు తమ దేశం పౌరులను హింసిస్తున్నారని, అక్కడ ఆహారధాన్యాల తీవ్ర కొరత ఏర్పడిందని చెప్పుతున్నారు.

భుట్టో హెచ్చరిక

కరాచీ, సెప్టెంబరు 22

వచ్చే డిసెంబరు మాసాంతంలోగా జాతీయ అసెంబ్లీకి పూర్తి అధికారాలు దఖలు పరచకపోతే తమపార్టీ ఇతర పద్ధతుల నవలంబించ వలసివస్తుందని పీపుల్స్‌పార్టీ అధ్యక్షుడు జడ్. ఎ. భుట్టో హెచ్చరించారు.

ఇక్కడ ఒకపత్రికా గోష్ఠిలో ప్రసంగిస్తూ ఆయన పై హెచ్చరిక చేశారు.

ఈ సంవత్సరాంతంలోగా పాకిస్తాన్‌లో ప్రజా స్వామ్యాన్ని పునరుద్ధరించకపోతే, ఇక ఎప్పటికీ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించలేరని తాను హెచ్చరించగలనని ఆయనన్నారు.

జాతీయ అసెంబ్లీ సమావేశాన్ని ఈ సంవత్సరాంతం లోగా ఏర్పాటు చేయాలని ఆయన నొక్కి చెప్పారు. తూర్పుబెంగాల్‌లో ప్రస్తుతం నెలకొనివున్న పరిస్థితివల్ల ఎన్నికలను వాయిదా వేయరాదనీ, పశ్చిమ పాకిస్తాన్‌లోకూడా ఎన్నికలు జరపవచ్చుననీ ఆయనన్నారు.

తూర్పుబెంగాల్ సమస్యపై భారతపాకిస్తాన్ల మధ్య శాంతిని నెలకొల్పేందుకు నాలుగు అగ్రరాజ్యాల జోక్యాన్ని గురించి వచ్చిన వార్తలను ప్రస్తావిస్తూ, చైనా లేకుండా ఉపఖండంలో శాంతిని నెలకొల్పటం అసాధ్యమన్నారు.

అమెరికా దింపుడుకళ్ళం ఆశ

ఐ.రా.స.లో తైపే స్థానంపై

వాషింగ్టన్, సెప్టెంబరు 24

ఐరాసలో తైపే స్థానాన్ని ఇంకా రక్షించడానికి తమకు అవకాశం ఉందని అమెరికా విశ్వసిస్తున్నదని అమెరికా ప్రభుత్వ ప్రతినిధి చార్లెస్ బ్రే నిన్న చెప్పారు.

తైపేను కూడా ఐ రా స లో కొనసాగింపజేయాలనే విషయాన్ని ఎజెండాలో చేర్చాలని ఐ. రా. స సార్వత్రికసభ సమావేశంలో నిన్న అమెరికా చేసిన ప్రయత్నం విఫలమైన విషయం పాఠకులకు విదితమే. ప్రజా రిపబ్లిక్ చైనాకు ఐ. రా. స లో స్థానాన్ని పునరుద్ధరించాలని కోరే అల్బేనియా తీర్మానానికి ఎజెండాలో స్థానం లభించింది.

అయితే ఐరాస సర్వసభ్య సమావేశంలో తైపేకు తగినంత మెజారిటీ లభిస్తుందని అమెరికా నమ్ముతోంది. తైపేను ఐరాస నుండి తొలగించడానికి మూడింట రెండు వంతుల మెజారిటీ కావాలి అనే తీర్మానాన్ని అమెరికా ప్రవేశ పెట్ట దల్చింది. అలా అయితే అప్పుడు తైపేను తొలగించడం సాధ్యంకాకుండాపోతుందని అమెరికా దురాలోచన.

లోగడ ఐరాస ఉపాధ్యక్షపదవికి తైపేపోటీ చేసినపుడు 73 ఓట్లు వచ్చాయని చార్లెస్‌బ్రే చెప్పారు. ఇది అవసరమైన మెజారిటీ కన్నా 7 ఓట్లు హెచ్చు అని బ్రే చెప్పారు.

బ్రిటన్ వైఖరి

ఐ. రా. స, సెప్టెంబరు 23

చైనాకు ఐ రా స లో ప్రాతినిధ్యం కలిగించే విషయంలో ఏ విధమైన జాప్యాన్ని గాని, అవరోధంగాని కల్పించేదేదీ చేయకూడదని ఐరాసలోని బ్రిటన్ ప్రతినిధి వర్గానికి ఆదేశాలందాయని తెలియవచ్చింది. దీన్నిబట్టి బ్రిటన్ విధానం అల్బేనియా తీర్మానానికి సుముఖంగానే ఉండవచ్చని భావించబడుతున్నది.

నిక్సన్ అనుమతితోనే బాంబు దాడి

వాషింగ్టన్, సెప్టెంబరు 23

నిక్సన్ అనుమతితోనే ఉత్తర వియత్నాంపై అమెరికా విమానదాడులు చేసిందని వైట్ హౌస్ నేడు వెల్లడించింది.

వైట్‌హౌస్ ప్రతినిధి ఈ విషయాన్ని తెలియజేస్తూ వియత్నాంపట్ల అమెరికా అనుసరిస్తున్న విధానంతో యీ దాడులు ఎలాంటి మార్పును సూచించవన్నారు.

వియత్నాంనుండి ఉపసంహరించబడుతున్న అమెరికా దళాలను రక్షించేందుకై అమెరికా విమానదాడులు జరిపిందని యీ ప్రతినిధి సాకు చెప్పుచున్నారు.

మంగళవారం నాడు జరిగిన దాడులకు సంబంధించి అమెరికా సైనికాధికారులు జరిపిన చర్చలలో నిక్సన్ పాల్గొన్నారని వైట్ హౌస్ ప్రతినిధి తెలియజేశారు.

సోవియట్ సైన్యాధ్యక్షుడిగా కులికోవ్

మాస్కో, సెప్టెంబరు 22

సోవియట్‌యూనియన్ మొదటి డిప్యూటీ రక్షణమంత్రిగాను, సైన్యాధ్యక్షుడిగా విక్టర్ కులికోవ్ నియమించబడ్డారు.

టాస్ నేడీ విషయాన్ని ప్రకటించింది. కులికోవ్ వయస్సు 50 సంవత్సరాలు. సోవియట్ కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ సభ్యులు. సోవియట్ సైన్యాధ్యక్షుడు మార్షల్ మలా ఝుఖోవ్ స్థానే కులికోవ్ నియమించబడ్డారు.

శరణార్థులకు సోవియట్ సాయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23

భారత్‌లో వున్న బంగ్లాదేశ్ శరణార్థులకుగాను సోవియట్ యూనియన్ 5వేల టన్నుల కిరోసిన్ ఆయిల్, 80 వేల చదరపు మీటర్ల దుప్పట్లు, మరో వెయ్యి టన్నుల ముడిపత్తిని సహాయంగా పంపబోతున్నది.

5 వేల టన్నుల కిరోసిన్ అతి త్వరలోనే బొంబాయి రేవు చేరబోతున్నది. మిగతా సరకులను కలకత్తా రేవుకు పంపుతున్నారు.

భారత హెవీ ఎలక్ట్రికల్స్‌కు లాభాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23

ప్రభుత్వ రంగంలో రు. 160 కోట్ల ఖర్చుతో నిర్మించిన భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ మొట్టమొదటిసారిగా రు. 65 లక్షల లాభం సంపాదించింది.

1969.70 లో వచ్చిన రు. 15 కోట్ల నష్టంపోగా ఈ లాభం వచ్చిందని నేడు యిక్కడ పత్రికా సమావేశంలో ఈ కర్మాగారం చైర్మన్ శ్రీమూర్తి వెల్లడించారు.

శాశ్వత కరువు నివారణ చర్యలలో భాగంగా

మేజరు, మీడియం, మైనర్ నీటిపారుదల ప్రాజెక్టుల సత్వర నిర్మాణావశ్యకత

కడపజిల్లా కమ్యూనిస్టుపార్టీ మహాసభ తీర్మానం

కడప, సెప్టెంబరు 24

కడప: శాశ్వత కరువు నివారణకు గైకొనే చర్యలలో భాగంగా మేజరు, మీడియం మైనర్ నీటిపారుదల ప్రాజెక్టుల సత్వర నిర్మాణం జరగాలని డిమాండ్ చేస్తూ కడపజిల్లా కమ్యూనిస్టుపార్టీ 9 వ మహాసభ తీర్మానం చేసింది

కడపజిల్లా కమ్యూనిస్టుపార్టీ 9 వ మహాసభ ఈ నెల 14, 15, 16 తేదీలలో కడప పట్టణంలోని తిరుపులవాని సత్రంలో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. పట్టణమంతా ఎర్రటి తోరణాలతో అలంకరించటం పట్టణ సమితి ఎంతో శ్రద్ధ వహించింది.

జిల్లాకమ్యూనిస్టు ఉద్యమ వ్యవస్థాపకులలో ఒకరైనకీ. శే. మోకా వెంకటయ్యగారి స్మృత్యర్థంగా మహాసభ ఆవరణకు "మోకా నగర్" అని నామకరణం చేశారు.

14 వ తేదీ సాయంత్రం 4 గంటలకు కడప తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఎస్. నాగిరెడ్డి అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. 8 తాలూకాల నుండి 100 మంది ప్రతినిధులు, 15 మంది ఆహ్వానితులు మహాసభకు హాజరయ్యారు

శ్రీయుతులు వి. సుబ్బారెడ్డి, కె సుబ్బన్న అబ్దుల్‌ఖాదర్ అధ్యక్షవర్గంగా, శ్రీయుతులు బి.సి. వెంకటరెడ్డి, ఎం. వి. చంద్రాయుడు అర్హతల సంఘంగా, శ్రీయుతులు జె. వెంకట్రామరెడ్డి, ఎస్. శివరామరెడ్డి, గజ్జల మల్లారెడ్డి, వై. ఈశ్వరరెడ్డి సాంధ్య సంఘంగా ఎన్నికయ్యారు.

ఎస్. వి. ఘాటే, జోగ్లేకర్, మక్దూం, సత్యనారాయణరెడ్డి, సూడాన్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి మహగూబ్, తదితరులకు జోహార్లర్పిస్తూ శ్రీ ఈశ్వరరెడ్డి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని ఆమోదిస్తూ ప్రతినిధులు మహాసభ ప్రారంభంలో మౌనంగా శ్రద్ధాంజలి ఘటించారు.

తర్వాత ఆహ్వాన సంఘాధ్యక్షులు, ప్రఖ్యాత కవి శ్రీ వై. సి. వి. రెడ్డి ప్రతినిధులకు స్వాగతం చెపుతూ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ మహోజ్వల చరిత్రను సమీక్షించారు. జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి, శ్రీవెంకట్రామరెడ్డి రాష్ట్ర సమితి నిర్మాణ నివేదికను, జిల్లా సమితి నిర్మాణ నివేదికను వివరించారు,

జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యులు శ్రీ ఎస్. శివరామరెడ్డి జాతీయ సమితి ముసాయిదా తీర్మానాన్ని వివరించారు. దానిపై జరిగిన చర్చలో 28 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమితి తరఫున శ్రీ గజ్జల మల్లారెడ్డి చాలా జబ్బుగా వున్నప్పటికీ సభకు హాజరై రాష్ట్ర సమితి రిపోర్టుపై వివరణ ఇచ్చారు. గత మహాసభనాటి నుండి నేటివరకు వివిధ ప్రజారంగాలలో పార్టీ సాగించిన కృషిని గూర్చి జిల్లా సమితి కార్యవర్గ సభ్యులు శ్రీ కె సుబ్బన్న వివరించారు,

రాయలసీమజిల్లాలో ఏర్పడినభయంకరకరువు పరిస్థితులపై శ్రీ జె. వెంకటరామిరెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది,

శాశ్వత కరువునివారణకు వుపయోగించే విధంగా శ్రీశైలం నీటిని మైలవరానికి మళ్ళించే పథకాన్ని అమలుజరపాలని, అభివృద్ధి పన్ను లేకుండా పులివేముల కాల్వ నిర్మాణాన్ని చేపట్టాలని, మైలవరానికి అవసరపు నిధులు కేటాయించాలని, చెరువుల మరమ్మత్తు, రోడ్ల నిర్మాణం, బావుల లోతు చేయించడం తదితర కరువు పనులు ప్రారంభించి, నిరుద్యోగులకు పనులు కల్పించాలని. పశుగ్రాసం పుష్కలంగా సప్లయిచేయాలని, శక్తివంతమైన రిగ్గులు తెప్పించి బావులు లోతు చేయించాలని. రైతాంగానికి విరివిగా అప్పులు ఇవ్వాలని మహాసభ డిమాండ్ చేసింది.

అదేవిధంగా బంజరుభూముల పంపకంలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలు. ఇండ్ల స్థలాల పంపకంలో జరుగుతున్న దౌర్జన్యాన్ని ఖండిస్తూ నిర్దిష్టమైన సూచనలు చేసింది.

తదనంతరం జిల్లా కౌన్సిల్ సభ్యులుగా 46 మందిని మహాసభ ఎన్నుకున్నది. సభ్యులు తిరిగి 12 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అందులో శ్రీ జె. వెంకట్రామిరెడ్డి తిరిగి కార్యదర్శిగా, సహాయ కార్యదర్శులుగా శ్రీయుతులు వి. సుబ్బారెడ్డి, కె. సుబ్బన్న ఎన్నికయ్యారు.

బ్రహ్మాండమైన ఊరేగింపు, బహిరంగసభ

మహాసభ సందర్భంగా 15 వ తేదీ సాయంత్రం ఆలంఖానుపల్లి, సాయిపేట, పాతకడప, దుజుహూరు, తుమ్మలూరు, కొత్తకోట్లూరు, బయ్యనపల్లి, చింతకొమ్మదిన్నె, తదితర గ్రామాలనుండి తప్పెట్లతో వచ్చిన వ్యవసాయ కార్మికులు, పట్టణంలోని వందలాది రిక్షా కార్మికులతో, [illegible] ఎర్రజెండా రెపరెపలతో పట్టణ వీధులలో బ్రహ్మాండమైన ఊరేగింపుజరిగింది. ఇటీవల కాలంలో యింత పెద్దఊరేగింపు జరగలేదు.

రాత్రి 8 గంటలకు మున్సిపల్ హైస్కూల్ మైదానంలో శ్రీ వై. ఈశ్వరరెడ్డి అధ్యక్షతన బహిరంగసభ జరిగింది.

ఆహ్వానసంఘాధ్యక్షులు, జిల్లా ప్రెస్ యూనియన్ అధ్యక్షులు శ్రీ సి. చంద్రశేఖరరెడ్డి ఈ మహాసభను జయప్రదం చేసేందుకు సహకరించిన వివిధవర్గాల ప్రజలకు అభినందనలు తెలిపారు.

మహాసభ వివిధ ప్రజాసమస్యలపై ఆమోదించిన తీర్మానాలను జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ జె. వెంకట్రామిరెడ్డి వివరించారు.

కర్నూలు జిల్లా కమ్యూనిస్టు సమితికార్యదర్శి శ్రీ వై. స్వామిరెడ్డి కడప-కర్నూలు జిల్లాలు కృష్ణనీటిని మళ్ళించుకోవడంలో, కె. సి. కెనాల్ సమస్యల విషయంలో ఏకమై కృషిచేయాల్సిన అవసరాన్ని వివరించారు.

ఎన్నికల అనంతరం దేశ రాజకీయ పరిస్థితులను గురించి శ్రీ ఎస్. శివరామరెడ్డి, శ్రీ గజ్జల మల్లారెడ్డి మాట్లాడారు.

అనంతరం దేవీ సుప్రియా, సోవియట్ నృత్యాలు, ప్రఖ్యాత కమ్యూ - క్యాముల బృందంచే "బంగ్లాదేశ్" వీధిభాగవతం ప్రదర్శింపబడ్డాయి.

తీర్మానాలు

మహాసభ క్రింది తీర్మానాలను ఆమోదించింది.

కడపజిల్లాలో ఏర్పడిన భయంకర కరువు పరిస్థితి ప్రజానాయకులు, ప్రజాసంఘాలు ప్రభుత్వదృష్టికి తెచ్చాయి కానీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకొనలేదు. ప్రభుత్వ బాధ్యతా రాహిత్యాన్ని. నిర్లక్ష్యాన్ని మహాసభ ఖండిస్తూ వెంటనే కడప జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని. అన్ని రకాల అప్పుల వసూళ్ళ వాయిదావేసి. తిరిగి రైతాంగానికి అప్పులు విరివిగా యివ్వాలని, గ్రామ. గ్రామాన చౌకడిపోలు నెలకొల్పాలని. కె. సి. కెనాల్‌కు తుంగభద్ర రిజర్వాయరు నుండి అవసరంగా నీరు వదలాలని, జిల్లా అంతటాకరువు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేసింది.

పులివెందుల ప్రాజెక్టునిర్మాణానికై సాగిన ఆందోళనను మహాసభ వివరిస్తూ. ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఫలితంగానే రెండు, మూడు సంవత్సరాలు వరుసగా వర్షం లేక కోట్ల రూపాయల విలువ చేసే చీనీ తోటలు మాడి మసైపోయాయని. వేలకొలది రైతులు దివాలా తీశారని. అనేక గ్రామాలలో త్రాగుటకు కూడా నీరు దొరకడం లేదని మహా తీర్మానంలో పేర్కొన్నది. ప్రభుత్వం దాష్ట్యం చేయటం యిక ఎంతమాత్రం క్షమించరాదని భావిస్తూ ఆ ప్రాజెక్టును కూడా వెంటనేనిర్మించేందుకు పూనుకోవాలని మహాసభ కోరింది,

మైలవరం ప్రాజెక్టు పులివెందులకాల్వ, తోగూరుపేట ప్రాజెక్టులని పూర్తయినచో 130 వేల ఎకరాల భూమి నీటిపారుదల క్రిందకు రాగలదు. కనుక శాశ్వత కరువు నివారణ చర్యలలో భాగంలో మేజరు, మీడియం, మైనరు నీటి పారుదల ప్రాజెక్టుల సత్వర నిర్మాణం జరగాలని ప్రభుత్వాన్ని మహాసభ డిమాండ్ చేసింది. ప్రభుత్వ చర్యలను నిరంతరంజాగరూకులై గమనిస్తూ వాటి సాధనకై ఆందోళనను తీవ్రతరం చేయాల్సిందిగా మహాసభ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

బంజరుభూముల న్యాయ సమ్మతమైన పంపకానికై సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతూ మహాసభ మరో తీర్మానం చేసింది,

కె. సి. కెనాల్‌ను రీమోడలింగ్ చేయాలని మహాసభ మరో తీర్మానంలో ప్రభుత్వాన్ని కోరింది.

చేనేత కార్మికుల. మున్సిపల్ కార్మికుల, ఎన్. జి. ఓ. ల, టీచర్ల సమస్యలనుగూర్చి, జిల్లా పారిశ్రామికాభివృద్ధినిగూర్చి మరో తీర్మానం చేశారు.

ఎరువు ధరలో వస్తున్న ఒడుదుడుకులను అరికట్టుటకు చట్టా వ్యాపారాన్ని రద్దు చేయాలని, స్థానిక దళారీల దురన్యాయాలను అరికట్టుటకు దుగ్గిరాలలో వలె మార్కెట్ యార్డును నెలకొల్పాలని తీర్మానించింది.

ప్రభుత్వం ఏ మాత్రం జాగుచేయకుండా కడప రేడియో కేంద్రం నుండి పగటిపూట ప్రసారాలను, పాక్షిక కార్యక్రమాలతకూడా చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలని మహాసభ కోరింది.

ఇంకా గ్రామీణ, పట్టణ పేద ప్రజల గృహాలకు విద్యుత్ సౌకర్యం కలిపిస వద్ద తిలోనైనా కల్పించటానికి ఒక పథకం రూపొందించాలని, షెడ్యూల్డు కులాలకు, షెడ్యూల్డ్ జాతులకు యిండ్లస్థలాలు తక్షణమే మంజూరుచేయాలని, చిన్నకారు రైతు అభివృద్ధి పథకంలోని లోపాలను సవరించి అది చిన్నకారు రైతులకే ఉపయోగపడేటట్లు చూడాలని, ఈ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని, డా॥ ఎం. వి. రమణారెడ్డిపై మోపిన తప్పుడు కేసులను ఎత్తివేసి, వెంటనే విడుదల చేయాలని, డిటెన్యూ కవులనుకూడా విడుదల చేయాలని, కోరుతూ మహాసభ తీర్మానాలు చేసింది.

చాలినన్ని చౌక డిపోలు పెట్టాలి

విజయవాడ అజిత్‌నగర్ కమ్యూనిస్టు శాఖ డిమాండ్

విజయవాడ, సెప్టెంబరు 24

విజయవాడ అజిత్‌నగర్‌లో చాలినన్ని చౌకడిపోలు నెలకొల్పి, కిలో బియ్యం 75 పైసలకే అమ్మించాలని ప్రభుత్వాన్ని కోరుతూ విజయవాడఅజిత్‌నగర్ కమ్యూనిస్టు శాఖ తీర్మానం చేసింది.

ఈ శాఖా సమావేశం శ్రీ తిమ్మిశెట్టి చిట్టెయ్య అధ్యక్షతన ఈ నెల 21 న జరిగింది. శాఖా కార్యదర్శి శ్రీ కూరాకుల సుబ్బారావు యీ శాఖ నిర్వహించిన వివిధ కార్యక్రమాలపై రిపోర్టిచ్చారు. తదనంతరం పట్టణ కమ్యూనిస్టు సమితి సభ్యులు శ్రీ రాయన కొండయ్య ప్రతిపాదించిన తీర్మానాలు ఆమోదించబడ్డాయి.

సుమారు 25 వేల జనాభాగల అజిత్‌నగర్‌లో ప్రభుత్వం ఒకే ఒక చౌక డిపో పెట్టి మనిషికి 2 కిలోల చొప్పున 5 బస్తాలు మాత్రమే సప్లయిచేయటాన్ని ఈ సమావేశం నిరసించింది. కనీసం 4డిపోలైనా నెలకొల్పి డిపోకు 10 బస్తాల బియ్యం సప్లయి చేయాలని, కిలో 75 పైసలకు అమ్మాలని డిమాండ్ చేసింది.

అజిత్‌నగర్ నుండి ఏలూరుకాల్వ లాకుల మీదుగా అరోనగర్‌కు అదనంగా రెండు సిటీ బస్సులు వేయాలని, షెల్టర్లను, 4 పాల కేంద్రాలు ఏర్పాటు చేయాలని. యిప్పుడున్నది కాక, మరో ఎలిమెంటరీ స్కూలును అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని. ఒక పోలీసుస్టేషన్‌ను కూడా ఏర్పాటుచేసి శాంతి భద్రతలు నెలకొల్పాలని, రోడ్లు. మంచినీటి సౌకర్యం కల్పించాలని, ప్రజలకు అందుబాటులోవుండే [illegible] పోస్టాఫీసును ఏర్పాటు చేయాలని, కోరుతూ తీర్మానాలు చేశారు.

12 వ ఆంధ్రప్రదేశ్
కమ్యూనిస్టుపార్టీ మహాసభ సందర్భంగా

విశాలాంధ్ర పాఠకులకు
సదవకాశం
1-8-71 నుండి 30-9-71 లోగా
సంవత్సర చందా ఒకేసారి చెల్లించువారికి

దినపత్రిక	తగ్గింపు రేటు	ప్రస్తుత రేటు
ఏజెంటుద్వారా	రు. 44-35	(55-44)
పోష్టుద్వారా	రు. 48-00	(60-00)
వారపత్రిక		
ఏజెంటుద్వారా పోష్టుద్వారా	రు. 9-60	రు. 12-00

పార్టీ శాఖలు కార్మిక, రైతు. యువజన, మహిళా సంఘాలు. గ్రామ సర్పంచ్‌లు, అభిమానులు. ఈ సదవకాశాన్ని తప్పక వినియోగించుకోగోరుతున్నాం.

మేనేజరు: 'విశాలాంధ్ర'

విజయవాడ-4.

ఏలూరు మున్సిపాల్టీ అసమర్థ పాలన

ప్రభుత్వం వింత ఉత్తర్వులు

ఏలూరు, సెప్టెంబరు 23

మునిసిపల్ కౌన్సిలు దశాధవంతో వున్నప్పటికి ఏలూరు కౌన్సిలు మాత్రం అసమర్థతను, దారిద్ర్యాన్ని గుర్తుకు తెస్తుంది.

పన్నుల విధింపు, వసూళ్ళు, మునిసిపల్ నిధులను జాగ్రత్త పరచటంలో చాలా లోపభూయిష్టంగా వుంది.

రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన సుమారు ఐదులక్షల రూపాయలు వసూలు కావటం లేదు. ప్రభుత్వ వర్గాలకు బహుసన్నిహితులైన హేమా హేమీలైన రాజకీయవేత్తలు కౌన్సిల్లోవుండి కూడ వసూలు చేయలేకపోతున్నారు.

ఏ నెలలో కూడ పనివాళ్ళకు సకాలములో జీతాలులేవు సమ్మె కాలానికి జీతాలు ఇంకా చెల్లించలేదు ఆగస్టునెలజీతాలు చెల్లించలేదు.

అయితే దసరా ఎంతో విలాసంగా గడుపుకోవడానికి ఈనెల జీతాలు ముందుగా చెల్లించమని ప్రభుత్వం ఉత్తర్వు చేసింది.

కూలిరేటు పెంపుకు రైతుల అంగీకారం

మంచికలపూడిలో

తెనాలి, సెప్టెంబరు 23

తెనాలి తాలూకా మంచికలపూడి గ్రామంలోని పేద రైతులు, వ్యవసాయకార్మికులు, యువకులు 151 మంది కలసి ఈ నెల 18 వ తేదీ గ్రామంలోని రైతులందర్ని యింటింటికి వెళ్ళి కలుసుకున్నారు.

ఆహార ధాన్యాల ధరలు గురించి వివరిస్తూ ప్రస్తుతం యిస్తున్న కూలీ రేటు చాలని మరొక 50 పైసలు అదనంగా యివ్వాలని అభ్యర్థించారు.

వ్యవసాయ కార్మికుల కోర్కెలను రైతులు అంగీకరించారు. అదేరోజు స్థానిక కమ్యూనిస్టుశాఖ సమావేశం జరిగింది. అదనంగా కూలీ ఇచ్చుటకు అంగీకరించిన రైతాంగానికి గ్రామశాఖ సమావేశం అభినందనలు తెలిపింది,

వ్యవసాయ కార్మిక సంఘ సభ్యత్వం 150 చేర్పించాలని, నిర్ణయం తీసుకున్నారు.

కరీంనగర్ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

జిల్లా కమ్యూనిస్టుపార్టీ మహాసభ విజ్ఞప్తి

హైదరాబాదు సెప్టెంబరు 21

కరీంనగర్ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని జిల్లా కమ్యూనిస్టు పార్టీ మహాసభ తీర్మానించింది.

జిల్లా కమ్యూనిస్టుపార్టీ మహాసభ మెట్టుపల్లి తాలూకా కోరుట్లలో యీనెల 6, 7, 8 తేదీలలో జరిగింది. మహాసభ నిర్వహణకు శ్రీయుతులు ప్రభాకర్, రామయ్య, పోచలక్ష్మణ్‌లతో అధ్యక్షవర్గం ఎన్నుకోబడింది రాష్ట్రకమ్యూనిస్టుపార్టీ నాయకులు శ్రీ అడ్లూరి రామచంద్రారెడ్డి అరుణ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ అంతర్జాతీయ పరిస్థితులపై రిపోర్టు యిచ్చారు. జిల్లా కమ్యూనిస్టుసమితి తాత్కాలిక కార్యదర్శి శ్రీ డి. మల్లయ్య జిల్లాపార్టీ నిర్మాణంపై నివేదిక సమర్పించారు.

ప్రతినిధుల చర్చల అనంతరం నివేదికను ఆమోదించారు. జిల్లా కార్యదర్శి డాక్టర్ వెంకట్రామారావు చర్చకు సమాధానం యిచ్చారు.

మహాసభలో 31 మందితో కూడిన జిల్లా సమితిని, శ్రీ దేశిని చిన్నమల్లయ్య కార్యదర్శిగా, శ్రీయుతులు ప్రభాకర్, శ్యామ్‌సుందర్‌రావు సహాయ కార్యదర్శులుగా, డాక్టర్ వెంకట్రామారావు, ఎ. హెచ్. రాజేశ్వరరావు ఆనందరావు హుజూరాబాదు నుండి ఒకరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోబడ్డారు. వచ్చే కమ్యూనిస్టుపార్టీ మహాసభకు 40 మంది ప్రతినిధులను ఎన్నుకున్నారు.

తీర్మానాలు

జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలనీ, సమగ్ర పోచంపాడు ప్రాజెక్టును నిర్మించాలనీ కోరుతూ మహాసభ తీర్మానించింది.

జిల్లాలో ప్రతిగ్రామంలోను చౌకడిపో పెట్టి, చౌకగా బియ్యం అమ్మించాలనీ, శిస్తు మాఫీ చెయ్యవలసిందిగాను, రుణాల వసూళ్ళు నిలుపు చేయవలసిందిగాను, వ్యవసాయ కార్మికుల కూలి 7[illegible] శాతం హెచ్చిస్తూ చట్టం తీసుకురావలసిందిగాను, ఇళ్ళస్థలాలు మంజూరు చెయ్యవలసిందిగాను, భూపరిమితి తగ్గించవలసిందిగాను, భూపోరాటం సందర్భంగా పెట్టిన కేసులను ఉపసంహరించుకోవలసిందిగాను, కోరుతూ తీర్మానించారు

గీత పారిశ్రామికుల వృత్తి హక్కు రాజు చేసే పద్ధతిని రద్దు చేయాలని, లేనిచో ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవడం వస్తుందని మరొక తీర్మానంలో హెచ్చరించారు.

డ్రాఫ్ట్ బిల్లును ఉపసంహరించుకోవాలనీ జిల్లాలో కొనసాగుతున్న పోలీసు దౌర్జన్యాలను ఖండిస్తూ తీర్మానించారు

యువజన, మహిళా, విద్యార్థి తదితర ప్రజా సంఘాలు నిర్మాణాన్ని పటిష్ట పరచాలని యిందుకోసం కృషిచేయాలని తీర్మానించారు.

కోరుట్ల పట్టణంలో మహాసభ సందర్భంగా జరిగిన బహిరంగ సభ వార్త యిదివరకే ప్రకటించాం.

గోనబోయినపల్లె సర్పంచ్‌గా కమ్యూనిస్టు ఎన్నిక

దేవరకొండ, సెప్టెంబరు 23

నల్లగొండ జిల్లా దేవరకొండ తాలూకా గోనబోయినపల్లి గ్రామ పంచాయితీ ఎన్నికలు యీనెల 9 వ తేదీన జరిగాయి తాలూకా సమితి సహాయ కార్యదర్శి శ్రీ ఎస్. వాసుదేవు సర్పంచ్‌గాను, శ్రీ రేపల్లి తిరుపతయ్య ఉప సర్పంచ్‌గా ఎన్నికైనారు.

ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా అస్సాంలో వామపక్ష శక్తుల ప్రజోద్యమం

గౌహతి, సెప్టెంబరు 21 (మా అస్సాం విలేకరి)

నిత్యజీవితావసర వస్తువులకు కృత్రిమ కొరత సృష్టించి ధరల పెంపుదలకు వ్యతిరేకంగా సెప్టెంబరు 6 వ తేదీన అస్సాంఅంతటా డిప్యూటీ కమీషనర్ సబ్‌డివిజనల్ అధికార్ల కార్యాలయాల యెదుట సామూహిక నిరాహార దీక్ష జరిగింది.

వందలసంఖ్యలో ప్రజలు పురుషులు స్త్రీలు. ప్రజాసంఘాలలోని ముఖ్య కార్యకర్తలు, శాసనసభ్యులు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. కొన్నిచోట్లనిరాహారదీక్షలు మరునాటి ఉదయం వరకు అంటే 24 గంటలపాటు కొనసాగాయి.

అధిక ధరలకు వ్యతిరేకంగా, అస్సాం దిగువ జిల్లాలలోని దుర్భిక్ష ప్రాంతాల్లో తగు సహాయ కార్యక్రమ నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యానికి వ్యతిరేకంగా, ఈ నెలారంభం నుండి ఆందోళన జరుపుతున్న అస్సాం కమ్యూనిస్టు పార్టీ ఈ సామూహిక నిరాహారదీక్షలకు పిలుపునిచ్చింది.

కమ్యూనిస్టు పార్టీ ఆగస్టు 9 న కోర్కెలదినంగా జరిపింది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు, సభలు జరిగాయి. ఆ కోర్కెలపై రాష్ట్ర ప్రభుత్వానికి మెమోరాండం సమర్పించారు.

అదుపరి మరి నాలుగు పార్టీలు మార్క్సిస్టు పార్టీ, ఆర్. ఎస్. పి. ఐ. ఆర్. ఎస్. పి. ఐ. ఎస్. యు. సి. ఐ. కలిసివచ్చాయి, నిరాహార దీక్షల ఉద్యమాన్ని ఈ పార్టీలు సంయుక్తంగా నిర్వహించాలని సంయుక్త సమావేశంలో నిర్ణయించాయి. నిరాహారదీక్షలనిర్వహణకు గాను 7 అంశాల కార్యక్రమాన్ని కూడా ఈ వామపక్ష పార్టీలు ఆ సమావేశంలో రూపొందించాయి.

ఈ రాజకీయ పార్టీలకుతోడు, ఎ. ఐ. టి యు. సి. అస్సాంయూనిట్, అస్సాం మహిళా సంఘం, అస్సాం విద్యార్థి ఫెడరేషన్, ప్రజాతంత్ర విద్యార్థిసంఘం, ఛాత్ర ఆందోళన పరిషత్, ఇంకా అనేక ప్రజాసంఘాలు ఈ ఉద్యమానికి సంఘీభావం ప్రకటించి నిరాహార దీక్షల్లో పాల్గొన్నాయి.

గౌహతిలో ఇరువురు కమ్యూనిస్టు శాసనసభ్యులతోసహా 85 మంది నిరాహారదీక్షలో పాల్గొన్నారు. నార్‌ఖిలో మున్సిపల్ ఛైర్మన్ (కమ్యూనిస్టు)తో సహా 21మంది. నౌగాంగ్‌లో కమ్యూనిస్టు శాసనసభ్యునితోసహా 200 మంది పాల్గొన్నారు, వీరిలో ఇతర పార్టీల రాజకీయ నాయకులు కూడా వున్నారు. జోర్హాట్‌లో డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ముందు 60 మంది సిబ్‌సాగర్‌లో 25 మంది పాల్గొన్నారు.

నిరాహారదీక్షను గూర్చిన వివరమైన వార్తలు అన్ని ప్రాంతాల నుండి అందలేదు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలోనూ సబ్ డివిజన్ పట్టణాలలోను ఈ ఉద్యమం విజయవంతమైనట్లు వార్తలు అందాయి.

అధిక ధరలకు వ్యతిరేకంగా, నిత్య జీవితావసర వస్తువులు సహేతుకమైన ధరకు అందించడంలో ప్రభుత్వ వైఫల్యానికి వ్యతిరేకంగా జరిగిన ఈ సామూహిక నిరాహారదీక్షలు. పెంపొందుతున్న ప్రజా ఉద్యమానికి గొప్ప ప్రోత్సాహాన్ని ఇచ్చాయని పరిశీలకులు తెలుపుతున్నారు.

షిల్లాంగ్‌లో కేంద్ర ప్రభుత్వోద్యోగులు. రాష్ట్ర ప్రభుత్వోద్యోగ సంఘాలు, ఇతర ట్రేడ్ యూనియన్ సదస్సు జరిగింది ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఆందోళన జరపాలని నిశ్చయించారు. గౌహతిలో వివిధ ట్రేడ్ యూనియన్లతో కూడిన ధరల పెరుగుదల ప్రతిఘటన కమిటీ, ఈ సమస్యపై ప్రజా ఉద్యమానికి ఒక కార్యక్రమం రూపొందించింది.

ఈ ప్రజా ఉద్యమ ఒత్తిడి ఫలితంగా జిల్లా అధికారులు షిల్లాంగ్‌లో పెద్ద వ్యాపారులకు చెందిన కొన్ని గోదాములలో తనిఖీ చేశారు. అయితే తనిఖీ బృందాలు వెళ్ళక ముందే ఈ బృందంలోని సభ్యుల నుండి సమాచారం తెలుసుకున్న వ్యాపారులు గోదాములలో సరుకు లేకుండా జాగ్రత్త పడ్డారని చెప్పబడుతున్నది. పర్యవసానంగా నిల్వలు బయటపడలేదు తనిఖీ సమయంలోనే వేల సంఖ్యలో డబ్బు చేతులు మారిందని ఆరోపించబడింది, కాబట్టి నిల్వలు పట్టుకోకపోవడంలో ఆశ్చర్యమేముంది ?

ఈ క్రింది కోర్కెలపై నిరాహార దీక్షలు నిర్వహించబడ్డాయి.

1. ఆహార ధాన్యాల టోకువ్యాపారాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. మే 1971 స్థాయిలో ధరలను నిర్ణయించి వాటిని, ఖచ్చితంగా అమలులో పెట్టాలి. చౌక ధరల దుకాణాలను ఏర్పాటుకు ప్రభుత్వ విధానంగా ప్రకటించి, వాటి ద్వారా పంపిణీ జరపాలి.

2. ఆహార ధాన్యాలు. ఇతర నిత్య జీవితావసర వస్తువుల పెద్ద టోకు వ్యాపారుల గోదాములన్నిటినీ నిల్వలతో సహా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. తప్పుడు సమాచారం ఇచ్చిన వారిని కఠినంగా శిక్షించాలి.

3. దొంగ వ్యాపారంతో సంబంధం కలిగి, స్పెక్యులేషన్ వ్యాపారం, ధాన్యం దొంగ నిల్వ చేయడం. అధిక లాభాల గుంజడంలో సహాయ పడుతున్నట్లు కనుగొనబడ్డ ప్రభుత్వాధికార్లను తక్షణం సస్పెండ్ చేసి, విచారించి, శిక్షించాలి.

4. దొంగ నిల్వలను బయటపెట్టగలిగే కార్యక్రమాన్ని ప్రజా సహకారంతో, ప్రత్యేకించి రాజకీయ పార్టీల సహకారంతో నిర్వహించాలి.

5. ధరల సరఫరా, పంపిణీకి సంబంధించిన నిర్ణయాల అమలును పర్యవేక్షించేందుకు అఖిలపక్ష కమిటీలను వలంటీరు బృందాలను ఏర్పాటుచేయాలి.

6. ధరలు, సరఫరా పరిస్థితిపై బహిరంగ ప్రకటన చేయవలసిన [illegible] పత్రికలద్వారా, రేడియో. ఇతర ప్రచార సాధనాలద్వారా ప్రకటించాలి.

7 దుర్భిక్ష ప్రాంతాల్లో కరువుకు సరిపడ ప్రజలకు తగినంత సహాయాన్ని ఉదారంగా అందజేయాలి భూమిశిస్తు, రుణాల వసూలు, మినహాయింపు ఇవ్వాలి. ఆ ప్రాంతంలో విద్యార్థుల స్కూలు ఫీజు ఈ విద్యాసంవత్సరానికి మినహాయించాలి.

ఆహారధాన్యాలు, ఇతరనిత్యజీవితావసర వస్తువుల ధరలు అస్సాంలో గత కొంత కాలంగా సామాన్యప్రజలకు అందుబాటు లేనంతగా పెరిగాయి పరిపాలనా యంత్రాంగంలో నిజాయితీలోపించినందువల్ల వ్యాపారులు. దట్టవ్యాపారం చేయటమే ఇందుకు ప్రధాన కారణం. ఉదాహరణకు, ఉత్తర బీహార్, పశ్చిమ బెంగాల్‌లో వరదలవల్ల రైలు రవాణా సంబంధాలు అంతరాయం ఏర్పడింది. దీనితో చాలా రోజులపాటు అస్సాంకు రైల్వే బుకింగ్ నిలుపు చేయబడింది. అయితే రైళ్ళ ప్రయాణాలు నిలుపుదల ఒకటి లేదా రెండు రోజులకు మించి లేదు.

ఉత్తర బీహార్ మీదుగా గౌహతికి వస్తున్న 14 వ్యాగన్ల సరుకులను గౌహతిలోని స్థానిక ప్రభుత్వాధికారులు త్రిప్ప పంపినట్టు విశ్వసనీయంగా తెలియవచ్చింది. ఆ సమయంలో ఎంత దారుణంగా కటకటగా వుంది ధరలు పెరుగ నారంభించాయి. ధరల పెరుగుదల, కృత్రిమకొరత సృష్టించబడి జరుగుతుందో ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

తీవ్రమైన ప్రజానిరసనవల్ల ధరలను కొద్దిగా తగ్గించడానికి అధికారులు పూనుకోవలసి వచ్చింది. అయితే ఇది [illegible] తగినంత లేదు. ప్రస్తుతం రైల్వే అధికారులు ప్రత్యేక గూడ్సు రైళ్ళను ఏర్పాటు చేస్తున్నట్లు తెలియవచ్చింది.

ధరలను కనీసం గత మే మాసంలో బడ్జెట్ పూర్వస్థాయికి తగ్గించకపోతే ప్రజలు చెప్పుకోదగ్గ వెసులుబాటు లభించదు.

నిస్సారమైన దుర్భిక్ష ప్రాంతాల్లో లక్షలాది ప్రజలు ఆకలితో అలమటిస్తుంటే వ్యాపారులు అపారమైన లాభం సంపాదించ బూనుకున్నారు. ఈ సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు ఉన్నతాధికారులలోని ఒక వర్గం సహాయపడుతోంది. బాధపడుతున్న ప్రజలకు త్వరగా సహాయం అందజేయటానికి బదులుగా ప్రకృతి వైపరీత్యాల పేరుతో రాష్ట్ర [illegible] దాచుకోవడానికి ప్రయత్నిస్తుంది.

ఇదా వ్యాపారుల. బ్యూరోక్రాట్ అధికారుల ప్రజా వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం నానాటికీ తీవ్రమౌతున్నది.

రేడియో

ఆదివారం సెప్టెంబరు 26
శక 1893 ☆ ఆశ్వయుజ 4

విజయవాడ

357.1 మీ. [840 కిలోసై.]

ఉదయం: 6.00 వందేమాతరం, శుభోదయం; ప్రసారవిశేషాలు; 6.10 భక్తిరంజని; 6.40 సూక్తిముక్తావళి; 6.45 పొలంపనులు; 6.55 క్లారినెట్; 7.02 ఆం: వా: 7.04 కార్యక్రమ వివరణ: 7.05 తె. వా. 7.15 సంగీత శిక్షణ - సీసపద్యాలు; 7.30 అమరవాణి. 7.45 హిందీపాఠం; 8.00 హిం. వా: 8.10 ఆం. వా: 8.20 బొమ్మరిల్లు: 9.00 హిం వా: 9.02 ఆం. వా: 9.04 ప్రసార సమాప్తి

మధ్యాహ్నం: 11.45 చిత్ర తరంగిణి: 12.30 తె. వా: 12.40 కార్మికుల కార్యక్రమం: 1.10 పనికిపంటలు: 1.20 చిత్ర తరంగిణి: 1.30 రంగవల్లి: 2.00 ఆం. వా: 2.10 వాతావరణ సూచన: 2.15 గ్రాత్రం: 3.10 'ప్రమద', నాటిక; 4.10 సమాప్తి.

సాయంత్రం: 5.30 హైదరాబాద్ వలె; 5.55 స్థానిక ప్రకటనలు; 6.00 ఆం. వా: 6.05 ప్రాం. వా: 6.15 'ఆంధ్రికా విజయం' బుర్రకథ; 6.25 వ్యవసాయదారులకు: 6.30 'ఆంధ్రికా విజయం - బుర్రకథ: 7.02 ఆం. వా: 7.04 విరామ సంగీతం: 7.05 తె. వా: 7.15 పంట సీమలు: 7.45 యువ భారతి; 8.30 [illegible] - సమస్యాపూరణం: 8.45 హిం. వా: 9.00 ఆం. వా: 9.15 రాగం, తానం, పల్లవి: 10.00 హైదరాబాద్ వలె; 10.30 జన గణ మన. ప్రసార సమాప్తి.

హైదరాబాద్ - (ఎ)

405.4 కిలో మీ [740. సై]

ఉదయం: 6.00 వందేమాతరం: 6.02 ఆం. వా. 6.04 మంగళధ్వని, కార్యక్రమ వివరణ 6.10 భక్తిరంజని: 6.40 సూక్తి ముక్తావళి, 6.45 మారెడ్డి కేశవరావు వయొలిన్; 7.02 ఆం. వా 7.04 కార్యక్రమ వివరణ: 7.05 తె వా: 7.15 సంగీతశిక్షణ; 7.30 అక్షరవాణి; 7.45 లలిత సంగీతం; 8.00 హిం. వా 8.10 ఆం. వా: 8.20 స్త్రీలకు: 8.40 సూరెడ్డి పద్మనాభరావు - గానం; 9.30 మీకుకోరిన పాటలు: 10.00 వాతావరణ సూచన. ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12.30 తె. వా: 12.40 కార్మికుల కార్యక్రమము: 1.10 మారెడ్డి కేశవరావు - వయొలిన్: 1.30 రంగవల్లి: 2.00 ఆం. వా: 2.10 వాతావరణసూచన. బాలవినోదం: 3.02 ఆం. వా: 3.04 విరామ సంగీతం: 3.10 నాటిక- (వి. నుండి రిలే): 4.10 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5.30 మారెడ్డి కేశవరావు వయొలిన్: 5.55 ప్రసార విశేషాలు: 6.00 ఆం. వా: 6.05 ప్రాం. వా: 6.15 ఉ. వా: 6.25 వ్యవసాయ దారులకు: 6.30 గ్రామసీమలు: 7.00 అనగనగ - కథావళి: 7.05 తె. వా: 7.15 ఇల్లూ వాకిలి: 7.30 చిత్రసీమ: 8.00 ప్రసంగం; 8.10 ఈమాసపు పాట: 8.15 చిత్రసీమ: 8.30 సమస్యాపూరణం: 8.15 లలిత సంగీతం: 8.45 హిం. వా: (కడప మ్యాంధమే): 9.00 ఆం. వా: 9.15 రాగం, తానం, పల్లవి: 10.00 ధ్వానగీతి, 10.30 జన గణ మన, ప్రసార సమాప్తి.

హైదరాబాద్ - (బి)

217.4 మీ. [1380 కిలో సై]

ఉదయం: 6.30 వందేమాతరం, 6.40 ఈశ్వర అల్లా తేరేనాం: 7.00 హిం. వా: 7.02 విరామ సంగీతం: 7.05 రేడియో కళాశాల; 7.30 నేటి కార్యక్రమం: 7.35 కర్ణాటక సంగీతం: 7.50 ఆంగ్లం: 8.00 ఫిల్మిగానే: 8.20 నాటిక (తెలుగు): 8.50 ఉ వా: 9.00 ఘుజర్: 9.30 బచ్చోంకే లియే: 10.00 హిం. వా: 10.02 ఎస్. డి. దేశపాండే - ఖయాల్: 11.00 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 2.00 వాద్య సంగీత్: 2.10 హిం. వా: 2.20 స్కెచ్ - ఉర్దూ: 2.30 ఖవ్వాలియాం: 3.00 హి. వా: 3.02 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5.30 హిందూస్తానీ సంగీతము: 6.45 చిత్రసీమ: 6.05 హిం. వా: 6.10 ఇంద్రధనుస్సు: 6.40 పాశ్చాత్య సంగీతం: 7.00 హిం. వా: 7.02 ఈ నాటి కార్యక్రమాలు: 7.05 జానపద గేయాలు: 7.20 హిందీలో కార్యక్రమం: 7.45 ఫిల్మి గానే: 8.00 హిం. వా: 8.02 విరామ సంగీతము: 8.05 సన్నం: 8.15 సుగం సంగీత్) 8.45 హిం. వా: 9.00 ఫిల్మ్ గానే, 9.15 ఉ. వా: 9.30 ఉర్దూలో కార్యక్రమము: 10.30 జన గణ మన, ప్రసార సమాప్తి.

తెలుగులో
కొత్త సోవియట్ పుస్తకాలు

			పేజీలు	ధర
1.	ప్రాచ్య ప్రపంచంలో జాతీయ విమోచనోద్యమం	—లెనిన్	365	1 40
2.	మేడే, విప్లవ కార్మికవర్గ మేడేచర్య	—లెనిన్	33	0 50
3.	సామ్రాజ్యవాదమూ-సోషలిజంలో చీలిక	—లెనిన్	24	0-30
4.	అతివాద బాల్య చాపల్యమూ-పెటీ బూర్జువా మనస్తత్వమూ	—లెనిన్	44	0-60
5.	కమ్యూనిస్టు ప్రణాళిక	—కార్ల్‌మార్క్స్&ఏంగిల్స్	84	0-30
6.	నిత్యజీవితంలో భౌతికశాస్త్రం-2	—వై. పెరెల్మాన్	234	3-70
7.	అమ్మ	—మక్సీమ్ గోర్కీ	331	3-00
8.	మక్సీమ్ గోర్కీ కథలు		182	2-40
9.	జమీల్యా	—చింగీజ్ ఐత్ మాతోవ్	101	0-40
10.	నీలం నోట్‌బుక్	ఇ. కజకేవిచ్	188	2-50
11.	వర్షంలో నక్షత్రాలు (పిల్లల కథలు)		104	2.00
12.	మంచినడత-రెండు పిల్లికూనలు	—ఎస్. మర్షాక్	16	0-45
13.	ఉన్నారు ఇలాంటి అబ్బాయిలు-	అగ్నియాబర్తో	16	0-50
14.	అన్నిటికంటె బలమైనదెవరు?-	—వలేరియ్ సుస్లోవ్	20	0-80
15.	చిన్నారి చిరుతలు	ఎ. లాప్తెవ్	24	0-70
16.	మొసలికాజేసినసూర్యుడు	—కె. చుకవస్కీ	24	0-50
17.	కొమ్ముల గొర్రెపిల్ల	—ఎస్. చెరుషెనీయెవ్	24	0-80
18.	హనీకేక్స్ పెడతామా, తాయం పెడతామా-	—తర్యానా మావ్రినా	24	1-00
19.	చిన్నారి కోడిపుంజ-బంగారు మేనిగౌను	—ఎ. ఎన్. టాల్‌స్టాయ్	24	0-60
20.	వేర్వేరుచక్రాలు	—వి. సుతేయెవ్	24	0-50
21.	బాలల కథలు	లియోటాల్‌స్టాయ్		0-90

పోస్టేజీ అదనం - ప్రతులకు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
ఏలూరురోడ్డు : : విజయవాడ-2

విశాలాంధ్ర బుక్ హౌస్
సుల్తాన్‌బజార్ : : హైదరాబాద్

ADMARK

1971 సెప్టెంబరు 25 శనివారం

కేరళ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ

నేడు జరుగుతున్న కేరళ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు రెండు రకాల ప్రాధాన్యమున్నది.

రెండు నెలలుగా జరిగిన రాయబారాలు, చర్చలు జయప్రదంగా ముగిసి, ఐదుగురు కాంగ్రెసువాదులు మంత్రులుగా చేరటం మొదటిది.

ముల్లా కమిషన్ చే నిర్దోషులుగా ప్రకటించబడిన మాజీ మంత్రులు, కమ్యూనిస్టు నాయకులు గోవిందన్ నాయర్, థామస్‌లు తిరిగి మంత్రిమండలిలో చేరటం రెండవది.

ఏడాది కితం 1970 సెప్టెంబరులో కేరళ శాసనసభకు జరిగిన ఎన్నికలలో ఐక్యసంఘటన, రాష్ట్ర కాంగ్రెసు పరస్పర ఒప్పందంతో పోటీ చేశాయి. ఐక్యసంఘటన చేపట్టిన కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెసు నాయకత్వం ఆమోదం తెలిపింది. ఎన్నికల అనంతరం నూతన మంత్రివర్గం ఏర్పడినప్పటి నుండీ మంత్రివర్గాన్ని కాంగ్రెసుపార్టీ బలపరుస్తూనే ఉంది. ఐతే మంత్రివర్గంలో చేరలేదు.

కేరళ ఎదుర్కొంటున్న సమస్యలను ఐక్యసంఘటనా ప్రభుత్వం సమర్థవంతంగా పరిష్కరించాలంటే, కాంగ్రెసుపార్టీ కూడా మంత్రివర్గ బాధ్యతలు స్వీకరించటం అవసరమని, కమ్యూనిస్టుపార్టీ తదితర ఐక్యసంఘటన పార్టీలు కోరుతూ వచ్చాయి. మంత్రివర్గ సభ్యుల సంఖ్య, పోర్టుఫోలియోల పంపిణీ తదితర అంశాలన్నీ సంతృప్తికరంగా పరిష్కారమై, 13 గురు మంత్రులతో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ నేడు జరుగుతున్నది. ఇందులో ఐక్యసంఘటన మంత్రులు 8 మంది కాంగ్రెసువాదులు 5 గురు.

1957 జనరల్ ఎన్నికల తర్వాత కేరళలో మొట్టమొదటిసారిగా కమ్యూనిస్టు మంత్రివర్గం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల ద్వారా కమ్యూనిస్టుపార్టీ అధికారంలోకి రావటం భారత రాజకీయ చరిత్రలో అదే ప్రథమం. గత 15 సంవత్సరాలలో అనేక ఆటుపోట్లు వచ్చాయి. అనేక మంత్రివర్గాలు మారాయి. చివరకు కమ్యూనిస్టు నాయకులు శ్రీ అచ్యుత మీనన్ నాయకత్వాన ఏర్పడిన ఐక్యసంఘటన ప్రభుత్వం గత [illegible] జరుపుతూ, [illegible] అవశేషాలను నిర్మూలిస్తూ ఆదర్శప్రాయంగా పరిపాలిస్తూ అందరి మన్ననలను అందుకున్నది.

కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యానగల ఐక్యసంఘటనలో కాంగ్రెసు పార్టీ భాగస్వామి కావటముచే నూతన ప్రయోగం కేరళలో నేడు ప్రారంభమైంది.

కమ్యూనిస్టు మంత్రులుగా నేడు ప్రమాణం చేస్తున్న శ్రీ గోవిందన్ నాయర్, థామస్‌లు 1969లో నంబూద్రిపాద్ మంత్రివర్గంలో మంత్రులుగా ఉన్నవారే. పార్టీ కక్షతో శ్రీ నంబూద్రిపాద్ ఆనాడు ఈ ఇద్దరు కమ్యూనిస్టు మంత్రులపై కొన్ని ఆరోపణలు చేసి వాటిపై విచారణకు జస్టిస్ ముల్లా అధ్యక్షతన ఏకసభ్య కమిషన్‌ను నియమించారు. వెన్వెంటనే, శ్రీ గోవిందన్ నాయర్ థామస్‌లు మంత్రిపదవులకు రాజీనామా ఇచ్చారు.

దాదాపు రెండేళ్ల తర్వాత ముల్లా కమిషన్ తన తీర్పు ఇచ్చింది. శ్రీ గోవిందన్ నాయర్ థామస్‌లు ఇద్దరూ నిర్దోషులని, శ్రీ నాయర్‌పై వచ్చిన 9 ఆరోపణలు, థామస్‌పై వచ్చిన ఐదు ఆరోపణలు నిరాధారాలే కాక, కేవలం రాజకీయ దురుద్దేశంతో చేయబడినవని కూడా స్పష్టం చేశారు.

కనుకనే శ్రీ నాయర్ థామస్‌లు తిరిగి మంత్రిమండలిలో చేరాలని కమ్యూనిస్టుపార్టీ నిర్ణయించింది. సిగ్గుపావువాడకుండా ఆ యిరువురు తిరిగి మంత్రులౌతున్నారు.

ఈ పరిణామాలు సహజంగానే రాష్ట్రంలోని మార్క్సిస్టు పార్టీకి, ముఖ్యంగా వారి నాయకత్వానికి ఆశాభంగం కలిగించి తీరతాయి.

మార్క్సిస్టు వ్యతిరేక సంఘటన నిర్మించడమే ఈ మంత్రివర్గం లక్ష్యమని వారు అప్పుడే నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు. తమ పలుకుబడిలో ఉన్న కొన్ని కార్మిక, ఉద్యోగ సంఘాలను వినియోగించుకుని కృత్రిమ ఆందోళనలకు తయారౌతున్నారు.

మార్క్సిస్టు వ్యతిరేక సంఘటన ఏర్పరిచే ప్రస్తావనే లేదని, మార్క్సిస్టుపార్టీ అవలంబిస్తున్న గుడ్డి వ్యతిరేక విధానాలను ఓడించటమే తమ లక్ష్యమని ఆ పార్టీలో పునరాలోచన ప్రారంభం కావాలనే కమ్యూనిస్టుపార్టీ కోర్కె అని కేరళ కమ్యూనిస్టు సమితి తన తీర్మానంలో స్పష్టం చేసింది.

యావద్భారతానికి ఆదర్శప్రాయంగా గుర్తించబడిన భూసంస్కరణల చట్టం కేరళలో వ్యాప్తిస్తుంది. కాని భూస్వాములు కోర్టులలో కేసులు వేసి, చట్టంలోని కొన్ని క్లాజులు అమలు జరగకుండా అడ్డుతగులుతున్నారు.

దేశ రాజకీయ పరిస్థితులలోనూ కేరళలో కాంగ్రెసు పార్టీలోనూ వచ్చిన మార్పుల దృష్ట్యా పునర్వ్యవస్థీకరించబడిన మంత్రివర్గం రాష్ట్ర సమస్యలను జయప్రదంగా ఎదుర్కొనగలదని ఆశించవచ్చు. కేరళలో జరుగుతున్న ఈ ప్రయోగాన్ని యావద్భారతంలోని వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ఆసక్తితో గమనించితీరుతాయి.

పాక్ సైన్యాన్ని మట్టుబెట్టేందుకు సైనిక శిక్షణకై బంగ్లాదేశ్ యువకులు, విద్యార్థుల తహ తహ

[అస్సాం, పశ్చిమ బెంగాల్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాలలోని బంగ్లాదేశ్ శరణార్థుల శిబిరాలను గతనెలలో పరిశీలించి వచ్చిన అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ ఎస్ సుధాకర్ అనుభవాల గూర్చిన తొలివ్యాసం నిన్న యిచ్చాం. — సం]

శ్రీ ఎస్. సుధాకర్

భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన బంగ్లాదేశ్ కాందిశీకుల క్యాంపుల్లో యువకుల సంఖ్య అత్యల్పం. యువకులు బంగ్లాదేశ్‌లో గెరిల్లా పోరాటంలోనో, లేక సరిహద్దుల్లో సైనిక శిక్షణలోనో వుండటమే యిందుకు కారణం. అందులోనూ, అత్యధిక భాగం విద్యార్థులు.

అగర్తలాలోని అవామీలీగ్ ఆఫీసు ముందు, నేషనల్ అవామీపార్టీ (ఎన్. ఎ. పి.) కార్యాలయాల ముందు, ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, యువకులు, బారులు తీరి ముక్తి వాహినిలో రిక్రూటుమెంటు కోసం వేచి వుంటున్నారు.

గతంలో తూర్పు పాకిస్థాన్ స్టూడెంట్సు యూనియన్‌గా వుండిన నేటి బంగ్లాదేశ్ స్టూడెంట్స్ యూనియన్ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనేందుకు వందలాది మంది విద్యార్థులను సమీకరించటమే గాక, వ్యయంగా శిక్షణ యిచ్చే ఏర్పాట్లుకూడ చేస్తున్నది. ఈ శిక్షణ భారత భూభాగంలో గాక, బంగ్లాదేశ్ సరిహద్దుల లోపలే జరుగుతున్నది.

సరిహద్దుల లోపల ఒకవైపు పాకిస్థాన్ మిలిటరీ దాడి ప్రమాదం అనుక్షణం ఉన్నప్పటికీ, విస్తారంగా శిక్షణ పొందుతున్న ఆ యువకుల ఆత్మస్థైర్యం మెచ్చుకోదగ్గది.

ప్రమాదకర పరిస్థితి

ఆర్థిక యిబ్బందులు, ఆయుధాల కొరత, తక్కువ సంఖ్యలో వున్న సైనిక శిక్షకులు కారణంగా, ఉత్సాహ పూరితంగా వస్తున్న యువకులందరికీ వాళ్లు శిక్షణ యివ్వలేక పోతున్నారు. ఒక బ్యాచ్ పూర్తయ్యేలోగా, మరో బ్యాచి యువకులు మాత్రమే వేచి వుండాలి. మిగిలిన వాళ్లు తమ స్వస్థలాలకు వెళ్లి మళ్లీ కొన్ని వారాల తర్వాత తిరిగి రావాల్సి వుంటుంది. ఇది చాలా ప్రమాదంతో కూడుకున్న విషయం. తిరిగి వెళ్ళేటప్పుడో, వెళ్ళిన తర్వాతో, పాక్ మిలిటరీ చేతుల్లో పడే ప్రమాదం వుంది. నిరాశతో తిరిగి పోతున్న ఆ యువకుల ముఖాలు జాలిగొల్పేట్టుగా వున్నాయి.

వచ్చిన వాళ్ళందరినీ, ఎందుకని "వైటింగ్ క్యాంపులలో వుండకూడదని" బంగ్లాదేశ్ విద్యార్థి నాయకులను అడిగాను, ప్రతిరోజూ వస్తున్న వందలాది విద్యార్థులకు, భోజన వసతి సౌకర్యాలు కల్పించే ఆర్థిక స్తోమత తమకులేదని, పైగా పెద్దసంఖ్యలో ఒకచోట యువకులను కేంద్రీకరించి వుంచటం పాక్ మిలిటరీ నుండి ప్రమాదకరమని వారు చెప్పారు.

శిక్షణ రెండురకాలుగా యిస్తున్నారు. ఆత్మ రక్షణ చిన్న చిన్న దాడులపైన, పాక్ మిలిటరీ గుంపుల మీద, మెరుపుదాడి చేసే టెక్నిక్, పాక్ పరిపాలనా వ్యవస్థను విచ్ఛిన్నంచేసే, ముఖ్యంగా రోడ్లు రవాణా తపాలా సౌకర్యాలను విచ్ఛిన్నం చేయడం వగైరాలు మొదటి రకం. ఈ శిక్షణ దాదాపు 2 వారాల నుండి 4 వారాలదాకా వుంటుంది.

వివిధ రకాలైన ఆయుధాలనువాడే విధానం, రెగ్యులర్ గెరిల్లా శిక్షణ సైనిక రెజిమెంట్లను, మిలిటరీ స్థావరాలను విచ్ఛిన్నంచేసే శిక్షణ వగైరా రెండో రకం.

విద్యార్థుల్లో అధికభాగం మొదటి రకం శిక్షణే పొందుతున్నారు. రెండు రకాల శిక్షణలోను "ఫస్టు ఎయిడ్". కొంతమేరకు రాజకీయ సిద్ధాంతాలపై శిక్షణ కూడా యిస్తున్నారు. పాకిస్థాన్ పుట్టుక గుత్త పెట్టుబడి పెరుగుదల, ఫ్యూడల్ వాదులతో లాయీ మిలిటరీ ప్రభుత్వ స్థాపన వగైరా అంశాలతో బంగ్లాదేశ్ పోరాట పూర్వరంగాన్ని, ఆర్థిక రాజకీయ సాంఘిక రంగాలలో పోరాటాన్ని వివరిస్తున్నారు. అలాగే ప్రపంచ సామ్రాజ్యవాదం, వివిధ వలస దేశాల స్వాతంత్ర్య పోరాటం గురించిన అంశాలు కూడా బోధించబడుతున్నాయి.

విద్యార్థి సంఘాలు నిర్వహిస్తున్న పాఠశాలల్లో, యువ దేశభక్తులు సంపూర్ణ రాజకీయ చైతన్యంతో కూడిన స్వాతంత్ర్య యోధులుగా తయారౌతున్నారు. ఐతే వీరికున్న వనరులు అత్యల్పం కావటం దురదృష్టకరం.

యువకుల దృఢదీక్ష

ఈ యువకుల్లో అన్నివర్గాలనుండి వచ్చిన విద్యార్థులున్నారు. ఒక రోజు ఉదయమే, అగర్తలా దగ్గరున్న ఒక క్యాంపు వద్ద రిక్రూటుమెంటు కోసం వేచి వున్న క్యూలో 12 సంవత్సరాల కుర్రవాణ్ణిచూసి ఆశ్చర్యపోయాను. ఎందుకొచ్చావని అడిగాను. శిక్షణ కోసమని తడుముకోకుండా చెప్పాడు. "తన కుటుంబాన్నంతా పాక్ మిలిటరీ హత్య చేసిందని, తనొక్కడు ఏకాకినని, ఏదో రకంగా స్వాతంత్ర్య పోరాటంలో తను పాల్గొనాలనే పట్టుదలతో దాదాపు వందమైళ్లు నడిచివచ్చాననీ" చెప్పాడు. అనేకమంది విద్యార్థులు స్వాతంత్ర్య కాంక్షతో తమ కుటుంబాలను వొదిలిపెట్టి వచ్చారు.

రాత్రి 7 గంటలతర్వాత సరిహద్దుల వేపుపోనివ్వరు. సహజంగా ఆ సమయంలో శరణార్థులు కూడ అటు వేపునుండి రారు. సరిహద్దులకు దగ్గరగా వుండే ప్రాంతాల్లో రాత్రివేళల్లో ఎడతెరపిలేకుండా మెషిన్ గన్ చప్పుళ్లు వినవచ్చు. అగర్తాల, కరింగంజ్‌ల సరిహద్దుల్లో నైతే, మన సరిహద్దుల్లో మైలు లోపలగా వున్నఇళ్ళల్లో పడుకున్నా, తుపాకి చప్పుళ్ళు ప్రక్క వీధుల్లోకాలుస్తున్నంత పెద్దగా వినబడుతాయి. పాకిస్థాన్ మిలిటరీ పిచ్చి ఎట్టినట్లుగా, హఠాత్తుగా జరిపే కాల్పుల్లో అమాయకులు అనేకమంది చనిపోవడంకూడ జరిగింది.

సైనిక శిక్షణ సంస్థలు

బంగ్లాదేశ్ స్టూడెంట్సు యూనియన్ మాత్రమేగాక, ఇతర రాజకీయ పార్టీలు, ముఖ్యంగా అవామీలీగ్, బంగ్లాదేశ్ సైనిక శాఖ నడుపుతున్న "సైనిక శిక్షణ సంస్థలు" సరిహద్దులపొడవునా పెద్ద సంఖ్యలో వున్నాయని తెలిసింది. అందులో కొన్ని మరీ చిన్నవి. కొన్ని మాత్రమే ఎక్కువ సంఖ్యలో శిక్షణ యివ్వగలిగేవి.

గెరిల్లాలు ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఆయుధాలలో దాదాపు సగభాగం పాకిస్థాన్ మిలిటరీమీద దాడిచేసి పట్టుకున్నవే.

గతంలో ఈస్టు బెంగాల్ రైఫిల్స్ రెజిమెంటులోను సరిహద్దు రక్షక పోలీసు దళంలోను, ఉన్న సైనికులు ప్రస్తుతం ముక్తిఫౌజ్ (విముక్తి సైన్యం) పేరుతో పోరాడుతున్నారు.

వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తలు, మిలిటరీ శిక్షణలేని స్వాతంత్ర్యయోధులు, కొద్దివారాల శిక్షణ పొంది "ముక్తివాహిని" పేరుతో పోరాటం కొనసాగిస్తున్నారు. ఇంతవరకు పోరాటం యిప్పటివరకు పరిమితిస్థాయిలోనే జరుగుతున్నది.

ముక్తిఫౌజ్ కార్యకలాపాలు చాలవరకు సమన్వయంగా జరుగుతున్నప్పటికీ ముక్తివాహిని పోరాటం మాత్రం ఈమధ్యదాకా నిర్మాణయుతంగా లేదు. ఎవరికి తోచినట్లు వారు, చాలచోట్ల పరిమితుల్లో పోరాడుతున్నారు. సమన్వయీకరణ గనుక జరిగితే, పోరాటాన్ని ఉధృత దశలోకి తీసికెళ్ళే అవకాశముంది.

బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటున్న శక్తులన్నింటి ఐక్యత యింతవరకు ఏర్పడలేదు. అలాంటి ఐక్య సంఘటన ఏర్పరచాలని బంగ్లాదేశ్ కమ్యూనిస్టుపార్టీ విజ్ఞప్తి చేసింది.

అన్నిటికంటె పెద్ద పార్టీ ఐన "అవామీలీగ్" ఈ విషయంలో చొరవ తీసుకోవాల్సి వుంది. దురదృష్టవశాత్తు యింతవరకు "అవామీలీగ్" ఈ విషయంలో మౌనం వహిస్తూ వచ్చింది.

అయితే ఎట్టకేలకు ఎక్కువ రోజుల క్రితం అవామీలీగ్, నేషనల్ అవామీపార్టీ, (ముజఫర్) బంగ్లాదేశ్ కమ్యూనిస్టుపార్టీ, నేషనల్ అవామీపార్టీ (భషానీ గ్రూపు), బంగ్లాదేశ్ నేషనల్ కాంగ్రెసు ప్రతినిధులతో బంగ్లాదేశ్ మంత్రివర్గ, సలహా మండలి ఏర్పడింది. ఇదియింకా అభివృద్ధిచెంది పూర్తిస్థాయి జాతీయ విముక్తి సంఘటనగా ఆవిర్భవించడం బంగ్లాదేశ్ విముక్తి పోరాటానికి ఎంతగానో దోహదం చేస్తుంది.

1000 మంది యువతీ యువకుల ప్రదర్శన

యువజన వారోత్సవం సందర్భంగా మంగళాపురంలో

మంగళాపురం, సెప్టెంబరు 24

కమ్యూనిస్టుపార్టీ మహాసభల గౌరవార్థం యువజన వారోత్సవం జరపవలసిందిగా యువజన ఫెడరేషన్ యిచ్చిన పిలుపు మేరకు స్థానిక యువజన ఫెడరేషన్ ఆధ్వర్యాన యీ నెల 14 వ తేదీన 1000 మంది యువతీ యువకులతో బ్రహ్మాండమైన ఊరేగింపు, బహిరంగసభ జరిగాయి.

ఊరేగింపు అగ్రభాగాన ఎర్రజెండాలు యువజన పతాకాలు, బ్యానర్లు ధరించి, నినాదాలు యిస్తూ, సుశిక్షితులైన యువ మహిళా కార్యకర్తలు కవాతు చేస్తూ నడవడం ఒక అపూర్వ దృశ్యం. ఈ ప్రదర్శన గ్రామంలోని ముఖ్య వీధులలోను, చుట్టుపట్ల గల పల్లెలలోను సుమారు మూడు గంటల పాటు జరిగింది. స్త్రీ. పురుషులు ఉత్సాహంతో యీ ప్రదర్శనను తిలకించారు.

ఈ ప్రదర్శన యిలా కొనసాగుతుండగా, గ్రామంలోని 10 కేంద్రాలలో అరుణపతాకాలను, యువజన పతాకాలను ప్రతిష్ఠించడం జరిగింది.

సాయంత్రం 6 గంటలకు యీ ప్రదర్శన గ్రామంలోని కేంద్ర స్థలానికి చేరుకోగానే, శ్రీ చంద్ర రాజకుమారి అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది.

కమ్యూనిస్టుపార్టీ మహాసభల గౌరవార్థం యువజన సమాఖ్య కొనసాగిస్తున్న ఎర్రజెండా జైత్రయాత్ర ప్రాముఖ్యతను శ్రీ కిలారు పూర్ణచందరావు వివరించారు. తర్వాత తాలూకా కమ్యూనిస్టు నాయకులు శ్రీ కంఠంనేని అచ్యుత రామయ్య పార్టీ మహాసభల ప్రాధాన్యతను. వాటి కార్యక్రమాన్ని వివరించారు.

ఆరోజు ఉదయం యువజన కార్యకర్తలు అరుణ పతాక జైత్రయాత్ర సందర్భంగా యిచ్చిన నినాదాలను గోడలమీద వ్రాశారు. యువ మహిళా కార్యకర్తలు పార్టీ మహాసభలను గురించి ప్రజలకు వివరించి విరాళాలు వసూలు చేశారు.

పెంటపాడులో ఎర్రజండాకు ఘనస్వాగతం

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 23

శ్రీకాకుళం నుండి హైదరాబాదు సాగిపోతున్న ఎర్రజెండా తాడేపల్లిగూడెం తాలూకాలో ప్రవేశించగానే పెంటపాడులో ఘనమైన స్వాగతం లభించింది.

150 సైకిళ్ళను ఎర్రజెండాలతో అలంకరించుకొని ఊరేగింపుగా ఎదురేగి ఎర్రజెండాకు స్వాగతం చెప్పారు. ఊరేగింపులో వివిధ యూనియన్లకు చెందిన వారు పాల్గొన్నారు. వివిధ యూనియన్ల వారు రు. 200ల దండలు ఎర్రజెండాకు అలంకరించారు.

అరుణ పతాక ఆవిష్కరణ

రాజమండ్రిలో

రాజమండ్రి, సెప్టెంబరు 24

ప్రదేశ్ కమ్యూనిస్టుపార్టీ మహాసభలు జరగనున్న దృష్ట్యా ఈ నెల 1 వ తేదీన శ్రీకాకుళం జిల్లానుండి బయలుదేరిన ఎర్రజెండా జైత్రయాత్ర గౌరవార్థం 21 వ వార్డు కమ్యూనిస్టుపార్టీశాఖ కృష్ణారావు పేట యువజన సంఘం అధ్వర్యమున కృష్ణారావు పేటలో అరుణ పతాకోత్సవము జరుపబడింది.

పట్టణ కమ్యూనిస్టు సమితి సభ్యులు శ్రీ కొట్టపు లక్ష్మణస్వామి అరుణపతాకాన్ని ఆవిష్కరించి పార్టీ కార్యక్రమాన్ని వివరించారు.

శ్రీ గుదే అప్పారావు అధ్యక్షతను సభ జరిగింది.

పార్టీ జెండాకోసం అసువులు అర్పించిన అమర వీరులకు జోహార్లు అర్పిస్తూ, శ్రీయుతులు కొట్టపు లక్ష్మణస్వామి నేమాల వీరాస్వామి, గుదే అప్పారావు మాట్లాడారు.

సభానంతరం అల్పాహార విందు జరిగింది.

భారత - సోవియట్ సఖ్యతా సంబంధాల పటిష్ఠత

— ఫిర్యూబిన్

మాస్కో, సెప్టెంబరు 23

భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి వచ్చే వారం సోవియట్‌లో చేసే పర్యటన ద్వారా భారత - సోవియట్ సఖ్యతా సంబంధాలు మరింత పటిష్ఠమవుతాయని సోవియట్ విదేశాంగశాఖ డిప్యూటీ మంత్రి నికొలాయ్ ఫిర్యూబిన్ నేడిక్కడ అన్నారు.

మాస్కోలోని భారత రాయబారి శ్రీ షెల్వంకర్ గౌరవార్థం సోవియట్ విదేశాంగ శాఖ కార్యాలయం ఏర్పాటు చేసిన విందులో ప్రసంగిస్తూ ఆయన పైవిధంగా అన్నారు.

ఇటీవల భారత - సోవియట్‌లు చేసుకున్న ఒప్పందానికి చారిత్రక ప్రాముఖ్యం వున్నదని ఫిర్యూబిన్ అన్నారు.

ఎం.ఏ, ఎం. ఎస్ సీల ప్రవేశానికి దరఖాస్తుల గడువు పొడిగింపు

హైదరాబాదు, సెప్టెంబరు 22

రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో (ఫిజిక్స్ కెమిస్ట్రీ) ఎం ఎస్ సి లోను, మాథమెటిక్స్ ఎం. ఎ లోను ప్రవేశానికి అర్జీలు స్వీకరించే గడువు ఈనెల 25 వరకు పొడిగించబడినట్టు కాలేజీ ప్రిన్సిపాల్ తెలియ చేస్తున్నారు.

మిలాయ్ హంతకునిపై ఆరోపణల కొట్టివేత

నిర్దోషిగా అమెరికా కోర్టుతీర్పు

అట్లాంటా, సెప్టెంబరు 23

వియత్నాంలో 1968 లో మిలాయ్ సామూహిక హత్యలకు కారకుడైన అమెరికన్ సైనికాధికారి కెప్టెన్ ఎర్నెస్ట్ మెడీనాపైగల ఆరోపణలన్నింటినీ అమెరికా సైనికకోర్టు నేడు త్రోసిపుచ్చింది.

కెప్టెన్ మెడీనా నిర్దోషియని తీర్పు నిచ్చింది. కెప్టెన్ మెడీనా 1968 లో వియత్నాంలో ఒక స్త్రీని దారుణంగా హత్యచేసి వందమంది పౌరులను కాల్చమని ఉత్తర్వు లిచ్చాడు.

5 గురు సభ్యులుగల సైనికకోర్టు గత ప్రకటనం మెడీనాపైగల 102 ఆరోపణలను త్రోసిపుచ్చింది.

గూడూరు సంస్కృతి సమ్మేళనం

నాటక, నాటిక పోటీల ఫలితాలు

గూడూరు, సెప్టెంబరు 24

నెల్లూరు జిల్లా గూడూరు సంస్కృతి సమ్మేళనం వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 18, 19, 20 తేదీలలో నాటక, నాటిక, ఏకపాత్రాభినయ పోటీలు జరిగాయి.

18వతేదీన శ్రీ కొంగర జగ్గయ్య ప్రారంభోత్సవం చేశారు. ఉస్మానియా కళాశాల తెలుగు లెక్చరర్ శ్రీ షేకు దావూద్ సాహెబ్ ప్రసంగించారు. 21 వ తేదీన శ్రీ నాగయ్యకు సన్మానం జరిగింది. ప్రముఖ వచన చిత్ర విద్వాంసు శ్రీ ఎం. ఎస్. రెడ్డి శ్రీ నాగయ్యను పరిచయం చేస్తూ ఆయన గొప్పతనాన్ని కొనియాడారు. తర్వాత పసివటి కుమారి రాజశ్రీ బహుమతీ ప్రదానం చేశారు.

ఫలితాలు

నాటకాలలో ఉదయశ్రీ నట సమాఖ్య విజయవాడ వారి 'గాలివాన'కు ప్రథమ బహుమతి, రైల్వేఇన్‌స్టిట్యూట్ డ్రమటిక్ గ్రూపు, బిట్రగుంట వారి 'విశ్వశాంతి'కి ద్వితీయ బహుమతి లభించాయి.

నాటికలలో అభ్యుదయకళాసమితి (తెనాలి) వారి 'సంస్కృతి'కి ప్రథమ బహుమతి. ఐడి. జి. ఆర్టుష్ నెల్లూరువారి 'పావలా' కు ద్వితీయ బహుమతి లభించాయి.

నాటకాలలో ఉత్తమనటుడుగా గాలివానలో రామయ్య పాత్రధారి ?, ఎస్. శ్రీనివాసరావు ఉత్తమనటిగా గాలివానలో సుందరి పాత్రధారి కుమారి కె విజయశ్రీ, ఉత్తమ హాస్యనటుడుగా గాలివానలో అంబం పాత్రధారి శ్రీ ఎన్. సంజీవి నాటికలలో ఉత్తమ నటుడుగా సంస్కృతిలో లక్ష్మణరావు పాత్రధారి శ్రీ బి శంకరరావు ఉత్తమ నటిగా 'పావలా' నాటకంలో దేవమ్మ పాత్రధారిణి శ్రీమతి కృష్ణవేణి ఉత్తమ విలన్‌గా ఎ.ఎన్.ఆర్. కల్చరల్ అసోసియేషన్ గుంటూరువారి 'పిడుగు-పిడుగు'లో రంగారావు పాత్రధారి శ్రీ పి కోటేశ్వరరావు, ఎన్నికయ్యారు. ఉత్తమ రంగాలంకరణ ఐడి. జి ఆర్టుష్, నెల్లూరువారి 'పావలా' ఉత్తమ దర్శకత్వం 'పిడుగు-పిడుగు' దర్శకుడు శ్రీ పి కోటేశ్వరరావు.

ఉత్తమ రచన: 'సంస్కృతి' రచయిత శ్రీ కె. శంకరరావు.

ఏకపాత్రాభినయం పోటీలో 'యుగంధర' పాత్రధారి శ్రీ యం. వరదరామయ్య (వేమూరు)ప్రథమ బహుమతి, 'పీఠాధిపతి' పాత్రధారి శ్రీ టి కె పద్మనాభం. (కాళహస్తి)కి ద్వితీయ బహుమతి లభించాయి. ఇదిగాక మరి కొందరికి ప్రత్యేక బహుమతు లివ్వబడ్డాయి.

శతాబ్దాల నాటి ఉక్కునౌక

తంజావూరు, సెప్టెంబరు 22

తమిళనాడులోని కరైకాల్ దగ్గర అనేక శతాబ్దాలనాటిదిగా భావించబడుతున్న ఒక ఉక్కునౌక బయటపడింది. తీరానికి 160 కిలోమీటర్ల దూరంలో జాలరులు కనుగొన్నారు. ఇది డచ్ ప్రభుత్వ ఓడ అని తెలుస్తోంది, ఇక్కడి ఓడ రాకపోకలకు ఆటంకం కలుగుతుండగా, కారణమేమిటో అని పరిశీలించగా ఈ ఓడ బయట పడింది.

నూనెశుద్ధికి ఇరాక్ తోడ్పాటు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22

వాయువ్య భారతదేశంలో నిర్మించదలచిన నూనెశుద్ధి కర్మాగార నిర్మాణానికి సహాయం చేయడానికి ఇరాక్ ముందుకు వచ్చింది.

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధ్యక్షులు శ్రీ ఎం. రామస్వామిని ప్రస్తుతం మన దేశంలో పర్యటిస్తున్న ఇరాక్ ప్రతినిధి వర్గం నిన్న కలుసుకొంది. భారతదేశానికి క్రూడ్‌ఆయిల్‌ను అమ్మటానికి కూడా ఇరాక్ ముందుకువచ్చింది.

పరస్పర సహకారం భారతదేశానికి క్రూడ్‌ఆయిల్ అమ్మకం తదితర ఇరాక్ ప్రతిపాదనలను గురించి భారత నిపుణుల బృందం పరిశీలించవలసివుంది.

ఈ ప్రతిపాదనలను ఆమోదించటం జరిగితే ఇటువంటి సహకారం గల నూనె కర్మాగారాల్లో ఇది మూడవది అవుతుంది. ప్రస్తుతం ఉన్న రెండు కర్మాగారాలూ మద్రాసులోనూ కొచ్చిన్‌లోనూ ఉన్నాయి.

నర్సాపురం తాలూకా వార్తలు

[విశాలాంధ్ర విలేకరి]

చేపలు పట్టడంలో వివాదం పరిష్కారం

నర్సాపురం, సెప్టెంబరు 22

పశ్చిమగోదావరిజిల్లా నర్సాపురంతాలూకా పేరుపాలెం సముద్రతీరం చేపలవేటకు ప్రసిద్ధి చెందినది. కాకినాడ, మచిలీపట్నం నుండి పడవలు, వేట పరికరాలతో వచ్చి వేటాడేవారికి స్థానికులకు తగాదాలు జరుగుతూ వున్నాయి.

ఈ వివాదాన్ని ఇటీవల నర్సాపురం సబ్‌కలెక్టర్ కలుగజేసుకొని పరిష్కరించారు. ఇతర ప్రాంతాలవారు 35 నావలతో వేటాడుకొనుటకు స్థానికులు 30 నావలతోనూ 5 యాంత్రిక బోట్లతోనూ వేటాడుకొనుటకు ఒక ఒప్పందం కుదిరింది.

యాంత్రికబోట్లు పేరుపాలెం ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీకి ప్రభుత్వం ఇస్తుంది మరి; కార్మికులు పట్టిన చేపలు యావత్తు సొసైటీకి అమ్మాలని, సొసైటీ ఈ చేపల్ని దూర ప్రాంతాలకు ఎగుమతి చేయుటకు ప్రభుత్వం ఒక వ్యానును సొసైటీకి యివ్వాలని నిర్ణయం జరిగింది.

ఈ సమావేశంలో కాకినాడ-రాజమండ్రి. ఏలూరు కేంద్రాల మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు వివిధ గ్రామాలనుండి మత్స్య కార్మిక పెద్దలు పాల్గొన్నారు

ట్యూబెక్టమీ ఆపరేషన్లు

ఈ నెల 20 వ తేదీన మొగల్తూరుసమితికి చెందిన మొగల్తూరు ఆస్పత్రిలో 154, మేడపాడు ఆసుపత్రిలో 44, నర్సాపురం ఆసుపత్రిలో 40 మొత్తం 238 ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయబడ్డాయి

ఆపరేషన్ చేయించుకొనే వారికి కుటుంబ నియంత్రణ వారు రు. 15, కలెక్టర్ రు. 10లు నగదు యిస్తున్నారు

ఆధునిక వ్యవసాయంపై శిక్షణ

పశ్చిమగోదావరిజిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రం (గోపన్నపాలెం) వారి ఆధ్వర్యాన మొగల్తూరు సమితి గ్రామీణ యువకులకు శిక్షణా తరగతులు నడపబడ్డాయి

మేలురకం వరి వంగడాలు, ఎరువుల వాడకం, క్రిమి సంహారకద్రవ్యాలు, భూమిని ఉపయోగించే విధానం, పశు సంపద-పోషణ, కోళ్ళపెంపకం, పాడిపరిశ్రమలు.శిశుసంరక్షణ మొదలైన అంశాలపై యీ శిక్షణ యివ్వబడింది. ఈ నెల 13 నుండి 17వ తేదీవరకు ఈ శిక్షణాకేంద్రం నర్సాపురంలో జరిగింది యువతి యువకులు మొత్తం 60 మంది శిక్షణ పొందారు.

ఇళ్ళస్థలాలకు పట్టాలు

పశ్చిమ గోదావరిజిల్లా కలెక్టరు ఈనెల 17 వ తేదీ మొగల్తూరులో 40 కౌరేపాలెంలో 69 కుటుంబాల వారికి ఇళ్ళస్థలాలకు పట్టాలు ఇచ్చారు. ఈ సందర్భంలో జరిగిన సభకు నర్సాపురం సబ్ కలెక్టర్, తహసిల్దారు, మొగల్తూరు సర్పంచ్ తదితరులు హాజరైనారు.

పోడూరు సమితిలో హరిజన అభివృద్ధికి చర్యలు

పోడూరు సమితికి చెందిన గ్రామాలలోని హరిజన వాడలలో రహదారి పారిశుధ్యం, మంచినీటి సౌకర్యాలకు రు. 7,18,500లను సమితి సర్వసభ్య సమావేశం మంజూరు చేసింది

అలాగే షెడ్యూల్డు, వెనుకబడిన తరగతులవారి గృహనిర్మాణానికి రు 1,82,000 కేటాయించడమైంది ఈ నిధుల్ని సాంఘిక సంక్షేమశాఖ పోడూరుసమితికి మంజూరు చేసింది

వద్దిపర్రు, కొమ్ముచిక్కాల, పెనుమంచిలి, జగన్నాథపురం, గుమ్మలూరు, కోడేరు, కవిటం, జున్నూరు, పున్నలంక, వల్లూరు, కొమ్మంచిలి, ఖిమలాపురం, ఆగర్రు, నడిపూడి, పూలపల్లి మొదలైన గ్రామాలలో సమితి ఆధ్వర్యాన యీ పథకాలు అమలు జరుగుతాయి.

పండితవిల్లూరులో హరిజన దినోత్సవం

పోడూరుసమితికి చెందిన పండితవిల్లూరులో ఇటీవల హరిజన దినోత్సవంజరిగింది. హరిజనాభివృద్ధికి కృషిచేయవలసిన అవశ్యకతపై శ్రీయుతులు శ్రీకె.ఆర్. జె.టి.భూపతి, శ్రీఆర్ దేవన్, దిగుమర్తి ప్రకాశం, కె, పక్కా నంద్ తదితరులు ప్రసంగించారు.

శ్రీ సదా కృష్ణమూర్తి హరిజన విద్యార్థుల సహాయార్థం రు. 10 లు ఇచ్చారు. పేద విద్యార్థులకు, ఆటలలో గెలుపొందినవారికి బహుమతులు పంచబడ్డాయి

శ్రీ వీరరాఘవులు విడుదలకై విజ్ఞప్తి

నెల్లూరు తాలూకా కమ్యూనిస్టుసమితిచే

మనుబోలు, సెప్టెంబరు 23

నక్సలైటు పేరుతో గత నెల 22 న నెల్లూరు డి. ఎస్. పి అరెస్టు చేసిన మనుబోలు గ్రామవాసియును, కమ్యూనిస్టుపార్టీ సానుభూతిపరుడైన శ్రీ నవకోటి వీరరాఘవులును వెంటనే విడుదల చేయాల్సిందిగా నెల్లూరు తాలూకా కమ్యూనిస్టు సమితి ఒక ప్రకటనలో జిల్లా కలెక్టరు, పోలీసు సూపరింటెండెంటును కోరింది.

ఆ ప్రకటనలో యిలా వుంది:

ఈ వీరరాఘవులు గత ఎన్నికల్లో కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థి శ్రీ స్వర్ణ వేమయ్యకు సహకారం యిచ్చారనే ఉద్దేశంతో గ్రామ పెత్తందార్లు సి. ఐ. డి.లకు రిపోర్టుచేసి, అరెస్టు చేయించినట్లు తెలుస్తున్నది.

పేద ప్రజల, వ్యవసాయ కార్మికులచేత బంజరు ఆక్రమణలు చేయిస్తూ వారికి నాయకత్వం వహిస్తున్న వారిపై ఆక్రోశంతో నక్సలైట్ల పేరుతో గ్రామపెత్తందార్లు కేసులు పెట్టిస్తున్నారు.

మనుబోలు గ్రామంలో మరో హరిజనుడు శ్రీ ఆదపాల శ్రీనివాసరావుపై నక్సలైట్ పేరుతో తప్పుడుకేసు పెట్టించాలని చూస్తున్నారు.

అంతేగాక మడమనూరు గ్రామంలోని పేద ప్రజలకు జరిగే అన్యాయాలను ఎదిరిస్తున్న కమ్యూనిస్టు కార్యకర్తలపై హత్యా ప్రయత్నాలు చేస్తున్నారు.

మనుబోలు పిర్కాలోని మడమనూరు గ్రామంలో కమ్యూనిస్టు కార్యకర్త శ్రీ పెటూరి సుబ్బారామయ్య, నెల్లూరు తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యుడు శ్రీ కటారి శేషయ్య కమ్యూనిస్టు పార్టీ సానుభూతిపరుడు శ్రీ దిని చెంచయ్య తదితరులపైన నక్సలైట్లు పేరుతో పిర్కా పెత్తందార్లు పోలీసు రిపోర్టు పంపినట్లు తెలుస్తున్నది. మడమనూరులో గానీ, మనుబోలుగానీ నక్సలైట్లకు సంబంధించిన వారెవరూ లేరు. అచ్చటవున్న వారంతా భారతకమ్యూనిస్టుపార్టీ సానుభూతి పరులు మాత్రమే

పై విషయాలన్నీ నెల్లూరుజిల్లా కలెక్టరు పోలీసుసూపరింటెండెంటు విచారించి, న్యాయం కలిగించ వలసిందని, అక్రమంగా అరెస్టు చేయబడిన శ్రీనవకోటి వీరరాఘవులును వెంటనే విడుదల చేయాల్సిందిగా తాలూకా కమ్యూనిస్టుసమితి కోరుతున్నది.

బంగ్లాదేశ్‌పట పాక్ ఉద్యోగి విశ్వాసం ప్రకటన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23

ఇక్కడి పాక్ హైకమిషన్ కార్యాలయంలోని ఒక బెంగాలీ ఉద్యోగి నేడు పాక్ ప్రభుత్వంతో తెగతెంపులు చేసుకుని బంగ్లాదేశ్ ఎడల విశ్వాసం ప్రకటించారు.

సభలు- సమావేశాలు

ఆంధ్ర ఆయుర్వేద పరిషత్ కార్యనిర్వాహకవర్గ సమావేశం విశ్వవైద్య పరిషత్తు ఈ నెల 26 వ తేదీ పశ్చిమ గోదావరిజిల్లా భీమవరంలో శ్రీ రామకృష్ణ ప్రకృతి ఆశ్రమంలో జరుగుతుంది.

బంగ్లాదేశ్ వీరోచిత పోరాటానికి జేజేలు

ఖాటేనగర్, సెప్టెంబరు 23

జాతీయ విముక్తి ప్రజాస్వామ్యాల కోసం బంగ్లాదేశ్ ప్రజానీకం సాగిస్తున్న చారిత్రాత్మక పోరాటానికి రాష్ట్ర కమ్యూనిస్టుపార్టీ 12వ మహాసభ జేజేలర్పిస్తోంది. ఈపోరాటం మరిన్ని నూతన, మహత్తర విజయాలు సాధిస్తూ కీలకమైన దశలో ప్రవేశిస్తున్నది.

ముక్తివాహిని, ఇతర దేశభక్తిబలాలు చారిత్రాత్మకమైన సాయుధ ప్రతిఘటనతో యాహ్యాఖాన్ రజాకార్ల సేనపై నానాటికీ భారీ నష్టాలు కలిగిస్తున్నాయి. యాహ్యా రజాకార్ల సైన్యం బంగ్లాదేశ్‌లో స్వాతంత్ర్య పోరాట యోధులపై మున్నెన్నడూ లేని కసాయి పనులకు పాల్పడుతోంది. బంగ్లాదేశ్‌కు పూర్తి ప్రజామద్దత్తు ఉన్నది. అందువల్లనే పౌరప్రభుత్వం ఏర్పాటు చేయడంలో యాహ్యాఖాన్ విఫలమయ్యాడు. ముఖ్యంగా విస్తృతమైన గ్రామీణ ప్రాంతాల్లో యాహ్యాఖాన్ కిరాతకప్రభుత్వం అయిదునెలలపాటు కసాయి ఫాసిస్టు దారుణాలు సాగించినప్పటికీ గూడా పౌరపాలన పునరుద్ధరించలేకపోయింది. ఆగ్నేయాసియాలో ఆధిపత్యంపొందేందుకు ఒక ప్రక్క వియత్నాంలో ఓటమి పొందుతున్న అమెరికన్ సామ్రాజ్యవాదులు, విముక్తి ఉద్యమాన్ని కాలరాచేందుకు పాక్ పాలకులకు ఆయుధాలు, డబ్బులతో సాయం చేస్తున్నారు.

స్వాతంత్ర్యోద్యమాలను దారుణంగా అణిచి వేయడానికి వివిధ దేశాలలో అప్రతిష్ఠపాలైన ప్రభుత్వాలకు, ప్రపంచ సామ్రాజ్యవాద శక్తులకు నాయకత్వం వహిస్తున్న పెంటగన్ యుద్ధ ప్రభువులు విపరీతంగా సాయం చేస్తున్నారు. పెంటగన్ యుద్ధ ప్రభువులకు వ్యతిరేకంగా మరొక యుద్ధరంగం తెరవడం ద్వారా బంగ్లాదేశ్ పోరాటం జాతీయ విముక్తి ఉద్యమాల మహత్తర చరిత్రలో నూతన శకాన్ని ప్రారంభించింది. బంగ్లాదేశ్ పోరాటం, పీడక పాలనకు వ్యతిరేకంగా జరుగుతున్న జాతీయ విముక్తి పోరాటానికి వాస్తవమైన ప్రతినిధి.

అంతేగాక బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాటం, సామ్రాజ్యవాద వ్యతిరేక, శాంతి, అభ్యుదయ పోరాట శక్తులలో తన సముచిత స్థానాన్ని సగర్వంగా పొందుతుందనే విషయాన్ని ఆ పోరాటం ప్రాముఖ్యత దృష్ట్యా నొక్కి చెప్పాల్సిఉంది.

జాతీయ విముక్తి పోరాటాలకు తామే విశ్వసనీయమైనమిత్రులమని మావోయిస్టులు మోసపూరితంగా ప్రచారం చేసుకుంటున్నారు.

కాని అమెరికాతో మిలాఖతై అత్యంత కిరాతకులైన పశ్చిమ పాక్ పీడకులకు ఆయుధాల సాయంతో సహా వత్తాసు యిస్తున్న మావోయిస్టుల అవకాశవాద తప్పుడు వైఖరిని కూడా బంగ్లాపోరాటం బహిర్గతం చేస్తోంది.

బంగ్లాదేశ్ స్వాతంత్ర్య యోధుల పోరాటంలో పెరుగుతున్న ఐక్యతపట్ల ఈ మహాసభ హర్షం ప్రకటిస్తోంది. జాతీయ విముక్తి సంఘటన ఏర్పరచి, బలిష్ఠంచేసి, విస్తృతపరచడంలో మార్గావరోధంగా నిలిచిన కొన్ని మావో అనుకూల గ్రూపులు, మరికొన్ని శక్తుల విచ్ఛిన్నకరమైన [illegible] యత్నాలను త్రిప్పికొట్టడంలో బంగ్లాదేశ్ కమ్యూనిస్టుపార్టీ కృతనిశ్చయంతో కీలకము నిర్ణయాత్మకము అయిన పాత్రనిర్వహించ వలసిఉన్నది.

యాహ్యాఖాన్ కిరాతకముఠా కబంధహస్తాల నుండి బంగ్లాదేశ్‌ను విముక్తి చేసేందుకై ఐక్య కార్యాచరణ రూపొందించడడానికొసం అవామీలీగ్, నేషనల్ అవామీపార్టీ (భాషానీవర్గం) నేషనల్ అవామీపార్టీ బంగ్లాదేశ్ కమ్యూనిస్టుపార్టీ, నేషనల్ కాంగ్రెసు ప్రతినిధులతో ఉన్నత స్థాయీ సమన్వయ కమిటీ ఏర్పాటును ఈ సందర్భంగా మహాసభ హర్షిస్తోంది. జాతీయ విముక్తిసంఘటన ఏర్పరచే మార్గంలో యిదొక ముందడుగు.

ప్రపంచంలోని ఈ భాగంలో సామ్రాజ్యవాద భౌగోళిక వ్యూహం వ్యాపింపజేయడానికి ఈ పరిస్థితిని అవకాశంతీసుకునే అభివృద్ధి నిరోధక, మితవాద, అమెరికా అనుకూల శక్తుల కుట్రలపట్ల ప్రజలను ఈ మహాసభ హెచ్చరిస్తోంది. ముఖ్యంగా ఈ పరిస్థితికి మతం రంగు పులమడానికి యత్నిస్తున్న జన సంఘ్ వంటి మత తత్వ పార్టీలను మహాసభ ఖండిస్తోంది.

బంగ్లాదేశ్ పోరాటానికి సాయంచేసేందుకు ఆయుధాలు ఇవ్వడం, స్వాతంత్ర్య పోరాట యోధులకు పెద్దఎత్తున శిక్షణతో పాటు భారత ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకోవాలని ఈ మహాసభ డిమాండ్ చేస్తోంది. బంగ్లాదేశ్‌లో పోరాడుతున్న ప్రజానీకానికి వాస్తవంగా పెద్దఎత్తున సాయం చేసేందుకు వీలుకల్గించే బంగ్లాదేశ్ గుర్తింపు సమస్యను ఇక ఎంతమాత్రమూ జాప్యం చేయరాదని మహాసభ డిమాండ్ చేస్తోంది.

యాహ్యా సైనికకోర్టులో తప్పుడు విచారణకు గురి అవుతున్న బంగ్లా ప్రజల ప్రియతమ నాయకుడు షేక్ ముజిబుర్ రహ్మాన్ విడుదలకై తక్షణమే శక్తివంతంగా జోక్యం కలిగించుకోవాలని ప్రపంచ ప్రజలకూ, ప్రభుత్వాలకూ ఈ మహాసభ విజ్ఞప్తి చేస్తోంది.

విజయవాడ నుండి హైదరాబాద్‌కు బస్సు
యువజనోత్సవాలకు

విజయవాడ, సెప్టెంబరు 23

ప్రదేశ్ పార్టీ మహాసభల సందర్భంగా ఈ నెల 28న సాయంత్రం హైదరాబాదులో జరిగే యూత్‌డే ఉత్సవాల్లో పాల్గొనేందుకు వీలుగా ఒక బస్సు 28వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు విజయవాడ వినోదా టాకీస్ సమీపంలోవున్న కృష్ణాజిల్లా పార్టీ కార్యాలయం నుండి బయల్దేరుతుంది. ముందుగా రిజర్వేషన్ చేయించుకొని వారికికూడా రానుపోను 15 రూపాయల రేటుకే బస్సులో అవకాశం ఏర్పాటుచేయబడుతుంది. కాబట్టి వచ్చేవారంతా సకాలంలో పార్టీ కార్యాలయానికి రావాలని శ్రీ కొల్లి నాగేశ్వరరావు ప్రకటిస్తున్నారు.

ఈనెల 28న యువజన సమాఖ్య సమితి సమావేశం

హైదరాబాద్, సెప్టెంబరు 24

ఆంధ్రప్రదేశ్ యువజన సమాఖ్య సమితి సమావేశం సెప్టెంబరు 28వ తేదీన హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబడింది.

సమితి సభ్యులందరూ దీనినే నోటీసుగా భావించి హైదరాబాదుకు 28వ తేదీన ఉదయం 9.00 గంటలకు చేరుకోవలసిందిగా ఆంధ్రప్రదేశ్ యువజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ కె. ప్రతాపరెడ్డి విజ్ఞప్తి చేశారు.

తణుకు నుండి కొచ్చిన్‌కు బస్సు

ఏలూరు, సెప్టెంబరు 23

కొచ్చిన్‌లో జరుగనున్న భారతకమ్యూనిస్టుపార్టీ 9వ మహాసభకు తణుకునుండి అక్టోబరు 2వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు డీలక్సు బస్సు బయలు దేరనున్నది.

తణుకు కమ్యూనిస్టుపార్టీ ఆఫీసు నుండి బయలుదేరె ఈ బస్సు ఏలూరుగుండా కొచ్చిన్ వెళ్ళి తిరిగి అక్టోబరు 18వ తేదీ నాటికి తణుకు చేరును. టిక్కెట్టు రు. 100లు. ఆంధ్ర, మద్రాసు, మైసూరు, కేరళలోని ముఖ్యమైన ప్రదేశాలను చూడవచ్చును. మహాసభ ప్రదర్శనను తిలకించవచ్చును.

వ్యవధి తక్కువగా నున్నందువలన మొత్తం సొమ్ము ముందుగా చెల్లించి సీటు రిజర్వుచేసుకోవాలి. మిగతా ఖర్చులు ఎవరివి వారే భరించుకోవాలి. ఈ క్రింది అడ్రసులకు డబ్బు పంపించాలి.

ఎ. రాజారావు
కమ్యూనిస్టుపార్టీ
ఆఫీసు
ఏలూరు.

వడగూరి రాజారావు
సైకిలు షాపు
కమ్యూనిస్టుపార్టీ
ఆఫీసు, తణుకు.

విజయవాడ కాలేజీలో 'దొంగ' విద్యార్థి అరెస్టు

విజయవాడ, సెప్టెంబరు 22

విజయవాడ లయోలాకాలేజీలో ప్రస్తుతం జరుగుతున్న పి.యు.సి. పరీక్షల సందర్భంగా వీరేంద్ర చౌదరి అనే విద్యార్థి స్థానే పరీక్షలు వ్రాస్తున్న మహమ్మద్ ఉమర్‌బాబు అనే విద్యార్థిని పోలీసులు యీ రోజు అరెస్టు చేశారు.

ఈ ఉమర్‌బాబు యిదివరకు పి.యు.సి. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు.

3వ రోజున అనుమానించి ఉమర్ బాబును అరెస్టు చేశారు.

మహాసభ ప్రాధాన్యత

(1వ పేజీ తరువాయి)

సంఖ్యలో యిటీవల నక్సలైట్లు పార్టీలో చేరటాన్ని యిది నిరూపిస్తుంది. కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు - లెనినిస్టు) దుస్సాహసిక విధానాలు వైఫల్యం చెందటాన్ని గుర్తించి వీరు పార్టీలో చేరారు. వీరిలో కొంత మంది శ్రీకాకుళ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాన్ని అర్థం చేసుకొని తిరిగి పార్టీలో చేరారు. పార్టీలోకి తిరిగి వచ్చిన వందలాది మందికి ప్రాతినిధ్యం వహిస్తూ వీరు ప్రస్తుతం యీ పార్టీ మహాసభలో పాల్గొంటున్నారు.

తెలంగాణా సమస్య పట్ల పార్టీ రాజకీయ పంథా, తెలుగు మాట్లాడే ప్రజల ఐక్యతను కాపాడటం, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమంగా అభివృద్ధిచేసే కార్యక్రమం లేనందువలన ఏర్పడిన తెలంగాణా ప్రాంతప్రజల న్యాయమైన కోర్కెలను పరిష్కరించటంలోను సూత్రబద్ధమైన వైఖరితో కూడుకుని వున్నది. అభివృద్ధి కార్యక్రమాలను త్వరితంచేసి, తెలంగాణా ప్రాంతీయ కమిటీ అధికారాలను విస్తృతం చేయటం ద్వారా యీ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలనే పార్టీ ప్రతిపాదనల ఉపయోగకరమైన స్వభావాన్ని యిటీవల వచ్చిన తాజా పరిణామాలు ధృవీకరించాయి.

శ్రామికవర్గంకొరకు చేసిన కృషి వలన పార్టీ ముందుకు పోయింది. కీలకరంగాలలో కొత్తగా అనేకమంది శ్రామిక ప్రజలను ట్రేడ్‌యూనియన్ల నాయకత్వాన ఆర్గనైజ్ చేయటం జరిగింది. దీనిలో పార్టీ కార్యకర్తలు అగ్రభాగాన నిలబడివున్నారు. యీ వర్గంలో పార్టీకున్న ప్రజాపునాది గత సంవత్సరం గుంటూరులో ఎ. ఐ. టి. యు. సి. మహాసభను విజయవంతంగా జరపటంలో ప్రతిబింబించింది.

యీ కాలంలో యువకులు, విద్యార్థులలో పార్టీ ముందుకు వెళ్ళింది. రాష్ట్ర యువజన, విద్యార్థి సమాఖ్యలు నిర్వహించిన నిరుద్యోగ వ్యతిరేక ఉద్యమంలో పార్టీ కార్యకర్తలు అగ్రభాగాన నిలబడి పని చేసి పార్టీని ముందుకు తీసుకుపోయారు. మహాసభ సందర్భంగా రాష్ట్రంలో 14 జిల్లాలలో ఎర్రజెండా జైత్రయాత్రను విజయవంతంగా ముగించుకుని వచ్చిన యువకమ్యూనిస్టులు ప్రశంసనీయులు.

పార్టీ సభ్యులను సిద్ధాంతపరంగాను, రాజకీయంగాను విద్యావంతులను చేసేందుకు అనేక స్థాయిలలో పార్టీ రాజకీయ పాఠశాలలను నిర్వహించింది.

ప్రజలలో పార్టీ రాజకీయ, నిర్మాణ పెరుగుదలకు యిదిచిహ్నం. యీ పెరుగుదలను పార్టీ సభ్యత్వం ప్రతిబింబిస్తుంది. ఏలూరు పార్టీ మహాసభ అనంతరం పార్టీ సభ్యత్వం 11 వేలు పెరిగింది. ఏలూరు మహాసభ నాటికిమొత్తం 26వేలువుండగా అదియిప్పుడు 37,500 లకు చేరుకున్నది.

హైదరాబాద్ మహాసభ యీ పరిణామాలన్నీ చర్చించి, అపారమైనపార్టీ బలాలుకూడిన సంఘటితపరచడంద్వారా సమూలపరివర్తనలో పార్టీని పటిష్ఠవంతమైన, సమరశీలమైన ఆయుధంగా తయారు చేసేందుకు అవసరమైన నిర్మాణరంగాల లక్ష్యాలను రూపొందిస్తుంది. పార్టీ కార్యక్రమంలో పేర్కొన్న జాతీయ ప్రజాస్వామ్యం లక్ష్యాలను సాధించటంలో ప్రజల ఉమ్మడి పోరాటాలలో నాయకత్వం వహించే బలమైన వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన నిర్మాణ లక్ష్యాలను ముందుకు తీసుకుపోయే కార్యక్రమాన్ని మహాసభ రూపొందించనుంది.

పార్టీ నిర్మాణంపై ప్రధానంగా చర్చించే హైదరాబాద్ మహాసభ మన రాష్ట్రంలో బలమైన కమ్యూనిస్టుపార్టీ నిర్మాణంలో మూలమలుపు కాగలదు.

శ్రీ రాజేశ్వరరావు ఉద్ఘాటన

(1వ పేజీ తరువాయి)

శక్తుల విజయం, రాజ్యాంగ సంస్కరణలలో మన పార్టీ పంథా సరైనదని ధృవపడినాయి.

మార్క్సిస్టుల విచ్ఛిన్నం

మార్క్సిస్టుపార్టీ తన తప్పుడు కార్యక్రమం అవగాహనవల్లే యీ పరిణామాలను ఊహించలేకపోయింది. గత రెండు సంవత్సరాలుగాపిల్లి మొగ్గలు వేస్తున్నది. వారు చెప్పినట్లు కేంద్రంలో బడా బూర్జువా వర్గ నాయకత్వం వున్నట్లయితే, ఆ బడాబూర్జువా వర్గ ప్రయోజనాలకే భిన్నమైన రాజ్యాంగ సంస్కరణలు ఎలా సాధ్యమయ్యాయి ?

మార్క్సిస్టుపార్టీ వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యతకు హానికరమైన విధానాన్ని చేబట్టింది. ఐక్య సంఘటనల ప్రతిష్ఠను మంటకల్పింది. తోటి వామపక్ష ప్రజాతంత్ర పార్టీ కార్యకర్తలను, నాయకులను హత్యచేసే రాజకీయాలను విడనాడనిదే రెండు పార్టీల మధ్య ఐక్యత సాధ్యపడదు.

మార్క్సిస్టుపార్టీ నాయకత్వంలో సోవియట్ వ్యతిరేకత జీర్ణించుకున్నది. వారిపార్టీ పుట్టుకకే అది ప్రాతిపదిక, కాంగ్రెసుపట్ల, సోవియట్ యూనియన్‌పట్ల భారత కమ్యూనిస్టుపార్టీపట్ల గుడ్డి విద్వేషంతో అభివృద్ధి నిరోధక చర్యలకు సహాయపడుతున్నారు. భారత సోవియట్‌ల స్నేహ ఒడంబడికతీసుకుంటే వీరు అభివృద్ధి నిరోధకుల బృందగానంలో శ్రుతి కల్పారు.

ఈ ఒప్పందంతో చైనా మావోయిస్టు నాయకుల, పాకిస్తాన్ సైనిక ముఠాల [illegible] బెడిసినాయి, భారత దేశానికి వ్యతిరేకంగా అమెరికన్ సామ్రాజ్యవాదుల, చైనా, పాకిస్తాన్‌ల కుట్రను భగ్నంచేసింది.

ప్రగతిశీలమైన ఈ ఒప్పందం బంగ్లాదేశ్ విముక్తి పోరాటానికి బలమైన అండ. అయినా మార్క్సిస్టుపార్టీ నాయకత్వం మొక్కుబడిగా ఆహ్వానిస్తూ, జనసంఘీయుల లాగా యిది బంగ్లాదేశ్‌కు నష్టం చేసిందా ? భారత్ బంగ్లాదేశ్‌ను గుర్తించడాన్ని అపు చేసిందా ? అని కుశంకలు వ్యక్తం చేస్తున్నారు.

ఇది ఎవరికి సహాయ పడుతుంది, అభివృద్ధి నిరోధకులకు కాదా ?

మార్క్సిస్టుపార్టీ అంతర్జాతీయంగా ఏకాకి అయింది. అంతర్జాతీయ కమ్యూనిస్టుపార్టీల గుర్తింపుకొరకు ప్రయత్నించి విఫలమైంది. వీరు నమ్ముకున్న చైనా నాయకులు వారినినట్టేట ముంచారు, అయినప్పటికీ మావోయిస్టు నాయకత్వాన అంతర్జాతీయ కమ్యూనిస్టుపంథాతో సంబంధాలు త్రెంచుకోలేదు.

సోవియట్-చైనాలు రెండూ తమ స్వార్థ ప్రయోజనాలతో వ్యవహరిస్తున్నాయని చింతిస్తూ "కొరియా', 'వియత్నాం, 'రుమేనియా' లతో కలిసి అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో మూడవశక్తి అనే ఒక విచిత్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తున్నారు. ఈ ధోరణి వారి బెంగుళూరు కేంద్ర కమిటీ తీర్మానాలలో వ్యక్తం అయింది. అయితే చైనా, అమెరికాల మైత్రిపట్ల వియత్నాం తీసుకున్న వైఖరి వీరికి ఆశాభంగం కలిగించింది.

భారతదేశంలో వామపక్ష ప్రజాతంత్ర శక్తుల విశాల ఐక్యతకు హానికరంగావున్న తన విధానాలను మార్క్సిస్టుపార్టీ విడనాడాలి అటువంటి విధానాలను ఓడించినప్పుడే సుదృఢమైన ఐక్యత చేకూరుతుంది.

కాంగ్రెసుపట్ల వైఖరి

ఇందిరా కాంగ్రెసు ఒకే మూసకాదు. అభివృద్ధి కాముకులకు, అభివృద్ధి నిరోధకులకు, తీవ్రంగా జరుగుతున్న రాజకీయ సంఘర్షణలకు అది వేదిక అయింది. కాంగ్రెసు చీలికవల్ల ఆ పార్టీలో ఏర్పడిన రాజకీయ విభజన దేశమంతటా ఒకే రీతిగా లేదు

కేరళ, బెంగాల్ తదితర రాష్ట్రాలలో ప్రగతిశీల శక్తులు పైచేయిసంపాదించే. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాలలో అది ప్రతిబింబించలేదు.

ప్రజాతంత్ర ఉద్యమాలు నిర్మిస్తే కాంగ్రెసులోపల సంఘర్షణ యింకా తీవ్రతరమవుతుంది. భూస్వామ్య వ్యతిరేక, గుత్త పెట్టుబడిదారీ వ్యతిరేక సామ్రాజ్యవాద వ్యతిరేకశక్తులతోకూడిన విశాల జాతీయ ప్రజాతంత్ర సంఘటన అపుడే ఆవిర్భవిస్తుంది. జాతీయ ప్రజాతంత్ర సంఘటనలో యీ కాంగ్రెసు మొత్తంగా వుంటుందని భావించరాదు.

కాంగ్రెసు లోపల, వెలుపలవున్న ప్రగతిశీల వామపక్ష ప్రజాతంత్ర శక్తుల విశాలసంఘటనమాత్రమే పెట్టుబడిదారీ వ్యతిరేకపంథాను చేపట్టి జాతీయ ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలను సంపూర్తి చేయగలదు.

రానున్న కాలంలో కమ్యూనిస్టు పార్టీ పార్లమెంటరీ ఎక్స్‌ట్రా పార్లమెంటరీ ప్రజాతంత్ర ఉద్యమాలను పెద్ద ఎత్తున నిర్మించనుంది ఇందులో కలిసి వచ్చే అన్ని శక్తులతో సమిష్టిగా కృషి చేస్తుంది. ఈ ఉద్యమాలలో కలిసి రావలసిందిగా సకల వామపక్ష ప్రజాతంత్ర పార్టీలకు, శక్తులకు శ్రీ రాజేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

అంతర్జాతీయ పరిస్థితి

అంతర్జాతీయ పరిస్థితిని శ్రీ రాజేశ్వరరావు సమీక్షిస్తూ, సోషలిస్టు శక్తుల బలం నేడు నిర్ణయాత్మక శక్తిగా వుందన్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు సోషలిస్టు ప్రపంచం సహాయంతో నానాటికి బలపడుతున్నాయి. ఒక వైపు సోషలిస్టు దేశాలు ఆర్థిక సౌష్ఠవంతో పురోగమిస్తుండగా రెండవ వైపు పెట్టుబడిదారీ ప్రపంచం ముఖ్యంగా దానికి నాయకత్వం వహిస్తున్న అమెరికా సామ్రాజ్యవాదులు తీవ్ర ఆర్థిక సంక్షోభానికి గురయ్యాయి నేడు అమెరికాలో 60 లక్షలమంది నిరుద్యోగులు, 80 లక్షల మంది పాక్షిక నిరుద్యోగులు వున్నారు. ఒకప్పుడు అంతర్జాతీయ ద్రవ్య రంగంలో ప్రమాణికంగా వున్న డాలరు నేడు పతనమైందని అన్నారు.

శ్రీ రాజేశ్వరరావు ఇంకా యిలా అన్నారు.

ఈ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు నిక్సన్, తోటి పెట్టుబడిదారీ దేశాలపైకి ఈ భారాన్ని నెట్టటానికి యత్నిస్తున్నాడు దీనితో పెట్టుబడిదారీ వర్గంలో అంతర్గత సంఘర్షణ తీవ్రతర మవుతున్నది.

రెండవ వైపున చైనా మావోయిస్టు నాయకత్వం సంకుచిత జాతీయవాద దృక్పథంతో పూర్తి అవకాశవాదవిధానాన్ని అనుసరిస్తూ ప్రపంచ కార్మికోద్యమానికి తీరనిద్రోహం చేస్తున్నది

తాజా ఉదాహరణలే తీసుకుంటే వియత్నాం పూర్తిగా బయటపడటానికి యత్నిస్తున్న నిక్సన్‌తో సఖ్యతకు మావోయిస్టులు ఒడికట్టారు. బంగ్లాదేశ్ విముక్తిపోరాటాన్ని రక్తపుటేరుల్లో ముంచుతున్న పాకిస్తాన్ సైనిక ముఠాకు సహాయం చేస్తున్నారు. సూడాన్‌లో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్బంధకాండతో అణచివేస్తూ కమ్యూనిస్టు నాయకులను హత్య చేస్తున్న "నుమేరిని" అభినందించారు.

చైనాలో సాంస్కృతిక విప్లవం పేరుతో కమ్యూనిస్టుపార్టీని, ప్రజా సంఘాలను నాశనం చేశారు. దీనివల్ల చైనా కమ్యూనిస్టుపార్టీలో నిరంకుశమైన సైనికవర్గం స్థానం సంపాదించింది. పొలిట్‌బ్యూరోలోని 27 మందిలో 15 మంది, కేంద్ర కమిటీలోని 279 మందిలో 148 మంది ప్రాంతీయ విప్లవ కమిటీలలోని 200 మందిలో మూడవవంతు సైనికాధికారులున్నారు.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని చైనానాయకత్వంచీల్చి తీవ్రమైన నష్టం కలిగించింది.

లాటిన్‌అమెరికాలో చేగువేరా పేరిట ప్రజా పునాదిలేని సాయుధ విప్లవ ఎత్తుగడలద్వారా సోషలిజం సాధించవచ్చనే సిద్ధాంతం కొంతకాలం ఆకర్షణీయంగా కనిపించినా, చివరకు ఆచరణలో విఫలమైంది, కార్మికవర్గ సంఘటితశక్తిని దానికి రాజకీయ ప్రాతినిధ్యం వహించె కమ్యూనిస్టుపార్టీల నాయకత్వాన్ని ఈ గ్రూపులు నిరాకరించాయి. ఈ అరాచక వైఖరిని రెజిస్‌డెబ్రీ, హెర్బెర్ట్ మార్క్యూస్ వంటి పెట్టిబూర్జువా మేధావులు సిద్ధాంతికంగా నాయకత్వం వహిస్తున్నారు.

మరొకవంక రోజర్ గారడీ (ఫ్రెంచి) ఫిషర్ (ఆస్ట్రియా), వంటి తత్వవేత్తలు మార్క్సిజాన్ని సంస్కరణవాద ధోరణితో కూడిన పెడతోవ పట్టించటానికి కొత్త సిద్ధాంతాలను ప్రతిపాదించారు. శాస్త్రీయ, సాంకేతిక విప్లవాన్ని ప్రాతిపదికగా చేసుకొని వర్గ పోరాటం లేకుండానే పెట్టుబడిదారీ సమాజం సోషలిస్టు పరివర్తన చెందుతుందనే గారడీ సిద్ధాంతం కమ్యూనిస్టు వుద్యమానికి కొత్తేమీ కాదు. యిన్ని రకాల విచ్ఛిన్నకర విధానాలను ఎదుర్కొంటూనే అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం దిన దినాభివృద్ధి చెందుతుంది.

భారతదేశంలోనూ, అంతర్జాతీయంగానూ వున్న ఈ అనుకూల పరిస్థితులను సుపయోగించుకొని మన దేశంలో సమరశీల ప్రజా పోరాటాల ద్వారా జాతీయ ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలను నిర్వహించేందుకు బలీయమైన, సుశిక్షితమైన కమ్యూనిస్టుపార్టీ నిర్మాణానికి పూనుకోవలసిందిగా శ్రీ రాజేశ్వరరావు ప్రతినిధులకు ఉద్బోధించారు.

మన కార్యక్రమం, రాజకీయ అవగాహన సరైనవని రుజువయ్యాయి. ఈ పరిస్థితులలో కార్మికవర్గం, వ్యవసాయ కూలీలు, పేద రైతులు, మధ్య తరగతి శ్రమజీవులపునాదిపై సుశిక్షితమైన పునాదిని నిర్మించాలి. ఇందుకు పార్టీ నిర్మాణాన్ని కట్టుదిట్టంచేసి ప్రజా వుద్యమాలకు నాయకత్వం వహించేందుకు పార్టీని సంసిద్ధపరచటమే పార్టీ మహాసభ ముందున్న నిర్మాణ కర్తవ్యమని చెప్తూ శ్రీ రాజేశ్వరరావు హర్షధ్వానం మధ్య తన ప్రసంగాన్ని ముగించారు.

ఎర్రజెండా క్రిందే సోషలిజం స్థాపన

హైదరాబాద్, సెప్టెంబరు 24

చికాగో నగరంలో కార్మికుల రక్త ప్రవాహంలో నుండి ఆవిర్భవించి పునీతమైన ఎర్రజెండా, తెలంగాణా రైతు పోరాటంలో నాలుగు వేల మంది అమర వీరుల రక్తంతో మరింత ఎరుపెక్కింది. అలాంటి చరిత్రవున్న ఎర్రజెండా నాయకత్వంలోనే సోషలిజాన్ని స్థాపించ గలుగుతాము.

శ్రీ రావి నారాయణరెడ్డి ఎర్రజెండాఎగురవేస్తూ చేసిన ప్రసంగాన్ని కొంతభాగాన్ని నిన్న యిచ్చాం. మిగతాది యీరోజు యిస్తున్నాం.

నేడు శాస్త్రీయ సోషలిజం వైపుకు యువతరం ఆకర్షించబడుతున్నది. అంతేకాక నేటి పరిస్థితుల్లో జాతీయస్వాతంత్ర్యాన్ని కాపాడుకోవటానికి, పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదులవిష కౌగిలినుంచి బయటికి రావటానికి యువకులు చైతన్య వంతంగా ముందుకు వస్తున్నారు. పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదుల విషకౌగిలినుండి బయటపడటానికి జరుగుతున్న వియత్నాం, బంగ్లాదేశ్ పోరాటాలలో యువకులుముందుకురుకుతున్నారు. అని శ్రీ వెంకటేశ్వర్లు అన్నారు.

శాస్త్రీయ సోషలిజం స్థాపన ఒక ఎర్రజెండా నాయకత్వంలోనే జరగగలదని, అందుకు యువకులు ఇంకా ముందుకు రావాలని శ్రీ వెంకటేశ్వర్లు కోరారు.

ఎర్రజెండా జైత్రయాత్ర బాధ్యత యువకులపై వుంచినందుకు కమ్యూనిస్టుపార్టీకి శ్రీ వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రజెండాను శ్రీ నారాయణరెడ్డి అందుకున్న వెంటనే ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ సీలం రాజశేఖరరెడ్డి ప్రసంగిస్తూ, నవ సమాజాన్ని నిర్మించాలని అన్నారు. యువకులే నవసమాజ నిర్మాతలని అన్నారు.

ఆ తరువాత శ్రీ రావి నారాయణరెడ్డి ఎర్రజెండాను ఎగురవేశారు.

అనంతరం మృతవీరుల సంస్మరణ స్థూపంపై శ్రీ రాజశేఖరరెడ్డి పుష్ప గుచ్ఛం వుంచి జోహార్లు అర్పించారు. తదనంతరం హాజరైన ప్రతినిధులందరూ మృతవీరులకు జోహార్లు అర్పించి సభాస్థలికి వెళ్ళారు.

భీమవరంలో ప్రజలచే బియ్యం స్వాధీనం
మిల్లుపై దాడిచేసి

భీమవరం, సెప్టెంబరు 24

స్థానిక ఉమా సోమేశ్వర రైస్ మిల్లుపై గత రాత్రి 300 మంది ప్రజలు దాడిచేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శ్రీ కె. సత్యనారాయణమూర్తి. మరో నలుగురికి ఈ మిలులో వాటాలున్నవి.

గత 10 రోజుల నుండి పట్టణంలో గంటల తరబడి క్యూలో నిలుచున్నప్పటికి ప్రజలకు బియ్యం దొరకక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

కిలోగ్రామ్ బియ్యం ఒక రూపాయి చొప్పున కావాల్సినన్ని బియ్యాన్ని సరఫరా చేస్తామని రైస్‌మిల్లర్లు కలెక్టరుకు వాగ్దానం చేశారు. ఆ వాగ్దానం ప్రకారం బియ్యాన్ని సరఫరా చేయకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ప్రస్తుతం కిలో ముతక బియ్యాన్ని 1.25 రూపాయలకు అమ్ముతున్నారు.

మిలులో నుంచి మొత్తం 354 బస్తాల బియ్యాన్ని ప్రజలు తీసుకుపోయినట్లు రైస్ మిల్లర్లు రిపోర్టు యిచ్చినట్లు డి. ఎస్. పి. తెలిపారు.

74 కేజిల తూకం గల 36 బస్తాల బియ్యం, 100 బస్తాల రాసిమీద బియ్యాన్ని, 50 కేజిల తూకం గల 50 బస్తాల ధాన్యాన్ని, 8 నూకల బస్తాలను, 300 ఖాళీ బస్తాలను 300మంది ప్రజలు మిల్లుపై దాడిచేసి తీసుకవెళ్ళినట్లు రైస్ మిల్లర్లు తమరిపోర్టులో పేర్కొన్నారు.

ఈ దాడి సందర్భంగా 20మందిని విచారిస్తున్నామని 20బస్తాల బియ్యాన్నిస్వాధీనం చేసుకొన్నట్లు డి. యస్. పి. చెప్పారు.

ఆదాయపు పన్ను ఎగగొట్టేందుకు ఎక్కువ బస్తాలు బియ్యం పోయాయని మిల్లర్లు రిపోర్టు ఇచ్చినట్లు ప్రజలు అనుకొంటున్నారు.

మిల్లుగోదాము [illegible] కిందవున్నదని, ఎక్కువ నష్టాన్ని చూపి ఆ నష్టాన్ని బ్యాంకు ద్వారా పొందాలని మిల్లర్లు పోలీసు రిపోర్టు ఇచ్చారని కూడా ప్రజలు అనుమానిస్తున్నారు.

పట్టణంలో మంచిరకం బియ్యాన్ని సరఫరా చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలుకోరుతున్నారు.

త్వరపడండి   ఆలసించిన ఆశాభంగం!

నాగభూషణం అండ్ పార్టీ వారిచే

"రక్తకన్నీరు" (నాటకం)

సెప్టెంబరు 26, 27 తేదీలలో

రవీంద్ర భారతి (హైదరాబాదు) లో రాత్రి 9-30 కు ప్రదర్శించబడును

రేటు : రు. 5, రు. 10, రు. 15, రు. 25

(10 రూపాయల ఆపై టిక్కెట్లకు సీట్లు రిజర్వేషన్ గలదు)

అడ్వాన్సు బుకింగ్ : తాజ్ మహల్ హోటల్స్:

ద్వారకా హోటల్, స్వరాజ్ హోటల్‌ల వద్ద లభించును.

SOVEREIGN
BRANDY
A TOAST
TO GOOD TASTE !

Manufactured by:
KHODAY INDUSTRIES PRIVATE LTD.
10, 1st Main Road, Gandhinagar, Bangalore-9

డిస్ట్రిబ్యూటర్లు :
మెసర్స్. విజయబీర్ & వైన్‌స్టోర్స్, హైదరాబాదు

అధిక దిగుబడి నిచ్చే క్రొత్త రకాలు వస్తున్నాయని తెలిసింది...
దిగుబడి నధికం జేసే గ్రోమోర్ [illegible] మారావా?
GROMOR 28-28-0

దిగుబడి నధికం జేసే గ్రోమోర్ కాంప్లెక్స్ ఎరువులు వాడితే, అధిక లాభాలు ఖాయం.
ఎక్కువ పోషక పదార్థాలున్న గ్రోమోర్ కాంప్లెక్స్ ఎరువులు అన్ని రకాల పైర్లకు బాగా పనికొస్తాయి, ఎందుకనంటే :
■ వాటిలో నత్రజని అమోనియా రూపంలో ఉంటుంది. ■ వాటిలో ఉన్న భాస్వరామ్లం పూర్తిగా నీటిలో కరుగుతుంది. ■ అవి గుళ్ళు గుళ్ళుగా ఉండటం వల్ల అన్ని విధాలా అనువైనవి,
గ్రోమోర్ వాడటం వల్ల పంట దిగుబడి ఎట్లా పెరిగేది దేశం అంతటా వేలకు వేల రైతులు తెలుసుకున్నారు, మీరు కూడా గ్రోమోర్ వాడి లాభాలు సంపాదించండి !

గ్రోమోర్ అమోనియం ఫాస్ఫేట్ 28-28-0   గ్రోమోర్ యన్.పి.కె. 22-22-11
గ్రోమోర్ అమోనియం ఫాస్ఫేట్ 20-20-0   గ్రోమోర్ యూరియా 46-0-0

మీకు కావలసిన గ్రోమోర్ ఎరువులు మీకు దగ్గరలో నున్న ప్యారీ వారి ఎరువుల డిస్ట్రిబ్యూటర్ల వద్ద కొనండి.

చేనుకు చేవ
రైతుకు రొఖ్ఖం—
గ్రోమోర్

coromandel
కోరమాండల్
ఫెర్టిలైజర్స్

AIYARS-CF 158 TL-AP

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ప్రింటర్ అండ్ పబ్లిషర్ : టి. వెంకటేశ్వరరావు. ఎడిటర్ , వేములపల్లి శ్రీకృష్ణ, ముద్రణ : స్వతంత్ర ఆర్టు ప్రింటర్స్. విజయవాడ-4. R. No. 1138/57

ఆంధ్ర విశ్వవిద్యాలయం బి. ఇ. పరీక్షా ఫలితాలు

విశాఖపట్నం, సెప్టెంబరు 24

ఆంధ్ర విశ్వవిద్యాలయం 1971 జూలై ఆగస్టులో నిర్వహించిన బి.ఇ. III పరీక్షలో క్రిందివి నంబర్లుగల అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారు.

బి.ఇ. III మెకానికల్ ఇంజనీరింగ్

మొత్తం పరీక్షపాసైనవారు: 822 825 810 848 850 860 861 865 866 868 874 875 877 882 886 894 899 904 901 902 904 905 912 915 916 918 921 922 923 925 926.

థియరీ

ఎకనామిక్స్ లో ప్యాసైనవారు: 831 815 884 895 906 911 917 921 924 934.

మేథమేటిక్స్ V: 826 836 845 884 894 895 906 911 917 921 924 934 936.

మేథమేటిక్స్ V: 826 828 834 884 897 906 911 917 921 934 935-ఎ 937.

ఫిజిక్స్-III: 826 36 45 84 94 94 95 911 17 21 38

స్ట్రెంక్త్ ఆఫ్ మెటీరియల్స్ అండ్ థియరీ ఆఫ్ స్ట్రక్చర్స్: 826 36 45 81 89 90 91 93 95 96 906 11 17 21 24 34 38

ఫ్లూయిడ్ మెకానిక్స్: 836 45 90 906 11 17 21 24 34 38

ఎప్లయిడ్ తెర్మోడైనమిక్స్ I: 826 836 845 884 906 911 917 924 924 934

ఎలక్ట్రికల్ టెక్నాలజీ I: 845 884 906 917 921.

డిజైన్ అండ్ డ్రాయింగ్ ఆఫ్ మెషిన్ మెంబర్సు I: 826 831 845 834 890 906 911 917 921 924 934.

ప్రాక్టికల్స్

స్ట్రెంక్త్ ఆఫ్ మెటీరియల్స్: 826 836 845 884 906 911 917 921 924 934

ఎప్లయిడ్ తెర్మోడైనమిక్స్ I: 826 836 845 884 906 911 917 921 924 934

ఫ్లూయిడ్ మెకానిక్స్: 826 836 845 884 903 911 917 921 924 934

వర్క్షాపు ప్రాక్టీసు III: 826 836 845 884 906 911 921 924 934

843 834 935 939 నంబర్ల ఫలితాలు తరువాత ప్రకటించబడతాయి.

బి. ఇ. II/III

మెకానికల్ ఇంజనీరింగ్

1195 నంబరుగల ఒకే అభ్యర్థి మేథమేటిక్స్ III లో పాసైయ్యారు.

మెరైన్ ఇంజనీరింగ్ విభాగం

మొత్తం పరీక్ష ప్యాసైన వారు: 941 911 915 941 947.

థియరీ

911 942 948 లు ప్రిన్సిపల్స్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ మారిటైమ్ లా లో ప్యాసైయారు.

మేథమేటిక్స్ V లో ప్యాసైన వారు: 911 912 918.

మేథమేటిక్స్ VI: 912 941 950

ఫిజిక్స్-III: ఎవరూ లేరు

942 48 లు స్ట్రెంక్త్ ఆఫ్ మెటీరియల్స్ అండ్ థియరీ ఆఫ్ స్ట్రక్చర్స్ లో పాసయారు.

941 48 లు ఫ్లూయిడ్ మెకానిక్స్ లో పాసయారు.

911 42 48 లు అప్లైడ్ థెర్మోడైనమిక్స్ I లో పాసయారు.

ఎలక్ట్రికల్ టెక్నాలజీ I లో 918 మాత్రమే

941 42 48 లు డిజైన్ డ్రాయింగ్ ఆఫ్ మెషిన్ మెంబర్సు I లో పాసయారు.

ప్రాక్టికల్స్

స్ట్రెంక్త్ ఆఫ్ మెటీరియల్స్ లో పాసైన వారు: 941 942 943.

అప్లైడ్ థెర్మోడైనమిక్స్ I లో పాసైన వారు 911 941 918.

ఫ్లూయిడ్ మెకానిక్స్ లో పాసైనవారు: 911 942 943.

వర్క్‌షాప్ ప్రాక్టీస్ III లో పాసైన వారు: 911 942 918.

నవంబరులో నిర్వహించే బి.ఇ పరీక్షలో పాల్గొనేందుకు రుసుము చెల్లింపు. పరీక్ష దరఖాస్తులు స్వీకరణకు 1971 అక్టోబరు 1 వ తేదీ ఆఖరు గడువుగా నిర్ణయించబడిందని విశ్వవిద్యాలయ పరీక్షల కంట్రోలర్ ప్రకటిస్తున్నారు.

శ్రీ వి. రాఘవన్ పి. టి. ఐ ప్రధాన సంపాదకులుగా నియామకం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23

పి. టి. ఐ. డైరెక్టర్ల బోర్డు సమావేశమై పి.టి.ఐ. ప్రధాన సంపాదకునిగా శ్రీ వి. రాఘవన్‌ను నియమించడానికి నిర్ణయించారు. శ్రీ రాఘవన్ ఇంతవరకు గత 9 సంవత్సరాలుగా పి టి ఐ. ఎడిటర్ గా పని చేస్తున్నారు.

భారతదేశం బియ్యానికి విదేశాల్లో గిరాకి

కొచ్చిన్, సెప్టెంబరు 22

భారతదేశంలోని బియ్యానికి విదేశాల్లో ముఖ్యంగా మధ్య, పశ్చిమ యూరప్ దేశాల్లో డిమాండ్ ఉంది. [illegible]ంగా ప్రసిద్ధిపొందిన పంజాబ్‌లో పండే 'బసుమతి' బియ్యం వల్ల దాదాపు 2.22 కోట్ల విదేశీ మారకద్రవ్యం లభ్యమౌతోంది. ఇక్కడ ఒక పత్రికా గోష్ఠిలో మాట్లాడుతూ రాష్ట్ర వాణిజ్య కార్పొరేషన్ అధ్యక్షుడు శ్రీ పి. ఎస్. టాండన్ ఇక్కడ తెలియజేశారు.

తెలుగు కలెక్షన్లతో విజయఢంకా మ్రోగిస్తున్న పూర్తి పంచరంగుల గూఢచారి చిత్రం
3 వ వారం
గూఢచారి 116
దర్శకత్వం: B.R.పంతులు నిర్మాత: M.R.K.శర్మ సంగీతం: M.S.విశ్వనాథం
విజయవాడ మారుతి


4 వ వారం
శ్రీలక్ష్మీ గణేష్ పిక్చర్స్ సమర్పించు
తిండిపోతు రాముడు
దర్శకత్వం: పి.మాధవన్ కె.రంగాచలం
శ్రీఫిలింస్
SUVARNA

అరబ్ జర్నలిస్టుల ఖండన

పాక్ సైనిక చర్యలపై

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23

ఇటీవల ఢిల్లీలో బంగ్లాదేశ్‌పై జరిగిన అంతర్జాతీయ సదస్సుకు పరిశీలకులుగా హాజరైన నలుగురు అరబ్ జర్నలిస్టులు నేడిక్కడ పాక్ సైనిక చర్యలను ఖండించారు.

1970 డిసెంబరు ఎన్నికల ప్రాతిపదికపై బంగ్లాదేశ్ సమస్యకు రాజకీయ పరిష్కారాన్ని కనుగొనాలని వారు కోరారు.

పై మేరకు వారు ఇక్కడి పాక్ హైకమిషనర్‌కు మెమొరాండం సమర్పించారు.

అయితే పాక్ ఐక్యత కాపాడాలని వారు తమ మెమొరాండంలో పేర్కొన్నారు.

బంగ్లాదేశ్ నాయకుడు న్యూయార్క్ పయనం

లండన్, సెప్టెంబరు 23

ఐ. రా. స. జనరల్ అసెంబ్లీ సమావేశానికి హాజరయ్యేందుకు బయలుదేరిన బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రతినిధి వర్గానికి నాయకత్వం వహించేందుకు బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల ప్రతినిధి శ్రీ అబూ సయ్యద్ చౌదరి నేడిక్కడ నుండి న్యూయార్క్ బయలుదేరారు.

పాపులర్ షూమార్టు
డిస్ట్రిబ్యూటర్సు
టాట్, ఫ్లెక్సు, మజ్బూత్,
కింగ్‌కాంగ్, స్వస్తిక్,
బియన్‌ప్లాస్టిక్సు, సియస్‌సి.

మిలటరీ ఇంజనీర్ సర్వీసులు

విశాఖపట్టణం 9 బి ఆర్. యస్. డి వద్దనున్న T/1/5 మరియు T/4/8 షెడ్లుకు ప్రత్యేక మరమ్మత్తుల కొరకు టెండరు ఫారాములను దాఖలుచేయుటకు కమాండరు వర్క్స్ ఇంజనీర్సు (పోర్ట్సు) విశాఖపట్టణమువారిచే దరఖాస్తులు 11.10.71 తేదీవరకు కోరబడుచున్నవి. ఎస్టిమేటెడ్ మొత్తము రు. 2.31 లక్షలు. వివరములకు 20.9.71 తేదీ నాటి ఇండియన్ ట్రేడ్ జర్నల్ చూడండి.

davp 683(711)/71